82

సృజన


ఆగస్టు 1978

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

నిర్వహణ

'సాహితీ మిత్రులు'



సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

ఆగస్టు 1978

82

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు ఈ సంచిక రు. 1-50 పైసలు

సృజన

ఆగస్టు 1978 మాస పత్రిక 82

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Warangal Printing Press, J.P.N. Road, Warangal - 506 002
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

స్వేచ్ఛ!

'స్వాతంత్ర్యం వచ్చి ఎన్ని సంవత్సరా లయింది?'– 'ఎవరికి?'– ఒక సినిమాలో ఇంటర్వ్యూలో వేసిన ప్రశ్నకు ఈనాటి యువతరం వేసిన ఎదురు ప్రశ్న యిది. 31 సంవత్సరాలు అంటే ఒక తరం గడచిపోయింది– ఆగస్టు 15న వచ్చిన స్వాతంత్ర్యం గురించి ఆరోజున వచ్చే ప్రత్యేక సంచికల్లో, దినమంతా ఊదరగొట్టే రేడియోల్లో, పల్లెలను విద్యావంతం చేయడానికి కొత్తగా వచ్చిన టెలివిజన్‌లలో, ఖద్దరు నాయకుల ఉపన్యాసాల్లో, బడుల్లో, బజార్లలో జెండావందనాల్లో– చదవడం, వినడం, చూడడం కన్నా 'స్వాతంత్ర్యం' ఈ తరం జీవన విధానంగా ఆచరణలోకి వచ్చిందా? ఒక బరిబాతల పిల్లవానికి ఎన్నికల ముందు మూడు రంగుల జెండా ఎవరో నాయకుడిస్తే ఏం చేసుకోవాలో తెలియక గోచీ పెట్టుకున్నాడట. ఆకాశంలో సమున్నతంగా ఎగరాల్సిన జాతీయ పతాకాన్ని అవమాన పరిచాడని పోలీసు లాకప్పులో చితకబాది 'హైదరాబాదు గోలీ' తినిపించారట పోలీసులు. మనం గౌరవించ వలసిన స్వాతంత్ర్య పతాకం మానవ విలువలకు గౌరవము, స్వాతంత్ర్యం తెచ్చిందా? రమేజాబీ 'తార్పుడు కత్తె' అని ఆరోపించడానికి పోలీసులు అల్లిన ఆసక్తిదాయకమైన కథ నిన్న, ఇవ్వాళ పత్రికలు, కొన్నయితే పతాక శీర్షికతో వేసినయ్. ఆమె తార్పుడు కత్తె, పసిపిల్లలనే తీసుకొని వచ్చి వ్యభిచార గృహాలకు అమ్ముతున్నదని పోలీసులు ఆరోపిస్తే వెంటనే ఆమెను అరెస్టుచేసి జెయిలుకు పంపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ మొదటివారంలో ఆమె విషయమై జరిగిన ఆందోళన తర్వాత, ముక్తధార్ కమీషన్ విచారణ తర్వాత ఆమె పట్ల పోలీసులకు, ప్రభుత్వానికి ఎంత అక్కసు వుండడానికి వీలుందో ఎవరైనా వివేకం వున్నవాళ్ళు అర్థంచేసుకోగలరు. కాని పోలీసులు తనను మానభంగం చేసి, తన భర్తను చంపారని చెప్పడానికి ముందు ఆమెకు పోలీసులతో శత్రుత్వం వుండడానికి ఆస్కారమే లేదు. ఆమె తరపున రాష్ట్రమంతటా ప్రజాస్వామ్య వాదులైన వేలమంది ఆందోళనచేసి అడిగినా నేరస్తులను అరెస్టూ చేయలేదు, జెయిలుకూ పంపించలేదు. పోనీ, రమేజాబీ వ్యభిచారిణి అని, తార్పుడు కత్తె అని, అమ్మాయిలను వ్యభిచార గృహాలకు అమ్ముతున్నదనీ, ఈ ఆరోపణలన్నీ కాసేపటికోసం యథార్థమే అని అంగీకరిద్దాం. అయితేమాత్రం ఆమెను మానభంగం చేయడానికి, ఆమె భర్తను చంపడానికి పోలీసులకు లైసెన్సు వుందా? 31 సంవత్సరాల రాజేశ్వరికి ఒక కార్మికుణ్ణి వివాహం చేసుకొని కష్టంచేసి బతికే స్వేచ్ఛ లేదు– కాని రాజేశ్వరిని మానభంగంచేసి ఉరేసే స్వేచ్ఛ యాజమాన్య సమాజానికి వుంది

మన కార్మిక సంక్షేమ రాజ్యంలో. రాములమ్మకు, తన పిల్లలకు తిండి పెట్టకుండా (దొరకదు గనుక) రోజు రోజుకు కొంచెం కొంచెం చొప్పున చంపే స్వేచ్ఛ వుంది గానీ, తిండిపెట్టలేక ఒకేసారి చంపే స్వేచ్ఛలేదు. కన్న పిల్లలను చేజేతులా చంపక తప్పని భయంకర స్వేచ్ఛను ఆమె జీవితాంతమూ జెయిల్లో అనుభవించవలసిందే. ఈ చట్టం కావాలన్నా రాములమ్మకు ఉరేసే స్వేచ్ఛ గానీ, వద్దన్నా భూమయ్య కిష్టా గౌడ్‌లకు రద్దుచేసే స్వేచ్ఛగానీ మానవతా విలువలు మిగిలిన న్యాయమూర్తులెవరికైన వుంటే వారికివ్వదు.

మరి రమేజాబీలకు, రాములమ్మలకు, కోటేశులకు, రామానుజంలకు రక్షణలేని దేశంలో ఎవరికి స్వేచ్ఛ వుంది, ఎవరి స్వేచ్ఛ గురించి ఈ ఆగస్టు 15న ఆకాశ వాణిలో కవులు గానం చేస్తారు, బుద్ధిజీవులు సుద్దులు చెప్తారు?

తెలంగాణలో, నక్సల్బరీలో, శ్రీకాకుళంలో, గోదావరి లోయలో, ఢిల్లీలో, బైలడిల్లాలో, పంత్‌నగర్‌లో, కాన్పూరులో, గోదావరిఖనిలో— 31 సంవత్సరాలుగా దేశంలో ఎక్కడబడితే అక్కడ స్వేచ్ఛకోసం ఎదురుతిరిగిన శ్వాసల్ని అణచేస్తున్న పాశవిక శక్తులకు పక్కతాళం వేస్తారు. హంతకుల కళ్ళల్లో ఆలోచనాలోచనలకు, దగాకోర్ల ఉగాది సందేశంలో కవిత్వానికి ఉత్తేజాన్ని పొందుతారు. రాజకీయ పతనాన్ని జలపాత సదృశ జీవలక్షణంగా, రంగులు మార్చడాన్ని ఇంద్రధనుస్సు స్వభావంగా అభివర్ణిస్తారు.

ప్రజల స్వేచ్ఛ గురించి ఆలోచించి, ఆలపించి ఆచరించే వాళ్ళకు మాత్రం ఇంకా 'స్వాతంత్ర్యం' రాలేదు— వాళ్ళు ఈ రాజ్యాంగం హామీ యిస్తున్న బూటకపు స్వాతంత్ర్యాన్ని, నిజమైన స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించి, నిర్బంధాలకు గురియై వదులుకుంటున్నారు.

ప్రజలకు 47 ఆగస్టు 15, 50 జనవరి 26, 75 జూన్ 26, 77 మార్చి 23 అన్నీ కేవలం కేలండర్‌లో మారిన తేదీలు, కాలగమనంలో గడచిన రోజులు తప్ప ఒకరోజు తెచ్చిన స్వేచ్ఛా లేదు, ఇంకొకరోజు తీసుకున్న స్వేచ్ఛాలేదు.

— సంపాదకుడు
28-7-78

సరోజ్‌దత్తా

సరోజ్‌దత్తా సుప్రసిద్ధ బెంగాలీ పత్రికా రచయిత- కవి. అవిభక్త కమ్యూనిస్టు పార్టీ బెంగాలీ దినపత్రిక "స్వాధీనత"లో అతడు పనిచేసాడు.

1969 లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ఏర్పడ్డ తరువాత అందులో అతడు ప్రముఖ స్థానాన్ని పొంది కేంద్ర కమిటీ సభ్యుడయ్యాడు. తరువాత పశ్చిమ బెంగాల్ కమిటీ కార్యదర్శి అయ్యాడు. సి.పి.ఐ. యం.యల్ బెంగాలీ వార పత్రిక "దేశబ్రతి"లో శశాంక అనే పేరుతో పాలకవర్గాలకు వ్యతిరేకంగా నిప్పుల కలంతో రాసేవాడు. బెంగాల్ యువజనోద్యమంలో కూడా సరోజ్‌దత్తా ప్రముఖపాత్ర నిర్వహించాడు. 1970-71లో కలకత్తాలో, ఇతర పరిసర పట్టణాల్లో కాంగ్రెసు నాయకుల, సంఘ సంస్కర్తల విగ్రహాల విధ్వంసన కార్యక్రమానికి సైద్ధాంతిక సమర్థన ఇచ్చాడు.

1971 ఆగస్టు 4/5 అర్ధరాత్రి కలకత్తాలోని ఒక రహస్య నివాసంలో సరోజ్‌దత్తా అరెస్టు అయ్యాడు- ఆగస్టు 5 వేకువజామున పోలీసులు అతన్ని కలకత్తా మైదానంలోని ఒక నిర్మానుష్యమైన మూలకు తీసుకొనిపోయి కాల్చివేశారు- కాని ఇవ్వాటికీ పోలీసులు సరోజ్‌దత్తా దొరుకలేదని అంటున్నారు.

జూన్ సంచికలో ప్రచురించిన సరోజ్‌దత్తా కవితలు, ఈ కింది కవిత ఇటీవల కలకత్తాలో ప్రచురించబడిన ఆయన కవితా సంకలనం "ఘృణా-వొ-క్రోధేర్ కవిత" (ద్వేష క్రోధ కవితలు) నుంచి తీసుకోబడినవి.

శకుంతల

గుర్తుగా యిచ్చిన ఉంగరము, దుర్వాసుని శాపము
స్వర్గంలో కలయిక
అన్నీ అబద్ధాలు- వంచనకు ముసుగులు

ఒక రాజు కామానికి ఎరగా
ఒక స్త్రీ బలియైన విషయాన్ని కప్పిపుచ్చడానికి
కాళిదాస కవీంద్రుడు కథనిండా
విధి అనే తెర కట్టాడు-

పట్టణాల్లోని వినోద యాత్రలతో విసిగిపోయి
రాజు మాంసం అన్వేషణలో బయల్దేరాడు

ఇంకా పెద్ద వ్యసనంకోసం వేట మాని
రక్షణలేని ఒక పేద ఇంటికి వచ్చాడు
ఇంటి యజమాని యింట్లో లేడు

ఆ అడవి పిల్ల ఆయన మాటల వలలో పడిపోయింది—

ఇవ్వాళ నాటకశాల చకితమై నిలిచింది
భూతాలు భయంతో నిశ్శబ్దమై పోయాయి
కవిత్వపు మబ్బుల్ని చీల్చుకొని
సత్య సూర్యుడు ఆకాశంలోకి ఉదయిస్తున్నాడు
నాటకంలో దాగిన అర్థాన్ని చూసి
ప్రేక్షకులు చలించిపోయారు

ఒక జలగ
తప్పుడు మార్దవాన్ని ఒలకబోస్తే
ఆ యువతి గర్భవతి అయింది—

ఆ రాజు పారేసిన ఎంగిలి పెరుగన్నం మెక్కి—
ఆస్థానకవి నాటకం రాసాడు;
చీకటి నాటకరంగంపై నేలమీద
శకుంతల శోకిస్తున్నది.

(బెంగాలీ నుంచి అనువాదం :
సుమంతో బెనర్జీ)

ఆలోచించండి : మహాభారతంలోని శకుంతలోపాఖ్యానంలో అభిజ్ఞానం (గుర్తు) గా దుష్యంతుడు శకుంతలకు ఉంగరం యిచ్చాడనిగానీ, దుర్వాసుని శాపంవల్ల రాజు శకుంతలను మరచిపోయాడనిగానీ లేదు. భారతంలో సర్వదమనుడు కణ్వాశ్రమంలోనే పుట్టి పెరిగి యువరాజ్యాభిషేకానికి అర్హమైన వయస్సు వచ్చినపుడు ఆయనను చక్రవర్తిని చేస్తానని దుష్యంతుడు మాట యిచ్చి వున్నందున శకుంతలను, అతణ్ణి రాజు దగ్గరికి పంపిస్తాడు కణ్వుడు. రాజు శకుంతలను మరచిపోతాడు— కాముకులయిన మొగాళ్ళం దరిలాగే. ఆ మరపును భారతంలో కవి ఖండించకున్నా సమర్థించడు. ఒక జరిగిన విషయంగా మాత్రం చెప్తాడు. కాని కాళిదాసు నాటికి 'రాజు పారేసిన ఎంగిలి పెరుగన్నం మెక్కిన' మేధావులకు 'రాజు రక్తం తప్పు చేయదన్న' సిద్ధాంతాన్ని బలపర్చాల్సిన 'బాధ్యత' వచ్చిపడింది— ?

వంగపండు ప్రసాదరావు రెండు పాటలు :

పట్నవాసం (డాన్సు పాట)

[ఆలు మగల సంవాదం]

అతడు: బయలు దేరవే పిల్ల
రైలు బండి ఎక్కేల్దాం ॥బయ॥

ఆమె: అబ్బా! నే రాను
పట్నంలో బతకలేను ॥అబ్బా॥

అతడు: పట్నమంటె పట్నమూ
విశాఖ పట్నమూ
పేడలున్న పట్నమూ
ఓడలున్న పట్నమూ
ఆడోలు తిరిగేందుకు
అందమైన పట్నమూ ॥బయ॥

ఆమె: అందమైన పట్నమైతే
ఆకలి తీరుస్తాదా ?
కిర్సనాని బుడ్డీ
మన మెలిగించక తప్పుతాద
అది కూలోలును సంపుతున్న
సంపన్నుల పట్నమూ ॥అబ్బా॥

అతడు: కారులు మోటారు బల్లు
ఆడోలు నప్పుతారు
ఆడోల బట్టలు
మొగోలు తొడుగుతారు
మన ఆకలి తీరిపోయె
సోకులెన్నొ సూడొచ్చును ॥బయ॥

ఆమె: బట్టల సోకులకీ
బాదలేఁవి తెలుసునులే
కారెక్కేనోలుకీ
కష్టమేఁవి తెలుసునులే
వున్నోళ్ళి జూసుకోని
ఎన్నాలు మన బతుకూ ? ॥అబ్బా॥

అతడు: పట్నంలో మనమూ
పనిసేసీ బతకొచ్చు
కూటికి లోటులేక
కూలిజేసి బతకొచ్చు
సినిమా లెప్పుడూ
సూసుకోని తిరగొచ్చు ॥బయ॥

ఆమె: పట్నంలోనైనా
పల్లెటూరిలో నైనా
కూలి జేస్తున్నోలు
కంపెనీలో వున్నోలు
ఎన్నాల్లు బతికినా
మెతుకులేని గెంజినీలు ॥అబ్బా॥

అతడు: కంపెనీలో నేను
కష్టపడుతుంటాను
జీతగాడుగ నేనూ
జీవించి వుంటాను
పండగ రాగానే నీకు
పట్టు చీర కొంటాను ॥బయ॥

ఆమె: ఇంగిలీసు సదువుగాలు
ఇబ్బందులు పడిపోయి
ఇనపముక్కల పనికి
ఆలే ఎలి పోతుంద్రు
ఏ సదుపు లేనోడువు
నీ కెవురిత్తారు పని ॥అబ్బా॥

అతడు: రోజుకెన్నొ మేడలు
కట్టినోల్లున్నారు
కండలు కరిగించి
కంట్రాక్టు పనిజేసి
సిమ్మెంటు ఇసక మోసి
కమ్మగ తిని బతుకుదాము ॥బయ॥

ఆమె: ఇసకంత పోగుపోస్తె
ఇస్తాడు ఒక రూపాయ్
ఆ పూట పొయ్యిలోకి
వంట బొగ్గు ఒక రూపాయ్
పొయ్యిమీది బియ్యానికి
నువ్వేటి సేత్తావు? ॥అబ్బా॥

అతడు: పగలంత పనిజేసి
పొయ్యిలోకి తెస్తాను
రాత్రి రిక్షా తొక్కి
రైసు కొని తెస్తాను
నీచేతి కిస్తాను
కూడును వండిస్తాను ॥బయ॥

ఆమె: ఉండడానికి ఇల్లు
ఉండాలి మనకంటె
తలుపులేని పాకా
తాటి కమ్మల పాకా
అయిదు పదుల రూపాయిలు
అద్దె కక్కమంటారు ॥అబ్బా॥

అతడు: ఇలాగ నువ్వంటే
ఎలాగ మన బతుకూ
పల్లెటూరులోనూ
పని లేని మన బతుకూ
సొంత ఆస్తులు మనకూ
కొంతయినా లేవు కదా ॥బయ॥

ఆమె: మనూరు బుగతకాడ
బోలెడు బూఁవున్నాది
ఏ పంట పండకుండ
ఎండిపోయి వున్నాదీ
తిండి లేనోలమల్ల
పండించుకు తిందాము ॥అబ్బా॥

అతడు: బుగతోడు బూఁవులు
ఇవ్వము పొమ్మంటుండు
అడిగినోడును అల్లా
అరెస్టు జేస్తుండ్రు
అదికారం దన్నుందని
ఆలిష్టం అంటుండ్రు ॥బయ॥

ఆమె: రైతునాగలి బట్టి
రైతు సంఘాలెట్టీ
బుగతగాడిని బట్టీ
అవతలకే మెడనెట్టీ
కష్టించీ పనిచేద్దాం
కలిగింది తిని వుందాం ॥అబ్బా॥

అతడు: పదవే ఓ పిల్లా
రైతు కూలి సంఘానికి ॥పదవే॥

ఆమె: రారా ఒరె మాఁవాఁ
రైతు రాజ్యమొస్తాది

అతడు: పదవే ఓ పిల్లా!

ఆమె: రారా ఒరే మాఁవాఁ!

జీతాల తమాషా

(డాన్సు పాట)

అతడు: మా కంపెనీకి జీతాలు
పెరిగినాయ్
ఇన్నావ కన్నావా ।
కన్నావ ఇన్నావా ।
ఓ బామా లచ్చిమీ
నా పేమా లచ్చిమీ ॥మా కం॥

ఆమె: అబ్బబ్బా మురిసిపోకు
సుబ్బారావ్ !
కొనబోతె తినబోతె
తినబోతె కొనబోతె
ధరలు పెరిగి పోతుంటె
డబ్బెందుకు దండగా ॥అబ్బ॥

అతడు: మన పెదబాబుని సినబాబుని
ఇంగిలీసు సదివిత్తా
రిక్షా బండి మీద
బడికి నేను పంపిత్తా
ఆ డాకటేరు అయిందాక
డబ్బు కర్సు పెట్టేత్తా ॥మా కం॥

ఆమె: ఎ-బి-సి-డీ రాకముందు
ఏడు దొంతల పుస్తకాలు
ఏడొందల కర్సనీ
ఏడు సదువు సాలనీ
ఆ ఇంగిలీసు సదివినోడు
అందుకిందుకు పెడతాడు ॥అబ్బ॥

అతడు: వంద కేజీల బియ్యంబస్తా
ఒకసారే కొంటానూ
పప్పులన్నీ కొనిదెచ్చి
కుప్పలు పోసిత్తానూ
రోజు కొకా కోడిపెట్ట
కోసుకొని తిందాము ॥మా కం॥

ఆమె: గొప్ప గొప్ప అయిపోకు
పప్పు రేటు పెరిగింది
ఆ పక్కని నూనిమీద
నూరు పైస లెక్కిందీ
లెక్క వేస్తె నీ జీతం
అక్కడి కక్కడ సెల్లూ ॥అబ్బ॥

అతడు: ఈ నూలుబట్ట సీర నువ్వు
కట్ట కోలె సిన్నమ్మీ
ఆ కోటింగుల నోలక్కులు
ఎట్టకోలె సిన్నమ్మీ
ఆ టెర్లీను సీర దెచ్చి
బంగారం నగలుగొంట ॥మా కం॥

ఆమె: ఆ పాతప్పుల వడ్డీకి
పనికిరాదు నీ జీతం
కొత్తవేవి కొండానికి
సరిపడదూ నీ జీతం
పేరుకు పెంచేరు డబ్బు
అలాగే వుంచేరు బతుకు ॥అబ్బ॥

అతడు: ఈ కంపుపేట కమ్మలిల్లు
కాలీ సేసీద్దాము
ఆ కరంటున్న అద్దింటిలో
కాపురాన్ని సాగిద్దాం
ఆ మైసూరు శాండు సబ్బు
రుద్దుకోనీ జీవిద్దాం ॥మా కం॥

ఆమె: పేపర్లో నీ జీతం
పెరిగిందని సెప్పగానె
అయిదు పదీ ఇంటద్దెలు
అధికంగా పెంచేరూ
అలా జీతం పెంచుతంద్రు
అర్థరూపాయి గుంజుతంద్రు
॥అబ్బబ్బా

అతడు: పెరుగుతున్న ధరలుజూసి
పెద్దెత్తున సమ్మె జేసి
మల్లీ డబ్బడుగుతాము
పిల్లా నీకేటి తెలుసు
కిక్కురమనకుండ నువ్వు
లెక్కబెట్టు ఈ సొమ్ము ॥మాకం॥

ఆమె: ఆ సమ్మెజేసి సొమ్ముదెచ్చి
వర్తకుల్ని పెంచుతండ్రు
విలువలేని డబ్బు నీకు
ఎంతుంటే ఎందుకూ
సేవుంటే ఎదురు తిరిగి
మిల్లు మనది అనరాదా ॥అబ్బ॥

అతడు: అవునవునే నువ్వన్నది
అక్షరాల నిజమేనే
ఆ ఫాక్టరీలు ప్రజలవనీ
చాటి మనం చెప్పాలీ
ఈ వేతనాల పద్ధతి
ఇక రూపు మాసిపోవాలీ

ఆమె: తెలిసిందా తెలిసిందా
జీతాల తంతు నీకు?

అతడు: కార్మికుల కళ్ళు వాళ్ళు
కలకాలం కప్పలేరు

అతడు } కదలిరం కదలిరండి
ఆమె } కార్మికులారా ॥కదలి॥

ఎలుగెత్తి చాటుదాం
ఎదురుతిరిగి పోరదాం॥ఎలుగెత్తి॥

విధము తెలిసీ ఎదురు తిరిగితె

బొల్లిముంత నాగేశ్వరరావు

చెప్ప లేదంటనక పొయ్యేరు ;
జనులార మీరలు
చెప్పితే మరి వినకపొయ్యేరు ;
ఇప్పుడైనా మించదమ్యేను
విధము తెలిసీ ఎదురుతిరగితె ॥చెప్ప॥

దొంగ మనసుతో దొరలు ఉంటరు
జనం సొమ్మును మింగుతుంటరు
భూమి ఎనక భూమి కొంటరు
మేడమైన మేడ కడతరు
ఏడదని మనమడిగితేనూ
ఎగిరి పడతరు జైలబెడతరు ॥చెప్ప॥

నవ్వుతా మన ఇళ్ళకొత్తరు
సోషలిజమని సోదిసెపుతరు
భూమి సేతికి ఇస్తమంటరు
బువ్వ కరువు లేదు అంటరు
వోటు మాకే వేయమంటరు
మాట తీపితో మాయసేత్తరు
వోటు ఏసి భూమి అడిగితె
ఎగిరిపడతరు జైలబెడతరు ॥చెప్ప॥

విధము తెలిసీ ఎదురు తిరిగితె

ఇంటికో ఉద్దోగమంటరు
పంటి కిందకు తిండి అంటరు
పంటి మీదకు బట్ట అంటరు
ఉండ దమ్మి - సదివి సదివీ
ఆసపడి ఉద్దోగమంటె
ఉరిమి సూత్తరు తరిమి కొడతరు
ఏమిటని మన మడిగితేనూ
ఎగిరిపడతరు జైలబెడతరు ॥చెప్ప॥

అంటగూడని తనము అంటరు
అరిజనాలకు సేవ అంటరు
అంత కలిసి బతకలంటరు
దొరల ఉచ్చల దొడ్లలాగ

ఊరికంతా దూరముగ
వేరు సేత్తరు ఇళ్ళుకడతరు
ఏమిటని మన మడిగితేనూ
ఎగిరిపడతరు జైలబెడతరు ॥చెప్ప॥

అందరాకు సదువు అంటరు
పల్లెపల్లెకు బడులు అంటరు
తిండి కూడా పెడతమంటరు
సదువుసంగతి జంగమెరుగు
పొట్ట ఆసతొ బడికిపోతె
పంతులయ్యకె తిండి ఉండదు
ఏమిటని మన మడిగితేనూ
ఎగిరిపడతరు జైలబెడతరు ॥చెప్ప॥

మనం తెలివొచ్చీ తెలిసొచ్చీ
సంగం గింగం పెట్కొని
అక్కల్నడగ బడితీవా
కాదంటె తిర్గబడితీవా
గప్పుడు మొదలైతది
గరీబోల్లమీన 'అణిసివేత'
దాకీలాడ గక్కపొండి
దొంచకొడుక్కలారంటర్.
పొండి కొడుక్కలార మిషండ్లపెట్టి
దున్నుకుంటమ్ అంటర్
గీవులు[1] తగులవెడ్తర్
మోసేతి గంజిసీళ్ళ కాసవదే కుక్కల్ని
మన పైకి వుసిగొల్పుతరు

ఇగురం

హిమజ్వాల

ఎన్నితీర్లంటె గన్నితీర్లు మనల్నొంచ
జూస్తర్
గప్పుడు గిన్క లొంగిపోతివ
ఇంగ "బత్కు[2] సకిలీకం" తుట్టెబత్కె
గసొంటాళనే గుండె దిటం[3] గావాల
గుండెలపీన గుండ్లువడ్డా
పొక్కంట పైకొచ్చె 'గర్కట్ల'
అణిసి వేతను మనం తిప్పికొట్టాలె
మూరెడొంచితె
బారెడు వెరుగాలె
గిదే ఇగురం.[4]

---

1. ఇండ్లు 2. అంతా 3. గట్టితనం
4. వివేకం

విముక్తి పాట

(బీడీలు చేసి బతికే స్త్రీల విముక్తి పాట)

రవిచంద్ర

పొద్దూ పొద్దూనా లేచీ
పొద్దంత పనిజేస్తీ
ఒట్టీగ యాడుంటిరో
ఓరయ్యో! నేనేడ[1] కూసింటిరో
॥పొద్దూ॥

సేసీ సేసేము రెక్కా
లన్నీ పటమారేనాయె[2]
నాకెక్కా డీరాముర్రో[3]
ఓరయ్యో! నేనేడ కూసింటిరో
॥పొద్దూ॥

యాల్లా[4] పొద్దూన వంట
చేసీ పిల్లాల దిద్ది
అకులపై కూసింటిరో
ఓరయ్యో! నేనొట్టిగ్యాడుంటిరో
॥పొద్దూ॥

బీడీల మాపిచ్చి[5]
తంబాకు తెచ్చేసరికి
జారాబజయి పాయెరో
ఓరయ్యో! నేన్యాడ కూసింటిరో
॥పొద్దూ॥

ఇంట్లంత తిన్నాక
కొసకూ[6] నేనింత మెక్కి
బీడీల మీదే పడ్తిరో
ఓరయ్యో! నేనొట్టిగ్యాడుంటిరో
॥పొద్దూ॥

నీళ్ళు రాంగానే మల్లా
లేచీ నే నీళ్ళే పట్టి
బట్టాలన్నీ ఉతికితి
ఓరయ్యో! నా కెక్కడీరాముర్రో
॥పొద్దూ॥

పొద్దీకి వంటజేసీ
తిన్నా బాసండ్లు[7] తోమి
సంటోళ్ళ పండేత్తిని[8]
ఓరయ్యో! నా కెక్కడీరాముర్రో
॥పొద్దూ॥

ఆడిబిడ్డాల అత్తా
పోరూ జోరేమొనాయె
సత్తింక[13] ఇంట్లుండరో
ఓరయ్యో! నేనొట్టిగ్యాడుంటిరో
॥పొద్దూ॥

వాళ్ళనుక నేసుకొచ్చీ
బాగలుసూ[9] నీవేఇచ్చీ
ఉల్టా[10] నన్నే అంటావా
ఓరయ్యో! ఇంట్లెట్ల నెగలాలెరో
॥పొద్దూ॥

ఆడోళ్ళు అళ్ళ కాళ్ళ
మీదా నిల్సుండి పొట్ట
కెల్లా దీయాలేరానా ?
ఓరయ్యో! పిల్లాల సాదరనా?
॥పొద్దూ॥

అవ్వా గారింటి మీది
కెళ్ళీ కూసున్నానని
పంచాయితీ పెడ్తివా
ఓరయ్యో! నన్నేమానానంటత్తరో[11]
॥పొద్దూ॥

అట్ల, ఎట్లంటీరంటే
నారస్త నాకుంది
నీరస్త[12] నీకుందిరో
ఓరయ్యో! నాకున్నవీ – రెక్కలు
॥పొద్దూ॥

---

1 నేనెక్కడ, 2 అలసి, 3 విశ్రాంతి, 4 తొందరగానే, 5 లెక్కచూపి, 6 చివరికి 7 వంటసామగ్రి, 8 పడుకోపెట్టి, 9 స్వేచ్ఛ, 10 తిరిగి, 11 ఏమనసనంటే వస్తరో, 12 దారి, 13 చచ్చినా ఇంక

'ప్రజల మనిషి' నవల - ఒక పరిచయం

వరవరరావు

ప్రజల మనిషి '1938 లో హైదరాబాదులో స్టేట్-కాంగ్రెసు పుట్టుటకుపూర్వం తెలంగాణా వాతావరణాన్ని ఆధారంచేసుకుని దాని ప్రభావం నుండి బయల్దేరిన ఒకరిని[1] కథా నాయకుడుగా తీసుకుని రాసిన నవల'. 'నవలలో తెలంగాణా జనసామాన్యంతో బాటు సర్వసామాన్యంగా అందరూ మాట్లాడే భాష సంభాషణల్లో' వాడబడింది.

1938 ప్రాంతాల తెలంగాణా ప్రజా జీవితం ఎట్లా వుండేది అనడానికి ప్రజల మనిషి నవలయే అద్దం పట్టినప్పటికి ఆ స్థితిని నిజాం నిరంకుశ పాలనకు గ్రామాల్లో జమీందారీ జాగీర్దారీ, భూస్వామ్యవ్యవస్థకు వెట్టిచాకిరికి నిలయమై ప్రజలు అజ్ఞానంతో అసహాయతతో అణగారిన రోజులుగా క్లుప్తంగా పేర్కొనవచ్చు. 'వెట్టి విధానం' (నిర్బంధ చాకిరీ వసూళ్ళు) ఆటవిక తెగల ప్రాంతానికీ యితర ప్రాంతాలలో బాగా వెనుకబడిన కొన్ని సాంఘిక తెగలకు మాత్రమే పరిమితమైనదిగా సాధారణంగా భావించబడుతుంది. కాని తెలంగాణాలో వెట్టి విధానం సమాజమంతా ఆవరించి వుండేది- ప్రజలలో అన్ని వర్గాల ప్రజలకు తరతమ స్థాయిలలో అది వర్తించేది.[2]

అక్కడి ప్రజా జీవితం గురించి సుప్రసిద్ధ కవి తిరునగరు సీతారామాంజనేయులు మరింత హృదయవిదారకంగా వర్ణించాడు- 'అక్కడి ప్రజాజీవితం చూసేసరికి గుండె లవిసిపోయాయి- తల తిరిగిపోయింది- ప్రజలంతా గ్రామంలోని నల్గురైదుగురు పెత్తం

---

1. 'ప్రజల మనిషి' నవలలోని కంఠీరవం పాత్రవలె ఆళ్వారుస్వామి సామాజిక చైతన్యంతో ప్రజల మనిషిగా మారాడు- కనుక ఒక విధంగా యీ నవలను తర్వాతదైన 'గంగు' నవలను ఆయన కథల సంపుటి 'జైలు లోపల'ను ఆయన Auto biographical (ఆత్మకథా సంబంధమైన) రచనలుగా పేర్కొనవచ్చు. ఆళ్వారుస్వామి 1914 లో జన్మించి హోటల్ కార్మికునిగా పనిజేసి జీవితమనే బడిలోనే చదువు నేర్చుకున్నాడు- ఆంధ్ర మహాసభ, గ్రంథాలయోద్యమం, స్టేట్ కాంగ్రెస్ దశలు దాటి 1944 లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొందాడు- 1946 నిజాం వ్యతిరేక తెలంగాణా ఉద్యమంలో జైలు- 1951 నుంచి రచయితగాను దేశోద్ధారక గ్రంథమండలి వ్యవస్థాపకుడుగాను ప్రఖ్యాతి పొందాడు. తెలంగాణా విమోచనోద్యమాన్ని చిత్రించడానికి ఆయన వేసుకున్న నవలా పథకం 1961 ఫిబ్రవరిలో ఆయన ఆకస్మిక మరణంతో అసంపూర్తిగా మిగిలిపోయిందని 'ప్రజల మనిషి', 'గంగు' చదివిన ఎవరైనా గ్రహించవచ్చు- 'ప్రజల మనిషి' రచనాకాలం 1952-1955.

2. వీర తెలంగాణ విప్లవ పోరాటం- గుణపాఠాలు - పుచ్చలపల్లి సుందరయ్య

దొర్లకు బానిసలై బతుకుతున్నారు– దారుణమైన వెట్టిచాకిరి, అంతకన్నా దారుణమైన అధికారుల జులుం. నిత్యం తన్నులూ తిట్లూ, కచేరీ చావళ్లవద్ద వంగబెట్టి మూపున బండలు– బండలే కాదు రైతుల మూపున గ్రామ పెట్టిని ఎక్కించి తొక్కించేవారు. పండిన పంటనంతా 'లెవీ'లని 'తావాను'లని 'నాగూ'లని 'నజరానా'లని దోచుకునే వారు. బూడిద పట్టి, పెండ్లి పట్టి, సమర్త పట్టీలు సరేసరి. అది మధ్యయుగాల నాటి భూస్వామ్య దోపిడి. బొడ్డుపల్లిని కోల్పోయి వద్దెరాజుల చేతిలో శ్రీనాథ కవి కూడా అలాటి యమదండనను చవి చూచి వుండడు. అవి యిక్కడ నిత్యకృత్యాలు." "ఈ దొరోళ్ళ దుండగాల గురించి తెలంగాణా ప్రజలు కట్టుకున్న పాటలు చూస్తే ఆనాటి సంఘ చిత్రం సాక్షాత్కరిస్తుంది."[3]

"పల్లెటూళ్ళలో దొరలది మకుటంలేని రాజరికం– చట్టం ఎరుగని శాసనాధికారము. ఒక్క కులం పెద్దరికంవల్ల లభించిన పెత్తనం మాత్రమే కాదు, డబ్బు, భూమి, కులం, దర్పం, దాష్టీకం వీటన్నిటి మిశ్రమం ఆ దొరతనం." (ఓనమాలు– మహీధర రామమోహనరావు).

దొరల దుర్మార్గాలను వర్ణించే ఒక ఉయ్యాలపాటలో ప్రజల స్థితి– దుస్థితి యిలా వర్ణించబడింది.

గడిచుట్టు నల్గురూ ఉయ్యాలో   మెప్పు పొందే దాక ఉయ్యాలో
మాల మాదిగల కాపలా „   ప్రతిరోజు యిద్దరూ „
కచ్చడాలా ముందు „   పట్టాలి కాళ్ళైనా „
కాపలి కుక్కల్లాగా „   నిద్ర పట్టేవరకు „
నిత్యం ఉరకాల „   ....

మరో పాటలో దొరలు 'భోజ గద్దలరీతి' బీదల మాంసం తిని బొమికలు మిగిలించి 'కాలు చెప్పుల రీతి'గా ఎంచుతున్నట్లు కవి రాశాడు. గడి ముందు చావడిలో దొర కూర్చొని వుండగా యితరులు ఆ దారంటే ఎదురుపడి పోవడమా! వెళ్ళదలిస్తే దూరాన కాళ్ళ చెప్పులు వదిలేసి తల రుమాలు తీసి 'కాల్మొక్కుత దొరా' అంటూ చేతులు జోడించుకొని మరీ వెళ్ళాలి. ఒక ఉయ్యాల పాటలో ఒక దొర నిర్ణయించిన తక్కువ కూలిరేట్ల, పిచ్చ ముంతల, నాగుల, పెచ్చుల ప్రస్తావన వస్తుంది. మరొక ప్రాంతంలోనైతే పంటపండించుకున్నందుకు రైతు శిస్తు కడతాడు. ఈ రాజ్యంలో

3. చూ॥ తెలంగాణా పోరాట పాటలు [రెండవ భాగం] పేజీ 12 నుండి 16 వరకు (విరసం ప్రచురణ – సంపాదకుడు: కె. వి. రమణారెడ్డి)

మాత్రం శిస్తులు కట్టేందుకే పంట పండించుకోవలసినట్లుంది. పంట కళ్ళాల నుంచే లెవీ గల్లా పేరుతో రైతు పండించిన ధాన్యం దొర గడీకో పటేల్ గరిశకో చేరిపో తుంది - రశీదులుండవు. ఒకమారు సర్కారుకు కట్టినదాన్నే మళ్ళీ కట్టమంటారు పట్వారీలు - ఇవి అల్ప క్షుద్రమృగాలు - పటేల్ కుక్కయితే పట్వారీ నక్క.

పేదోళ్ళం భక్తి కొద్ది
పోశమ్మకు పెట్టుకుంటె
కోడి పిల్ల మామూలు
కొట్టి తీసుకుంటారు

ముఖ్యంగా తెలంగాణాలో రెండు పంశాల భూస్వాముల దౌర్జన్యాలు ఆనాటి తెలంగాణా ప్రజా జీవితానికి అద్దం పడతాయి. విసునూరి దేశముఖ్ తల్లి తనను 'అమ్మా' అనిగాని 'దొరసాని' అనిగాని అనగూడదని 'దొరా' అని పిలువాలని శాసి స్తుంది. ప్రజల పాటల్లో అది మనిషి కాదు బ్రహ్మరాక్షసి. దేవరుప్పుల గ్రామా నికి చెందిన బేతు కృష్ణారెడ్డి, అబ్బసలి దాని బంట్లు. తొలి తెలంగాణా వీరయోధుడు దొడ్డి కొమురయ్య ఉసురు దీసింది వీళ్ళే.

విసునూర్ దేశముఖ్ రామచంద్రారెడ్డి పొలంలో రైతు కూలీలు పొద్దుగూకులు పనిచేయడమే గాక రాత్రిపూట పెద్దలాంపులుదెచ్చి ఆ కాంతిలో పనిచేయాలి - పసిపిల్లల తల్లులు బిడ్డలకు రొమ్ము కుడిపి వస్తాము పోనిమ్మంటే పోనీడు - పైగా కుమ్మరి ఎంకుల్ని పిలిచి నూరు బొద్దుగిన్నెలు తెప్పించి ఆడవాళ్ళను వాటిలో చనుబాలు పిండ మంటాడు - ఆ పాలను పొలంలో చల్లిస్తాడు, చల్లిస్తున్న రక్తమూ స్వేదమూ చాలదన్నట్లు. పని విడిచి పోయేవాళ్ళను పొర్లించి కొడతాడు - వెరగొల్ల సత్తెమ్మ ఎదురు మాట్లాడిందని గుర్రాన్ని కొట్టే రేజనాతో కొడతాడు - వాడు మనిషి కాదు మహిషం. జన్నారెడ్డి ప్రతాపరెడ్డి మరొక మకిలి దున్న. సూర్యాపేట తాలూకా ఎర్రబాడు జమీందారు. వీడి బంట్లు పెదపంది నూరిగాడు, సినపంది మల్లిగాడు - ఇలాటి 'చిల్లరదేవుళ్ళతో' 'గ్రామశక్తులతో' ఆనాటి తెలంగాణా నిండి వుండేది.

ఈ నేపథ్యంలో మనం ప్రజల మనిషి నవలను పరిశీలించాల్సి వున్నది.

ప్రజల మనిషి నవలకు నిజామాబాదు జిల్లాలోని కామారెడ్డికి సమీపంలోవున్న దిమ్మగూడెం గ్రామం భూమిక. ఈ గ్రామానికి దొర, పెత్తందారు రామభూపాల్‌రావు. ఆయన దగ్గర గుమస్తాగా పనిచేస్తున్న వ్యక్తి హైదరలి. మత కారణాలవల్ల హైదరలీ పట్ల విశ్వాసం సడలిపోయిన రోజుల్లో దొర సంప్రదించే వ్యక్తి వెంకటాద్రి. ఇతడు

కాపు కులస్థుల వలె వ్యవసాయోపజీవి కాదనే విషయం యిందులో సూచనగా వుంది. ఈ నవలలో మరో ప్రధానమైన రెండు పాత్రలు కథానాయకుడు కంఠీరవం- ఆయన అనుచరుడు కొమురయ్య. కంఠీరవం ఆ గ్రామ పూజారి, రామభూపాల్‌రావు కుటుంబానికి ఆచార్యత్వం వహించిన రఘునాథాచార్యుల కొడుకు. రఘునథాచార్యుల పెద్ద కొడుకు వెంకటాచార్యులు. కొమురయ్య కాపుకులస్థుడైన కోటయ్య కొడుకు.

రామభూపాల్‌రావు కూతురు వివాహ సందర్భంగా విజయవాడ నుంచి ఫిడేల్ వాయించడానికి పిలిపించబడిన క్రాఫ్ పెట్టుకున్న మోహనాచారితో సహపంక్తి భోజనం చేయడానికి రఘునాథాచార్యులు, తిరువెంగళాచార్యుల నాయకత్వంలో ఆచార్యులందరూ నిరాకరించడంతో దొరకు రఘునాథాచార్యులకు సాంఘికాచార పరమైన సంఘర్షణ ప్రారంభమవుతుంది. రామభూపాల్‌రావు పూర్వీకులు రఘునాథాచార్యుల కుటుంబానికిచ్చిన మడులూ మాన్యాలు రామభూపాల్‌రావు తీసేసుకుంటాడు. రఘునాథాచార్యులు పెద్దకొడుకైన వెంకటాచార్యులను వెంటబెట్టుకుని దేశసంచారానికి బయల్దేర వలసిన గతి పడుతుంది.

క్రాప్ పెట్టుకున్న తన కులస్తునితో తినడానికే నిరాకరించిన రఘునాథాచార్యుల రెండవ కొడుకు కంఠీరవం మాత్రం దినమంతా తురకపంతులు ఒళ్ళోనో తురకపంతులమ్మ సందిటనో పెరుగుతూ చదువుకుంటుంటాడు. ఇది ఊరికంతా విచిత్రంగా వుంటుంది.

దొర కూతురు వివాహ సందర్భంగా అల్లునికి అరణం యివ్వడానికి కోటయ్య ఆవును కొట్టి తెప్పిస్తాడు. ఇది కొమురయ్య పసి హృదయాన్ని గాయపర్చడమే కాదు ప్రశ్నింపజేస్తుంది.

కుటుంబం రోజురోజుకు దారిద్ర్యానికి గురవుతున్న రోజుల్లో రఘునాథాచార్యులు మరణిస్తాడు- వెంకటాచార్యులే దేశాటనచేసి యాచించి కుటుంబాన్ని వెళ్ళదీస్తుంటాడు. కంఠీరవానికి చదువుకోవాలని, యాచించే కులవృత్తి మానాలని పట్టుదల. వెంకటాచారి తానే కుటుంబాన్ని పోషిస్తున్నానన్న గర్వంతో తల్లిని దుర్భాషలాడతాడు, కొడతాడు. కంఠీరవం అతన్తో ఘర్షణ పడతాడు. ఇంక యింట్లో వుంటే యీ ఘర్షణలు తప్పవని కొమురయ్య సహాయంతో నిజామాబాదుకు వెళ్ళిపోతాడు- అక్కడ రఘునాథాచార్యుల మిత్రుడైన వేదాంతాచార్యుల సహాయంతో వైద్యమూ విద్య నేర్చుకుంటాడు. వేదాంతాచార్యుల కొడుకు మోహనాచారితో రోజూ గ్రంథాలయానికి వెళ్ళి జాతీయోద్యమము, గ్రంథాలయోద్యమాలతో తీవ్రంగా ప్రభావితుడౌతాడు. త్వరలోనే నిజామాబాదు

లోని ప్రజాహిత కార్యకలాపాల్లోను, గ్రంథాలయోద్యమంలోను ప్రముఖ కార్యకర్తవు తాడు. నిజామాబాదులో గ్రంథాలయోద్యమ సభ జరుపాలని కొంతమంది సహచరులతో కలిసి నిర్ణయించుకుంటాడు— అప్పటికే హైదరాబాద్ నగరంలో కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపించబడి గ్రంథాలయోద్యమం ఆంధ్రోద్యమంలో ఒక భాగమై కొన సాగుతున్నది— దానికి నాయకుడైన జగపతిరెడ్డిని పిలువడానికి నిర్ణయిస్తారు— కాని నిజాం ప్రభుత్వం యీ సభకు అనుమతించదు. జగపతిరెడ్డి నిజామాబాదుకు వస్తాడు. దాదాపు సభ జరిగి ప్రభుత్వం అనుమతించనందున సభ జరుగడం లేదనే ప్రకటనతో సభ ముగుస్తుంది. ఆంధ్ర మహాసభా ఉద్యమం అందులో భాగంగా గ్రంథాలయో ద్యమం తెలంగాణా పట్టణాలను ఆకర్షించడానికి మాత్రమే కాకుండా అందులో తలఎత్తిన అతివాద మితవాద ధోరణులకు కూడా యీ ఘట్టం సాక్ష్యంగా వుంది.

ఇదిలా వుండగా అటు దిమ్మగూడెం గ్రామంలో కూడా చాలా మార్పులు వచ్చాయి. కొమురయ్య తండ్రి కోటయ్య వూరు విడిచి వెళ్ళిన ఒక బ్రాహ్మణుని భూమి కౌలుకు చేస్తుండేవాడు. రెక్కలు ముక్కలు చేసుకుని ఆ కుటుంబమంతా ఆ భూమిని సాగుచేసుకుని అదే ప్రాణంగా బతుకుతున్నది. రామభూపాల్‌రావు దొరకు ఆ భూమిమీద కన్నుబడ్డది— రఘునాథాచార్యుల నుంచి తీసుకున్న భూమిని తిరిగి వెంక టాచారికి యిస్తానని ఎరచూపి తనవెంట తహసీల్ కచేరీకి తీసుకవెళ్ళి వెళ్ళిపోయిన బ్రాహ్మణుని కొడుకు వెంకటేశ్వర్లు తానేనని వెంకటాచారితో బొంకించి అతడా భూమి తన కమ్మినట్లుగా కాగితం రాయించి ఆ భూమిని స్వాధీనం చేసుకుంటాడు. అయితే కోటయ్య వున్ననాడు అవును కొట్టుకపోయినంత సులభంగా గాని రఘునాథాచార్యుల భూమిని స్వాధీనం చేసుకున్నంత సులభంగా కాని యీ పని జరుగలేదు. మొదట కొమురయ్య ఆ కౌలు దొరకే కట్టడానికి గూడా సంసిద్ధత చూపుతాడు— కాని దొర వినడు— హైదరలీ ఆజమాయిషిలో పది అరకలు కట్టించి కొమురయ్య పొలంలోకి పంపిస్తాడు. కొమురయ్య చేసేదిలేక దొరదగ్గరకు న్యాయంకోసం మొరపెట్టుకోవడా నికి వస్తాడు. కాని కొమురయ్య తల్లి అన్నమ్మ మనుమడ్ని ఎత్తుకుని పొలానికి వెళ్ళి అరకలకు అడ్డం నిలుస్తుంది. తన బొందిమించి తప్ప అరకముందుకు వెళ్ళడానికి వీలులేదని గర్జిస్తుంది— హైదరలీ దిమ్మెరపోతాడు— అరకగట్టిన జీతగాళ్ళలో కాపుకుల స్థుడైన కనకయ్య అరక విడిచేస్తాడు— దాంతో కోపం వచ్చి హైదరలీ అతడ్ని కొడ తాడు— మిగతా జీతగాండ్లు కూడా అరకలు విడిచేస్తారు— ఆ ఎడ్లను తన కొట్టంలో కట్టివేయడానికి కూడా అన్నమ్మ అనుమతించదు. హైదరలీ యీ విషయాలన్నీ ఓ జీత గాని ద్వారా దొరకు చెప్పంపుతాడు. కొమురయ్య తల్లినటు అరకలు అటకాయించడా

నికి పంపించి ఏమీ ఎరగనట్లు ఇటు కాళ్ళబేరానికి వచ్చాడని రామభూపాలరావు అతడ్ని గుంజకు కట్టేయించి కొడతాడు- కొమురయ్య భూమి దొర స్వాధీన మవుతుంది- కనకయ్య ఊరు వదిలి వెళ్ళిపోతాడు- కాని యీ సంఘటన ముఖ్యంగా కాపువాళ్ళను హైదరలీ, దొర కొట్టినచర్య కాపు కులస్తుల్లో తీవ్రమైన అసంతృప్తికి దారితీస్తుంది.

ఇది యిలా వుండగా అంజుమన్ మత ప్రచారానికి ముఖ్యంగా హరిజనులను తురక మతంలో చేర్చుకొనడానికి ప్రయత్నాలు తీవ్రమయ్యాయి. నిజామాబాద్‌లో హైదరలీ అల్లుడు యీ ఉద్యమానికి నాయకుడు- అతనితో సంబంధాలు పెట్టుకుని హైదరలీ రామభూపాల్‌రావు యింటికి రాకపోకలు తగ్గించి వూళ్ళో స్వతంత్రించి వ్యవహారాలు చేస్తుంటాడు. హరిజనులతో మంచిగా ప్రవర్తిస్తూ వారికి లేనిపోని ఆశలు కల్గిస్తూ మతం మార్చుకోవల్సిందిగా ప్రోత్సహిస్తుంటాడు- చివరకొకరోజు అంజుమన్ కేంద్ర నాయకుడ్ని జిల్లా నాయకుడ్ని వెంటబెట్టుకొని ఒక పోలీసు జమేదారును, ఆరుగురు పోలీసులను కూడా వెంటబెట్టుకుని వస్తాడు- చావడిలో సమావేశం ఏర్పాటు చేస్తాడు- ఊళ్ళో వచ్చిన యీ పరిణామాలు, జరుగుతున్న అన్యాయాలు విని తాను స్వయంగా వెళ్ళి ప్రజలను కూడగట్టాలన్న ఉద్దేశ్యంతో కంఠీరవం దిమ్మగూడెం వస్తాడు. చావట్లో హైదరలీ, అంజుమన్ నాయకుడు ఒక్కరొక్కరే హరిజనులను పిలిచి జుట్టూ మొలతాడు కత్తిరించి వాళ్ళకేవో తురకపేర్లు పెట్టి ఆడ వాళ్ళకు చీరా రవిక మగవాళ్ళకు ఒక్కొక ధోతి చొప్పున యిస్తూ వున్నారు- అయితే యీ మత పరివర్తన అనేది ఆలాహజరత్ ఫర్మాన్ వల్ల జరుగుతున్నదని హరిజనులు అందరివలె పుట్టిపెరిగినా ఊరికి దూరంగా మురికి కొంపల్లో వుంటూ పందుల్లా బతుకుతున్నారని అంజుమన్ నాయకుడు ఉపన్యాసమిస్తాడు- "వేరేవాళ్ళవద్ద మీకు కుక్కలకున్న గౌరవంలేదు. మీతో పొద్దస్తమానం పనిచేయించుకుని కడుపుకు నిండని కూలీ జీతాలు యిస్తున్నారు- కాబట్టి ప్రజల మేలుకోసం ఎల్లప్పుడూ పాటుపడే మన మహా ఘనతవహించిన ఆలాహజరత్ మీ బీదవాండ్లందరినీ బాగుచేయ నిశ్చయించుకున్నారు."

"మీరు మహమ్మదీయుల్లో కలిస్తే మీ కష్టాలు పోతాయి- మీరంతా మహమ్మదీయులతో సరిసమానంగా విద్య ఉద్యోగాలు పొందవచ్చును- హిందువుల దేవాలయాల్లోకి వెళ్ళలేనివారు ఊరి చేదబావుల వద్దకు పోజాలని వారు స్వేచ్ఛగా మజీదులోకి వెళ్ళవచ్చును- చేద బావుల్లోకి వెళ్ళవచ్చును. దేశముఖులు, పటేల్ పట్వారీలు ఏ విధమైన కష్టాలుపెట్టినా మేం సహాయం చేస్తాం. మీ కోసం బడికూడా ఏర్పాటుచేయిస్తాం" అని ఆ నాయకుడు హిందూ మతంమీద విమర్శగా కాకుండా సాంఘిక ఆర్థిక వ్యత్యాసా

లను కూడా చూపి అవి తొలగిస్తామని ఆశ పెడతాడు. గుంపులో కూచుని వున్న ఓ గొండ్ల ముసలి "దొర గుంజుకున్న భూములు, తీసుకున్న లంచాలు యిప్పిస్తారా" అన్నాడు. "తప్పకుండా యిప్పిస్తాము. మీకున్న కష్టాలన్నీ మా హైదరలీ సాహెబుకు చెప్పుకోండి. ఆయన అన్నీ తీరుస్తాడు. మన రాజ్యానికి ప్రధాన మంత్రి సర్ అక్బర్ హైదరీ వలెనే మీ వూరికి హైదరలీ గారున్నారనుకోండి." ఈ మాటతో ఆ వూళ్ళో తోడుదొంగలు అనదగిన దొర, హైదరలీల విషయం తెలిసిన జనానికి ప్రతినిధిగా కొమురయ్య "హైదరలీ సాహెబు న్యాయం చేయకపోతే యింకెవరు చేస్తారు? ఇంతవరకూ చేస్తున్నదంతా న్యాయమే" అంటాడు. హైదరలీ ఒళ్ళు మండి కేక వేసినప్పుడు కూడా మళ్ళీ అదేమాట అని కొమురయ్య లేచి నిలబడతాడు. కొము రయ్యను పట్టుకొమ్మని పోలీసులకు చెబుతాడు. కొమురయ్యను పట్టుకొచ్చి వాళ్ళ చావిట్లో కూర్చోబెడతారు. దానిమీద, అంజుమన్ మత ప్రచారానికి వచ్చిన వీరి వెంట పోలీసులుండే విషయంమీద కంఠీరవానికి, అంజుమన్ నాయకులకు ఘర్షణ పెరుగు తుంది. కొమురయ్యను, కంఠీరవాన్ని అరెస్టుచేసి తీసుకపోతారు. ఊళ్ళో కలవరం బయల్దేరుతుంది. హైదరాబాద్ సంస్థానంలో బహుశా యిదే మొదటి రాజద్రోహ నేరం. హరిజనులను మత పరివర్తన చేయించడం యిష్టంలేని రామభూపాల్‌రావు కంఠీరవాన్ని సమర్థించడానికి ధైర్యం చాలక సందిగ్ధంలో పడతాడు. మహమ్మదీయు లుగా మారిన హరిజనులు జీతగాళ్ళుగా పని చేయడానికి వెనుకాముందాడారు. అయితే ఏమీ పని చేయకుండా ఎన్నాళ్ళు ఏవిధంగా బతకడం? వెంటనే చదువులు ఉద్యోగాలు భూములు పొందడం సంభవమా? ఏ భూములు ఏ విధంగా లభిస్తాయి? ఎవరివల్ల ఎవరివి ఎప్పుడు ఏవిధంగా భూములు హరించబడ్డాయి? ఇవన్నీ ఆలోచిస్తున్నకొద్దీ అంతుదొరకని సమస్య. రెండోవైపు కొందరు రైతులు కొత్తగా జీతగాళ్ళను ఏర్పాటు చేసుకున్నారు. మహమ్మదీయులైన హరిజనులు గ్రామంలోకి పనివుండి వెళ్ళితే కొందరు బీరుపోయి చూసేవారు. మొత్తంపై గ్రామంలో అస్పష్టంగా ఓ విధమైన అసంతృప్తి, అసహ్యము ఏర్పడింది. ఈ మారిన పరిస్థితుల్లో రైతులను తిరిగి దగ్గరకు తీయాలని వెంకటాద్రి సలహాతో రామభూపాల్‌రావు ప్రయత్నిస్తాడు.

నిజామాబాదు కోర్టులో కంఠీరవంపై కొమురయ్యపై 124 (ఎ) సెక్షను కింద రాజద్రోహ నేరం కేసు మోపుతారు. కోర్టులో కంఠీరవానికి రెండు సంవత్సరాల కఠినశిక్ష 500 రూపాయల జుర్మానా. జుర్మానా చెల్లించనిచో మరి ఆరు నెలల జైలు శిక్ష విధించి కొమురయ్య నుండి సత్ప్రవర్తన హామీ తీసుకుని విడుదల చేయాలని తీర్పు చెబుతారు. ఆండాళమ్మ (కంఠీరవం తల్లి) ఒకసారి నిజామాబాద్ జైల్లో వున్న తన

కొడుకును చూడ్డానికి కొమురయ్యను వెంటబెట్టుకుని వచ్చింది– "ఇల్లు వదిలినా ఒకరి పంచన హాయిగా కాలం గడుపుతున్నావని, చదువు నేర్చుకుంటున్నావని విని సంతోషించాను కొడుకా ! ఇదెక్కడిదో కొత్తది మెడకుబడ్డది కొడుకా !" అని దుఃఖించింది.

"ఇది చదువు కంటె తక్కువేమీ కాదమ్మా ! రామభూపాల్‌రావు, వెంకటాచార్యులు, హైదరలీలు మన ఊర్లోనే కాదు ప్రతిచోటా వున్నారమ్మా ! వాళ్ళెక్కడ వున్నా నాకీ చదువులు తప్పవు."

కాపు కులంపెద్ద చంద్రయ్యతో వెంకటాద్రి రోజూ సంప్రదింపులు చేసి రామభూపాల్‌రావు పట్ల విశ్వాసం కలిగేటట్టుగా చేశాడు. చంద్రయ్యపై నమ్మకంతో యితర రైతులు కూడా కొంత మొగ్గు చూపారు. ముఖ్యంగా కొమురయ్య భూమి తగాదాలో ఏర్పడిన వాతావరణం మారిపోయి మహమ్మదీయులైన వాళ్ళను శత్రువులుగా తలచ సాగారు. సరిగా పంటల కాలంలోనే హరిజనులు పరివర్తన పొందడంతో వారి ఆర్థిక జీవితం దెబ్బతిన్నది– అంజుమన్ వారి సహాయం కూడా మందగించింది– రాజద్రోహ నేరంలో విముక్తి పొంది కొమురయ్య దిమ్మగూడెంలో కంఠీరవం సూచనపై రాత్రి పాఠశాల, గ్రంథాలయం, భజన మొదలగు కార్యక్రమాలు నడుపడానికై పరంధామయ్యను వెంటదీసుకుని వచ్చాడు. పరంధామయ్య నిజామాబాద్‌లో కంఠీరవానికి ఆత్మీయుడుగా వుండి అన్ని విషయాల్లో సహచరుడుగా వుండేవాడు. రామభూపాల్‌రావు ఆర్యసమాజీయులతో సంబంధాలు పెట్టుకుని విజయదేవ్ అనే ప్రచారకుని వెంట బెట్టుకుని వచ్చి హైదరలీ ఊళ్ళో లేని సమయంలో ముస్లింలుగా మారిన హరిజనులందరిని శుద్ధి సంస్కారం జరిపించి తిరిగి హిందువులుగా మార్చాడు. "ఈ అలజడి, అట్టహాసం, దౌర్జన్యాలు, అభియోగము, న్యాయస్థానాలు, న్యాయవాదనలు హిందూ మహమ్మదీయ మత ప్రచారంతో ఆ గ్రామ ప్రజల జీవితంలో ఓ వింత మనస్తత్వము, ఆలోచనాస్థితి, చైతన్యమూ ఏర్పడ్డవి– కొన్నాళ్ళకు పరిస్థితులు యథాస్థితికి వచ్చాయి– గ్రామీయుల చైతన్య స్థాయి పెరిగింది– పరంధామయ్య ప్రజల మన్ననలు పొంది ఆత్మీయుడుగా అందరితో కలిసిపోయాడు. రామభూపాల్‌రావు ప్రజల నుండి లంచాలు మామూళ్ళు గుంజడం, బెదిరించి ప్రతిఫలం లేకుండా పనులు వెళ్ళదీసుకోవడం మొదలగు వాటితోపాటు అందరినీ కలచివేసిన కొమురయ్య భూమి సమస్య విజయదేవ్ ద్వారా రామభూపాల్‌రావును అడిగిస్తారు– దాంతో రామభూపాల్‌రావుకు విజయదేవ్‌కు బెడిసిపోతుంది– విజయదేవ్ తన మకాం గ్రంథాలయానికి మారుస్తాడు– పరంధామయ్యకు తోడుగా వుండి రైతుల వెంట చేనుల్లో కాలక్షేపం చేస్తూ అప్పుడప్పుడు సందర్భాన్ని బట్టి గ్రంథాలయంలోను, భజన వేళల్లోను తనకు తోచిన ఆదర్శ వాక్యాలు,

శ్లోకాలు విన్పిస్తుండేవాడు- రామభూపాల్‌రావుకు విజయదేవ్‌కు వికటించడంతో మళ్ళీ రామభూపాల్‌రావు హైదరలీలు దగ్గర కావాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు- అయితే ఆర్యసమాజం ప్రధాని, ఆర్యసమాజం విజయదేవ్ ప్రవర్తనను సహించరని విజయదేవ్‌ను శిక్షిస్తారని రామభూపాల్‌రావు దృఢంగా నమ్మాడు- నిజంగా అంతే జరిగింది. విజయదేవ్ గడీ నుండి బయటపడి కేవలం గ్రామ ప్రజలపై ఆధారపడి జీవించడంతో వారికి ప్రజల సమస్యలు ముఖ్యంగా భూసమస్యలు అర్థంకావడం ఆరంభించినయ్. ఊర్లో చెరువు హర్రాజు పాడి రైతులతో సమిష్టిగా సాగుచేయించాలని విజయదేవ్, పరంధామయ్య నిశ్చయించుకుంటారు.

కంఠీరవం నిజామాబాదు జెయిల్లో ఆరుమాసాలున్నాడు- ఆ జైలు మొదట కోట- తర్వాత మందిరం- తర్వాత జైలు. అక్కడ యితర ఖైదీలతోపాటు గుట్టపై చెట్లు కొట్టడం, నీళ్ళు తేవడం, సమిష్టిగా వంట చేసుకోవడం అతనికి ఉత్సాహంగా వుండేది- కంఠీరవానికి జైలుకు రావడంతో సాంఘికపరమైన ఆచార వ్యవహారాల పట్ల కూడా పట్టింపు సడలిపోయింది- అక్కడి నుంచి అతడ్ని హైదరాబాదు జైలుకు మార్చారు- అక్కడ జైలు జీవితం గురించి అతడు చాలా తెలుసుకున్నాడు- కొంత మంది ఖైదీలు జైలునే వసతిగృహంగా పెట్టుకుని వున్నారని కొందరు 20, 25 ఏండ్ల శిక్షల వాళ్ళున్నారని వారి అభియోగముల విచారణ పూర్తి కావడానికి 6, 7 ఏండ్లు పట్టిందని, ఆ కాలం అసలు శిక్షలో చేర్చబడదని[4] కంఠీరవం తీవ్రంగా బాధపడ్డాడు.

"దీర్ఘ శిక్షల వాళ్ళలో ఎక్కువ మంది రైతులే. గ్రామాధికార్ల కుట్రలకు గురయి విసిగి వేసారి రెచ్చిపోయి చేసిన హత్యలు ఒకరికొకరికి విద్వేషాలు కల్పించి ఒకరికి సాయంగా నిలబడి చేయించిన హత్యలు, డబ్బునే ప్రధానంగా తలచి దాంపత్య విలువను, కుటుంబ కట్టుబాట్లను, పరహితాన్ని పాటించక జరిగే అవకతవకలను, అరాజక పరిస్థితులను ఎదుర్కొనుటకు చేసిన సాహసచర్యలే దీర్ఘశిక్షలకు ప్రధానంగా వెనుకనున్న చరిత్ర అని కంఠీరవం తెల్సుకున్నాడు- సమాజ స్వరూపమును పరిపాలన యొక్క భయంకర దృశ్యమును తలచుకుని బెంగపడ్డాడు- ప్రస్తుత వ్యవస్థను సహించి సాగనివ్వడం మహాపాపమని నిశ్చయించుకున్నాడు- మేధావులు ఏమి చేస్తున్నట్లు ! ? తనలో తాను మధనపడ్డాడు."

4. 1974 లో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సవరింపబడే దాకా యీ పరిస్థితి యిలాగే వుండేది- జస్టిస్ చిన్నపరెడ్డి తీర్పువల్ల యిప్పుడు '74 పూర్వము అరెస్టయిన వారికికూడా యిది వర్తిస్తుంది.

"అయితే నేరానికి దారితీసిన వారి ప్రవృత్తిలో వెంట్రుకవాసి కూడా జైలు జీవితంలో మార్పు రావడంలేదు- అవకాశం కూడా లేదు, పైగా రెచ్చిపోయి యింకా సాహసచర్యలు చేయడమో లేక లొంగిపోయి హృదయంలేని జైలు కట్టుబాట్లకు యింకా దిగజారిపోవడమో జరుగుతుంది- దాంతో అన్నివిధాలా బానిస ప్రవృత్తిని అలవర్చుకోవడం జరుగుతుంది." వీటికి దృష్టాంతా లెన్నింటినో కంఠీరవం జైల్లో చూశాడు- ఇటువంటి ఒక అన్యాయానికి బలైన బషీర్ అనే యువకునితో కంఠీర వానికి బాగా స్నేహం కుదురుతుంది- బషీర్ నిజానికి ఒక కోమట్ల పిల్లవాడు. అయన తలిదండ్రులు తిండికి వెళ్ళక అతడ్ని ఒక తురక గిర్దావరుకు అమ్ముకున్నారు ఆ గిర్దావరు తీవ్రంగా కొట్టేవాడు- ఆ దెబ్బలు భరించలేక యింట్లో నుంచి పారిపోయి భోన గిరిలో ఒక యిద్దరు బిచ్చగాళ్ళ సావాసం పొందాడు- వాళ్ళల్లో ఒకడు చేసిన దొంగ తనం కారణంగా దొంగగా ముద్రపొందాడు.

కంఠీరవం జైల్లో నేత శిక్షణలో చేరాడు- ఆయనకు విడుదల కాలం దగ్గరకు వచ్చింది- ఆ రెండున్నర సంవత్సరాలల్లో చాలా మార్పులు వచ్చాయి.

"దిమ్మగూడెంలో ప్రజల్లో చైతన్యం కలిగింది. రామభూపాల్‌రావంటే బెదురుపోయింది- ప్రజలు తమ నిత్య జీవితంలో రామభూపాల్‌రావు వల్ల పొందే చిక్కులు పోగొట్టుకోవలెననే తహతహ ఎక్కువ కాసాగింది- గ్రంథాలయం ఆ వూరి ప్రజలకు ప్రధాన కేంద్రమయింది- రాత్రి పాఠశాలతో పాటు పగటి పాఠశాల కూడా నడుస్తున్నది- విజయదేవ్ పరంధామయ్యల నాయకత్వం, చంద్రయ్య కొమురయ్యల ముందడుగు ధైర్యం పట్టుదల గ్రామ ప్రజలకు పెట్టని కోటగా పనిచేస్తున్నాయి- గ్రామ ప్రజల్లో వుండే అమాయకత్వం నిరాశానిస్పృహలు తొలగసాగాయి- ప్రభుత్వ పన్నులు చెల్లించేప్పుడు మామూలు యివ్వడం పూర్తిగా ఆగిపోయింది. బహీఖాతాలపై రశీదులు రాయించుకోవడం విధిగా జరిగేది- బెగారీ నియమాల ప్రకారం పని వాళ్ళకు కూలిడబ్బులు సాధించడంలో కూడా పట్టుదల పెరిగింది- గ్రామాలకు వచ్చే అధికార్ల నుండి మొదలే డబ్బు తీసుకుని వారికి కావలసిన తిను భాండారాలను అందించడం మొదలయ్యింది- ఇక రామభూపాల్‌రావు వెంకటాద్రి హైదరలీ ప్రతి విషయం ఐక్యంగా ఆలోచించడం, కామారెడ్డి, నిజామాబాద్ అధికార్లతో సంబంధాలు పెంచుకోవడం జరిగింది- వ్యవసాయం, పోలీసుశాఖ వ్యవహారాలకు సంబంధించిన ప్రభుత్వ నియమముల చట్టాల మార్పులు వివరాలు పట్టిపట్టి పరిశీలించి దానికి వ్యతిరేకంగా ఎవరు చేస్తారో కనిపెట్టి వారిపై చర్యతీసుకోవడం, న్యాయస్థానాల వెంట తిప్పడం మొదలుపెట్టారు.

ప్రభుత్వ రికార్డులో వున్న దానికంటె ఎక్కువ భూమిని దున్నారని, వానజాలు నీళ్ళు వాడుకుంటున్నారని, గెట్టులను దున్నారని, కొలతరాళ్ళు పడిపోయాయని, అనుమతిలేకుండా యిండ్లను మార్చి కడుతున్నారని, దున్నలకు, ఎద్దులకు మూగుతాడు కట్టలేదని, కొమ్ములకు బొక్కెలు వేయించలేదని- యీ విధంగా ప్రజలను యిబ్బంది పెట్టడం మొదలయింది. రామభూపాల్‌రావు యీ చర్యలవల్ల గ్రామీయుల్లో అనుభవము, బాధ్యతలు గుర్తించడం అధికమైంది.

ఇటువంటి వాతావరణంలో నిజామాబాద్‌లో ఆంధ్ర మహాసభ జరిగింది- కాని చిత్రం ఏమిటంటే యీ మహాసభ ఆహ్వాన సంఘంలో రామభూపాల్‌రావు కూడా వున్నాడు- ప్రజలు ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచారు- ఎంత ఆలోచించినా అంతు చిక్కలేదు- పరంధామయ్య నిజామాబాదు వెళ్ళి రామభూపాల్‌రావు గ్రామంలో చేస్తున్న అన్యాయపు పనులు కుట్రలు మొదలగునవన్నీ ఆహ్వాన సంఘ కార్యకర్తలకు నాయకులకు తెలిపారు- కొందరు అసహాయత వెలిబుచ్చారు- కొందరు పరంధామయ్యనే తప్పుగా తేల్చారు. నిజామాబాదు మహాసభకు రామభూపాల్‌రావు వెళ్ళాడు- అగ్రశ్రేణిలో అందరికీ ఆప్తుడిగా వ్యవహరించాడు- వెంట కచ్చతం వుంది- పనివాళ్ళు ఆడబాపవాళ్ళు వెంటనే వున్నారు- ప్రత్యేకంగా భోజన వసతి ఏర్పాటు చేసుకున్నాడు- పరంధామయ్య, విజయదేవ్‌లు కొమురయ్య, చంద్రయ్య కూడా మహాసభకు వెళ్ళారు. గ్రామ సమస్యలపై జరిగిన చర్చలు వారికి నచ్చాయి- కాని రామభూపాల్‌రావు సభలో పాల్గొనడమే వాళ్ళకు అయోమయం అన్పించింది- అందులో తమ స్థానమేమిటో తెలుసుకోజాలక తికమకపడ్డారు-

ప్రతి సంవత్సరం దిమ్మగూడెంలో జరిగే చెరువు, చింతల హర్రాజుల్లో గ్రామ ప్రజలు కూడా పాటపాడాలని అనుకోవడమే కాని సమయానికి డబ్బుచేకూరక ఎన్నడూ పాడలేదు- కాని ఆ సంవత్సరం మొదటినుంచే జాగ్రత్తపడి డబ్బును భద్రపరచుకొని సమయానికై నిరీక్షించసాగారు- రామభూపాల్‌రావు, గిర్దావరు, వెంకటాద్రి, హైదరలీ కలసి మామూలుగా ఆ సంవత్సరంకూడా రామభూపాల్‌రావు పేర పాటను ముగించారు- దొంగ పంచనామా జరిపారు- తొత్తులను సాక్షులుగాను, పంచులుగాను పేర్లు రాశారు- వారిలో వారే చేతిముద్రలు వేశారు- అంతా ఎవరికి తెలియకుండానే జరిగిపోయింది. రామభూపాల్‌రావు నాగండ్లు చెరువు లోతట్టులో దున్నడం సాగగానే ఊళ్ళో కలవరం బయల్దేరింది. కొమురయ్య, చంద్రయ్య చెరువులోకి వెళ్ళి నాగండ్లను చూసి విభ్రాంతులయ్యారు. వెంటనే పరంధామయ్య, విజయదేవ్‌లు రైతులను యితర ప్రజలను

తీసుకొని చెరువులోకివెళ్ళి నాగండ్లను విప్పేశారు- దున్నడం ఆగిపోయింది- ఆసంగతి తెలిసి రామభూపాల్‌రావు వొణికిపోయాడు- ప్రజల సాహసానికి నిర్విణ్ణుడయ్యాడు- వెంటనే వెంకటాద్రిని కామారెడ్డికి పంపాడు- గ్రామంలో అశాంతిగా వుందని, ప్రజలంతా దొమ్మికి సిద్ధపడ్డారని, రామభూపాల్‌రావు ప్రాణం అపాయంలో వుందని పోలీసులకు చెప్పి దిమ్మగూడానికి మెజిస్ట్రేటును, పోలీసులను వెంటబెట్టుకుని వచ్చాడు- ఆ వాతావరణంలో గ్రామ ప్రజల ఉద్రిక్తత హెచ్చిపోయింది. మెజిస్ట్రేటు, పోలీసులు రామభూపాల్‌రావు గడీలో ఉపాహారాలు, సమాలోచనలు జరుపుతుండగా ఊరి ప్రజలంతా ఆడా మగా అంతా చెరువులో గుమిగూడారు- ఆడవాళ్ళు పిల్లలతో ఒకచోట మగవాళ్ళంతా ఒకచోట గుంపుగా చేరారు- గ్రామమంతా నిర్మానుష్యమయింది- మెజిస్ట్రేటు, పోలీసు సిబ్బందితో చెరువు లోతట్టుకు వచ్చి ప్రజలందరినీ చూసి నివ్వెరపోయాడు- "ఈ పరిస్థితి నాకే కొత్తగా వుంది- ప్రజలీవిధంగా కట్టుబాటు కొచ్చారా" తనను తానే అనుకున్నాడు- అక్కడికక్కడ 144వ సెక్షన్ ప్రకటించాడు. ప్రజల తరఫున పరంధామయ్య, కొమురయ్య, చంద్రయ్య హర్రాజుకు సంబంధించిన చట్టపరమైన ప్రశ్నలెన్నో వేశారు. ప్రజలను రెచ్చగొట్టి శాంతి గురించి మాట్లాడి లాభంలేదని చెప్పారు- "గ్రామ క్షేమం ఏం మరచిపోలేదు- కాని రామభూపాల్‌రావు ప్రజలను యీ విధంగా రెచ్చగొడుతుంటే అతడ్ని అదుపులో పెట్టక మమ్ములను బెదిరించడం ఎంతవరకు న్యాయం? దొరకింద నలిగి నలిగి విసిగి వేసారి ఎండు గడ్డివలె వున్నారు ప్రజలు- వాళ్ళపై మీరు తుపాకులు కాలుస్తారా? వూళ్ళోకి వచ్చినోరు మమ్మల్ని కూడా విచారించ కూడదా? దొర యేది చెపితే అదే మీకు నమ్మకమైతే ఎట్లా పాడవుద్ది? ప్రజలపై మీరు తుపాకులు కాలుస్తారా? ఎండుగడ్డి కాలితే ఏమవుతుంది! ప్రభుత్వ నియమాలను, ప్రజాశ్రేయస్సును పక్కకుతోసి ప్రజలను పశువులుగా తలచే యీ కొద్దిమంది గ్రామాధికారులే మీ ప్రభుత్వం బొక్కసం నింపుతున్నారను కోండి- ప్రజలపై అన్యాయాలు చేసి, జైళ్ళకు పంపి, కాల్చి చంపి గుట్టలను, రాళ్ళను పరిపాలిస్తుందా?" అని నిలదీసి అడిగారు ప్రజలు.

ప్రజల ప్రతిఘటన ముందు మెజిస్ట్రేట్ చేసేదేమిలేకపోయింది- వాళ్ళ వాదనా బలం కూడ ఆయనకు నచ్చింది- కాని పైకి బింకంచూపి దున్నడమైతే ఆపించాడు గానీ మూడు రోజులపాటు 144 సెక్షన్ ఆ గ్రామంపై మోపి వెంటనే ఊరువిడిచి వెళ్ళిపోయాడు- సిబ్బందితోపాటు పోలీసు అధికారి రామభూపాల్‌రావు ఇంట్లో బసచేశాడు- మూడు రోజుల వరకు పోలీసు సిబ్బంది ఊళ్ళోవుండి వెళ్ళిపోయారు- ఇంత మంది పోలీసులు ఒకవైపు మొత్తం గ్రామం ఒకవైపు బలాబలాలు చూసుకోవడం రామభూ

పాల్‌రావు చేరువు దున్నడం ఆగిపోవడం గ్రామీయులకు పట్టరాని ఊహింపజాలని సంతోషం కల్గింది- ఈ వార్త పత్రికలకు కూడ ఎక్కింది- ఈ సంఘనతో రామభూపాల్‌రావు అధికారం గ్రామంలో సడలిపోయింది- ఈ అదను తీసుకొని అధికారులు హైదరలీకి పట్వారీ దస్త్రం యిచ్చి అతనితో రామభూపాల్‌రావు రాజీపడేలా చేసారు- ఆ సంవత్సరం చెరువు హర్రాజు జరుగలేదు.

కంఠీరవం, బషీరు జెయిలు నుంచి విడుదలయ్యారు- బషీర్‌కూడ కంఠీరవం కోర్కెమీద అతని వెంటనే నిజామాబాదుకు మోహనాచారి (వేదాంతచారి కొడుకు, వకీలు) ఇంటికి వచ్చాడు- అక్కడే ఆయనతోటి వకీలు వెంకటేశ్వరరావును కూడ కలుసుకున్నారు- అక్కడ మోహనాచారి, వెంకటేశ్వరరావుల కోర్కెపై కంఠీరవం తన జెయిలు జీవితానుభవం ఆవేశపూరితంగా చెపుతాడు- జెయిల్లో "మనం బయట చూస్తున్న అవకతవకలు, నిరంకుశత్వం, నీచపు అలవాట్లు రెట్టింపు వికృత రూపంలో వీరవిహారం చేస్తుంటాయి- మొత్తం జేలు వ్యవస్థను క్లుప్తీకరించి చెప్పుతున్నాను- భయంకరమైన భీభత్సమైన ప్రపంచ మనుకోండి.... ప్రతి ప్రభుత్వం తన దేశమును గురించి గొప్పగా చెప్పుకునే సుఖసంపదలు, నీతినియమాలు, పరిపాలనా సౌష్టవం కండ్లారా చూడాలంటే జేలులో నగ్నంగా చూడవచ్చును.... జైలులోని ఖైదీల గాధలే మన మేవిధంగా ఉన్నామో తెలుసుకోవడానికి సజీవ ప్రమాణాలు.".... "నేటి అరాజకపు సమాజ చాకిడికి తట్టుకోలేక, ఏదేని కారణంతో జేలు నాలుగు గోడల్లోకి చేరినవాడు మనో నిబ్బరం, ఆత్మవిశ్వాసం కోల్పోయాడంటే వాడు బయటికి వచ్చేవరకు అతడి నైజత్వమే నశిస్తుంది- అతని ఆలోచనలే మారుతాయి- అతని నైతికస్థాయి దెబ్బతింటుంది- అతని పరిసరాలే మారుతాయి- పొగాకు పొగకు మూతివిరిచేవాడు గంజాయికి దాసుడవుతాడు- బంగారం దొంగిలించ సాహసంలేనివాడు ఎంగిలి బీడీల కొరకు వెతుకుతుంటాడు- సత్యమే ఆశయంగా పెట్టుకున్నవాడు అసత్యమే ఆదర్శంగా చేసుకుంటాడు- పదిమందికి అన్నం పెట్టి ఆనందించేవాడు ఇతరుల నోటి ముందరి అన్నాన్ని అపహరించ చూస్తాడు."

దిమ్మగూడెం చెరువు సంఘటన వార్తను చదివి కంఠీరవం సంతోషంతో ఉబ్బిపోయాడు- పరంధామయ్య పట్టుదలతో తన గ్రామీయుల చైతన్యస్థాయి అంతవరకు పెరిగిపోవడం కంఠీరవానికి ఎంతో ఆనందం కలిగించింది- ఇక తన గ్రామం వెళ్ళక తప్పదని నిశ్చయించుకున్నాడు.

వారంరోజులు హైదాౌబాద్‌లో వుండి బషీర్‌ను, వెంకటేశ్వర్రావును వెంట బెట్టుకొని దిమ్మగూడెం పోయాడు- ఇంటికి వెళ్ళి తల్లినీ వదినను పలుకరించి గ్రాంధా

లయానికి వెళ్ళాడు- అక్కడ పరంధామయ్య, విజయదేవ్, కొమురయ్య, చంద్రయ్య లతో గ్రామ సమస్యలు చర్చించాడు- తల్లి, వదిన కంఠీరవం ఇంట్లో వుండాలని కోరుకున్నారు కానీ దొరేమంటాడోనని భయపడ్డాడు- దొర పిలిపించి అదే హెచ్చరించాడు- జైలుకు పోయివచ్చాడు కనుక ప్రాయశ్చిత్తం చేయాలన్నాడు- చెరువు సమస్యపై రైతులను ఉసిగొల్పుతాడని హెచ్చరించాడు- రాత్రి గ్రంథాలయానికి వెళ్ళి వాళ్ళేం చేస్తారో వినమన్నాడు- గ్రంథాలయంలో కంఠీరవం ఆమధ్యకాలంలో వచ్చిన మార్పును గురించి మాట్లాడాడు- "నేను గ్రామం విడిచి వెళ్ళిపోయినప్పుడు నాకు కొమురయ్య ఒక్కడే ఆప్తుడుగా వున్నాడు- నేడు మీరంతా ఆప్తులుగా నాకు తోస్తున్నది. నాడు నాకు ఇల్లు, కుటుంబం వున్నప్పటికి అనాధునిగా ఊరువదిలి వెళ్ళిపోయాను- ఈనాడు నా ఒంటిపై బట్టలు తప్ప వేరే ఏమిలేవు- ఐనా మీరంతా నాకు తరగని ధనంగా విడదీయజాలని కుటుంబంగా తలుస్తాను- మీవంటివారు ప్రతిచోట వున్నారు- అట్టివారి ఆదరాభిమానాల వల్లనే నేను ఈ నాటికి జీవించి వున్నాను" అని చెప్పి జనానికి బషీర్‌ను పరిచయం చేస్తాడు. "దేశాన్ని కట్టుబాట్లతో నీతినియమాలతో నడిపే ప్రభుత్వం పరహితం, స్వార్థత్యాగం విశాలహృదయం వున్న ప్రజలు లేనంతవరకు బషీర్ వంటి జీవులు బయలుదేరుతూనే వుంటారు- కాబట్టి ప్రతివారు పరిస్థితులను, మన కష్టాలను కష్టాల కారకులను అర్థంచేసుకోవాలి- మన బాధ్యతలు గుర్తించి హక్కులను సాధించుకోవాలి- అప్పుడు మనమీ స్థితి నుండి బయటపడతాం- ఉత్తమ వ్యవస్థ ఏర్పడుతుంది. మన గ్రామం చెరువు వార్త పత్రికల్లో చూడగానే రెక్కలుంటే ఇక్కడ వాలాలనుకున్నాను- మీ పట్టుదల చైతన్యం వల్లనే అంతటి పనిని సాధించారు. తుపాకులు పోలీసులు అధికారం అన్నీ మీకింద పనికిరాలేదు- మీ స్థితిని వారు తెలుసుకోవడానికి ఇదే చాలు." ఇదే సందర్భంలో వెంకటేశ్వరరావు మాట్లాడిన మాటల్లో అతడు ఎన్నడో ఈ గ్రామాన్ని వదిలిన బ్రాహ్మణుని కొడుకు వెంకటేశ్వర్లు అని తేలుతుంది. ఈ వెంకటేశ్వర్లు కలీలుకు చేసేవాడు. ఈ భూమినే వెంకటాచారితో దొంగ సంతకం చేయించి రాంభూపాల్‌రావు స్వాధీనం చేసుకున్నాడు. ఈ విషయం బయటికి లాగాలని ఈ దొంగ సంతకం చేసిందెవరో, దొంగ సాక్ష్యం చెప్పిందెవరో తెల్సుకోవాలని వాళ్ళకూ రాంభూపాల్‌రావుకు తగిన శిక్ష వేయించాలని నిర్ణయించుకుంటారు- ఇక్కడ చట్టాలపట్ల పెద్దవారికే ఎంత నిరాదరణో చర్చల్లో వస్తుంది- కొమురయ్య ఆ భూమి గురించి జరిగిన విషయమంతా వెంకటేశ్వరరావుకు వివరంగా చెప్పి "మాటిమాటికి ఖానూన్ అంటాడు మా దొర- మరి మీరు కూడ ఖానూన్ తెలిసినోరే నయితిరి- ఆ ఖానూన్ ఏందో అమ్మడమేందో మీరు తెల్సుకోవాలె" అంటడు.

"మీ గ్రామ వ్యవహారాలు సామాన్యంగా ఉండవు- దేశాలను మింగే మహా మహులు వుంటారన్నమాట- ప్రజల ఆస్తులూ, ప్రభుత్వ చట్టాలు వీళ్ళకు లెక్కలేవే.... వింటున్నావా బషీర్, మీరు దొంగతనంచేస్తే బెత్తం దెబ్బలు జెయిలు శిక్షలు- ఎన్నో ఏండ్ల కిందట ఒకరి భూమిని తనదని హరించి ఒకడు రాజ్యమేలుతున్నాడు- వీండ్లకు జంకులేదు, పాపభీతిలేదు, ప్రభుత్వ భయంలేదు- వీళ్ళకు శిక్షలేదు, జెయిలులేదు" అంటాడు కంఠీరవం.

మొత్తానికి ఈ సమస్యమీద రామభూపాల్‌రావు మోసాన్ని బయటపెట్టాలనే నిర్ణయంతో ఉత్సాహం పొందుతారు- తన తమ్మునికి ప్రజల్లోగల పలుకుబడి చూసి వెంకటాచారి ఆలోచనలోపడ్తాడు- కాని తమ్మణ్ణి ఇంటికి రమ్మనడు- అందరూ కొము రయ్య ఇంట్లో అన్నాలు తింటారు- ఊరు నుంచి వెళ్ళిపోయేనాడు కంఠీరవానికి కొమురయ్య తల్లి అన్నమ్మ కాళ్ళకు నమస్కరిస్తుంది- జెయిలు నుంచి తిరిగివచ్చిన కంఠీరవం అమాంతం అన్నమ్మ కాళ్ళకు నమస్కరిస్తాడు- ఊరు నుంచి వెళ్ళేముందు కంఠీరవం కొమురయ్య ఇంట్లో పాలుమాత్రం తాగుతాడు- ఇప్పుడు తురకగా మారిన కోమటాయనతో (బషీర్) కూర్చుని కాపువాని ఇంట్లో సహపంక్తి భోజనం చేస్తున్నాడు. మతము, కులము విషయంలో ఏ కట్టుబాటూ పాటించని కంఠీరవం చర్యలు కొముర య్యకు చివరకు విజయదేవ్‌కు కూడ మింగుడుపడలేదు- "కులాలపేర మతాలపేర ప్రారంభమయిన ఈ అడ్డుగోడలు క్రమంగా బలమైన అడ్డంకులుగా తయారయినవి- దాంతో మనలో ఐక్యత నశించింది- సమిష్టి బాధ్యత సమిష్టి ఆలోచన సమిష్టి జీవితం లేకుండా పోయింది- నేను నావరకు అటువంటి ఏ అడ్డంకులను కూడ లక్ష్యపెట్టదలచు కోలేదు- ప్రయత్నపూర్వకంగా అట్టివాటిని ఎదుర్కొంటాను."

"....ఈ మతాలు బలవంతంగా మెడకు పడ్డవే కాని కోరితెచ్చుకున్నవి బహు స్వల్పం. పుట్టుక వల్లనో లేక తరువాత ఏదైనా ప్రభావం వల్లనో మెడకు పడ్డ పేర్లు మాత్రమే...."

తురకల ప్రభుత్వం కావడంవల్ల హిందూ ప్రజలు బాధపడుతున్నారని విజయ దేవ్ అభిప్రాయపడితే "అంటే అంజుమన్ వాళ్ళు మతవిషాన్ని పంచుతుంటె దానికి విరుగుడుగా అదే మార్గం అనుసరణీయం అని నేనంగీకరించను- దానికి విరుగుడు పూర్తిగా భిన్నంగా వుండాలి- హైదరలీ, రాంభూపాల్‌రావుల ఐక్యత మనందరికీ కను విప్పుగా వుండాలి- మనం మన సమస్య దృష్ట్యా వ్యక్తులను, ఆశయాలను అర్థం చేసు కోవాలి- అవి ఎక్కడనుంచి ఏవిధంగా వస్తున్నవో గమనించాలి" అంటాడు కంఠీరవం.

తహసీల్ కచేరిలో వెంకటేశ్వర్లు పేరుతో దొంగ సంతకం చేసింది వెంకటాచారి అని తేలుతుంది. పరంధామయ్య, కొమురయ్య, విజయదేవ్, కంఠీరవం తన అన్న విషయంలో ఎటువంటి వైఖరి తీసుకుంటాడో అని ఆతురతగా చూస్తారు. రామభూపాల్‌రావును, వెంకటాచారిని, నిర్బంధింప చేయాలనే వాళ్ళ ఆలోచనకు ఎదురు చెప్పక పోవడమే కాదు ఉత్సాహం కూడ చూపుతాడు కంఠీరవం. న్యాయాధిపతి రామభూపాల్ రావును అరెస్ట్ చేయించాలంటే కొంచెం జంకుతాడు. కాని వెంకటేశ్వర్రావు పట్టు దలతో ఆ ఇద్దరు నిర్బంధింపబడతారు.

గ్రామ ప్రజలు చెప్పరాని ఆవేదనలో పడతారు. తమను పీడిస్తున్న దుష్టశక్తు లకు తగినశాస్తి జరిగినందుకు సంతోషం కల్గింది. గ్రామానికి పెద్దయై చేసే తప్పులన్నీ ఒప్పులుగా చెల్లిపోవడం చూసిన ఆ ప్రజలే తమ కండ్ల ఎదుట నేరస్తులుగా నిర్బం ధింపబడడం పోలీసులకు విధేయులుగా లొంగిపోవడం ఎంతో ఆశ్చర్యపడ్డారు. కులా నికి పెద్ద ఐన వెంకటాచారి, గ్రామానికి పెద్ద ఐన రామభూపాల్‌రావు యొక్క పెత్తనా లందలి లోతుపాతులింతేకదా అని కొందరు మూతులు విరిచారు. పోలీసు అధికారులు వచ్చినప్పుడల్లా రామభూపాల్‌రావు గడీలో కులాసాగా కాలం గడిపేవారు. విందులు వినోదాలు మామూళ్ళు పేజువాణీలు మొదలైన సంబరాలు జరుగుతుండేవి. కాని ఆ అధికారుల్లో ఒకడైన అమీనుకు ఇన్ని మంచినీళ్ళు ఇచ్చినవాళ్ళు లేరు. పోలీసులు వస్తున్న పిల్లులవలె పేలవమైన ముఖాలువేసుకొని ఆరోజు ఊరు విడిచి వెళ్ళిపోయారు. గత్తర లేచినపుడు గ్రామాన్ని వదిలిపెట్టి దేవరను సాగనంపినట్లు వుండింది ఆరోజు గ్రామ వాలకం. ఆండాళమ్మ భరింపరాని దుఃఖంలో కుమిలిపోయింది. కంఠీరవం ఈ విషయంలో అన్నకు సాయపడక శత్రువర్గంలో కలిసిపోవడం ఆమెకు అసహ్యం కల్గింది. వెంకటాచారి ప్రజాకంటకుడని భార్య తాయమ్మ ఎరుగున్నా నిర్బంధింపబడ డానికి మాత్రం కంఠీరవం యొక్క పాలిపగే కారణమని కంఠీరవాన్ని నిందించింది.

దిమ్మగూడెం సంఘటన మొత్తం జిల్లాలోనే కలవరం లేపింది. అధికార బృందం ఆశ్చర్యం ప్రకటించింది. ప్రభుత్వానికి జీవనాళాలైన గ్రామాధికారులు ఈ విధంగా ప్రజలముందు పలచనై పోవడం పరిపాలనా సౌష్టవానికే గొడ్డలిపెట్టుగా భావించారు. "ఇంత బద్మాష్‌లైనారే ప్రజలు" "ప్రజలు దిన దినం హద్దుమీరి పోతు న్నారు" మొదలైన వ్యాఖ్యానాలు చేశారు. రామభూపాల్‌రావు, వెంకటాచారి జామీన్ మీద విడుదలయ్యారు. దిమ్మగూడెం వెళ్ళడానికి ఓంకారు, తోటి పెత్తందార్లతో తీవ్రంగా ఆలోచించారు. కొందరు పెద్ద వకీళ్ళ ద్వారా వెంకటేశ్వర్రావుపై వత్తిడి తెచ్చి

అభియోగాన్ని ఎత్తివేయించాలన్న ఎత్తులు వేశారు. కాని అతడు లొంగలేదు. రామభూపాల్‌రావుకు ఒక సంవత్సరం, వెంకటాచారికి మూడు సంవత్సరాలు శిక్ష పడి నిజామాబాద్ జెయిలుకు పంపించబడ్డారు.

రామభూపాల్‌రావు వ్యవసాయం వ్యవహారాలు చూడడానికి ఆయన అల్లుడు కొండల్‌రావు దిమ్మగూడెంలో వుంటున్నాడు- ఖద్దరు ధరిస్తాడు- హరిపుర కాంగ్రెస్‌కు ఆంధ్ర మహాసభకు వాలంటీర్‌గా వెళ్ళాడు- తాను ఆరితేరిన రాజకీయవేత్తనని కంఠీరవం మొదలైన రామభూపాల్‌రావు శత్రువులు అల్పులని, వెలితిపడే వాళ్ళని అతని అభిప్రాయం.

కంఠీరవం, వెంకటేశ్వర్రావు మొదలైనవారు వెంకటేశ్వర్రావు ఇల్లు బాగు చేయించుకొని దిమ్మగూడెంలో శాశ్వతంగా వుండిపోయారు- విజయదేవ్ పరంధామయ్యలు గ్రంథాలయ నిర్వహణలో లీనమయివున్నారు- కంఠీరవం, బషీర్‌లు కొమురయ్యకు వ్యవసాయంలో సాయంగా వున్నారు- బషీర్ విద్యాభ్యాసం మొదలుపెట్టాడు- వెంకటేశ్వర్రావు కామారెడ్డిలో వకీలుగా పనిచేయ మొదలుపెట్టాడు- అప్పుడప్పుడు రైతులకు సంబంధించిన ప్రభుత్వ నియమాలను వాటి లోటుపాటులను ప్రజలకు బోధించేవాడు- కంఠీరవం తనకు నచ్చిన గ్రంథాలను ప్రజలకు చదివి వినిపించడం తోచిన విషయాలపై విపులీకరించడం మామూలుగా జరుగుతుండేది.

ప్రభుత్వం దిమ్మగూడెంపై దృష్టిని బాగా కేంద్రీకరించి వుంచింది- కంఠీరవం మొదలైనవారి విషయంలో పోలీసుశాఖవారు చాల అనుమానంగా వుంటూ ప్రతి విషయాన్ని జాగ్రత్తగా కనిపెడుతున్నారు- మాటిమాటికి గ్రంథాలయానికి రావడం, ఏమేమో ప్రశ్నలు వేయడం, హెచ్చరించడం జరుగుతుండేది. ముఖ్యంగా దిమ్మగూడెం ఆ గ్రామ ప్రజలకు కనువిప్పుగానూ, ప్రభుత్వానికి హెచ్చరికగానూ వుండింది. కంఠీరవం అప్పుడప్పుడు ఇంటికి వెళ్ళడం, తల్లి, వదినతో మాట్లాడటం జరుగుతుండేది- దొర దుర్మార్గాల గురించి అన్నపై అతని దుష్ట ప్రభావం గురించి చెప్పి విడుదలై వచ్చాక అన్నను దొర ప్రభావం నుంచి దూరం చేస్తానని వదినకు ఊరట కలిగించాడు- వాళ్ళకు క్రమంగా కంఠీరవం గురించి కలిగిన చెడ్డ అభిప్రాయాలు పోయి ప్రేమ, విశ్వాసాలు ఏర్పడ్డవి.

ఒకనాడు హైదరాబాద్ నుండి వచ్చిన పత్రికలతో పాటు ఒక రిజిష్టర్ కాగితాల కట్టకూడ వచ్చింది- అవి అచ్చు కరపత్రాలు- అందులో జగపతిరెడ్డి కంఠీరవానికి ప్రత్యేకంగా రాసిన ఉత్తరం కూడ వున్నది- "హైదరాబాద్ సంస్థానంలో కాంగ్రెస్ పోరాటం"- అబ్బ ఎన్నాళ్ళకు అని అతని హృదయంలో నుండి ధ్వనించింది- తాను

చూస్తున్న కుళ్ళు, కుట్రలు, కుతంత్ర పరిపాలన నిర్మూలనమై తాను ఆశించిన ఆదర్శ ప్రభుత్వం సాధించే అవకాశం కల్గిందని ఉబ్బితబ్బిబ్బయినాడు. అయితే జగపతిరెడ్డి ఉత్తరంలోని కొన్ని వాక్యాలు అతనికి నవ్వు తెప్పించాయి. "అసఫ్జాహి వంశ చరిత్ర మొత్తం అవినీతి కుట్ర చేటు." "రాజ్యాల స్థాపనకు రాజవంశాలకు ఘనత తెచ్చే చరిత్రింటూ ఏదైనా వుందా?.... ఈ భ్రమ కొన్నాళ్ళు ఈ భ్రమ తొలగటానికి కొంతకాలం వృథా కావాలె కాబోలు."

"ప్రతీ రాజవంశం పాపంతో కూడుకొనివున్నదని చరిత్ర రుజువుచేస్తున్నది...."

"....దేశము నందలి అవకతవకలకు బీదల పాట్లకు సంపన్నుల వైభోగాలకు దైవిక కారణాలని కొన్నాళ్ళు గడిపారు. ధర్మ సూత్రాలపేర కొన్నాళ్ళు కప్పిపుచ్చారు. బాధితులు కళ్ళు తెరచి రెచ్చిపోయి హేతువాదనలకు దిగేవరకు పశుబలాన్ని చేపట్టారు. అది ఇంకా సాగుతూనే వున్నది. కాబట్టి అనవసర భ్రాంతులలో కొట్టుక పోకండి. మనిషిమనిషిగా జీవించే మార్గమేదో అది ఒకటే మనకు గీటురాయి. ఆ ఆత్మవిశ్వాసం గలిగివుండి స్పష్టమైన గమ్యం తెలుసుకొని రంగంలో దూకంది లాభంలేదు. స్వాతంత్ర్యం, అధికారం, ఏ ఒకరిసొత్తు కాక ఎల్లరి అనుభవానికి ఆచరణకు అందుబాటులో నుండే సమిష్టి హక్కుగా పరిణమించి నప్పుడే ఏదేశమైనా సుభిక్షంగా వుంటుంది. బాధ్యతారహిత ప్రభుత్వాల ఉనికి నశిస్తుంది." ఈ భావాలతోపాటే స్టేట్ కాంగ్రెస్‌లో చేరే తమ సంసిద్ధతను జగపతిరెడ్డికి తెల్పాలని కంఠీరవం అనుకున్నాడు.

ఇప్పటి సర్కారును పూర్తిగా మార్చేసి మొత్తం ప్రజల ఇష్టంపైన కొత్త సర్కారును ఏర్పాటు చేయాలంటే చాల చేయాల్సి వుంటుంది. ఊడలు పారిన మర్రి చెట్టులాగా గట్టిగా వేళ్ళు పాతుకొని వుంటాయి ఈ ప్రభుత్వాలు. మరి మర్రిచెట్టును పీకేయుడమంటె ఒకరిద్దరితో అయ్యే పనికాదు. మరి ఈ ప్రభుత్వాలను మార్చడానికి ప్రజలంతా ఒకటయ్యే వరకు సర్కారోళ్ళంతా ఇష్టమయిన పనిచేస్తారు. వందల ఏండ్ల నుంచి ఇష్టమొచ్చినట్టు ఆటలాడిన ప్రభుత్వం తన క్రింద అణగివున్న ప్రజలు ఎదురుతిరిగితే ఊరుకుంటుందా? రెచ్చిపోయి పిచ్చిపనులన్నీ చేస్తుంటది. దాంట్లో జేళ్ళలో పెట్టడం కూడ ఒకటి. మంచి ప్రభుత్వం వచ్చేదాకా కష్టాలు తప్పవు.

ఈ భావాలతో స్టేట్ కాంగ్రెస్ ఉద్యమంలో పాల్గొనడానికి కంఠీరవం మిత్రులను ప్రోత్సహించాడు. కంఠీరవం దృష్టిలో మంచి ప్రభుత్వం అంటె బషీర్ తల్లి దండ్రులవలె పొట్టకెళ్ళక కన్నబిడ్డలను అమ్ముకోరు, వదులుకోరు. అన్యాయంగా ఇతరుల ఆస్తులను ఆక్రమించరు. ఒకనికి, ఒకనికి ద్వేషం వుండదు. అందరూ

గోడ

అల్లం రాజయ్య

1

"ఆ లంజకొడుకును సీకట్ల తన్నంది ఎల్లెటట్టులేదు" అన్నడు రాగెంటికెల అంజిగాడు- అంజిగానికి రాగెంటికెల కింద తాటికాయంత గుండున్నది- గుండుకు మిలమిల మెరిసే రెండు కండ్లున్నయ్. (ఇప్పుడు గ కండ్లల్ల చెప్పరానంత కోప మున్నది.) కండ్ల కింద చప్పిడి ముక్కు- దానికింద నిక్కబొడిసిన మీసాలు- వాటి కింద కప్పలాంటి నోరు- నెల నుంచి మంగలి కత్తెరుగని గడ్డం- దాన్నిండ మట్టి ఉన్నయ్- అవ్వన్ని అతికిన అల్లనేరడు పండు రంగు అయిదడుగుల అయిదించుల సెత్త సుత ఉన్నది- దానికి సినిగిన గుడ్డపేగు అడుక్కున్న అంగిపేగు ఉన్నయ్- ఆడు నిలుసున్న కాడికి సరిగ్గా యాబయి గజాల దూరంల కూలడానికి తయారుగున్న గుడిసె ఉంది- గుడిసెల సీల్లాడి సరిగ్గా అయిద్దినాలే అయిపోయిన పెండ్లాం ఉన్నది- పెండ్లాం పక్క కుక్కి మంచంల నారపేడసొంటి పిల్లొకతి రొమ్ము చీకుతంది. మంచమ్మీన కుడిసెయి మలుసుకుని పండుకున్న సదరు అంజిగాని పెండ్లాం సత్తెమ్మ ఎందుకనో ఏడుత్తంది ఎక్కెక్కిపడి.

"ససరాదుర ఉచ్చిలోడా: అడేమొ రేపోమాపో బుల్లదోసరో మరేందో తెచ్చి గుడిసెలు సత్తెనాశిడం సేసెటట్టున్నది- మీరేమొ నోటి కచ్చినట్టు కాన్ది పోన్ది ఎల్లగక్క తంద్రు" బొరుగడ్డం దూదేకుల పీరుసాయెబు కసురుకున్నడు.

నీతితో వుంటారు, కట్టుగా వుంటారు- దయతో మెలగుతారు, ముఖ్యంగా అంతా ఆప్తులుగా బతుకుతారు.

కొమురయ్య తప్ప అందరూ హైదాబాద్ బయలుదేరారు- వీరు వెళ్ళిపోయిన కొద్ది దినాలకే హైద్రాబాద్‌లో స్టేట్ కాంగ్రెస్ ప్రథమ సత్యాగ్రహం ప్రారంభమైంది.

ఇంతలో రాంభూపాల్‌రావు శిక్ష ముగిసి దిమ్మగూడెం చేరుకున్నాడు- వచ్చీ రావడంతోనే అధికార వర్గానికి అండగా నిలిచి గ్రామ ప్రజలపై అధికారం చేయడం సాగించాడు- గ్రంథాలయం మూతపడ్డది- వెంకటేశ్వర్రావు ఇంటిలో పోలీసు నాకా పెట్టించాడు రామభూపాల్‌రావు.

. వెంకటేశ్వర్రావు డిక్టేటర్‌గా బషీర్, కంఠీరవం, పరంధామయ్య, విజయదేవ్ అనుచరులుగా ఒక దళంగా సత్యాగ్రహం చేసి నిర్బంధింపబడ్డారు.

[వచ్చే సంచికలో 'ప్రజల మనిషి' నవలలో
ప్రజా చైతన్యానికి యిరుసు - భూమి సమస్య]

సాకలి అంతడు "నిచ్చమే– నిచ్చమే...." నన్నడు.

"మరైతే ఏంజెయాల్నో ఇగురంగ జెప్పు. మంచోనివో సెడ్డోనివో లసలికి సంపతికి పెద్దదిక్కు నువ్వేనాయె" అన్నడు కుమ్మరి ఎంకటిగాడు.

పీరుసాయెబు కాసేపు కండ్లు మూసుకున్నడు– పిటపిట సదివిండు ఆకసానికి మొక్కిండు– "ఇగో ఇయ్యాల్ల గిదే కాళ్లమీన దొరింటికిబొయి మన కడుపు నొప్పేందో సెప్పుకుందాం...."

"మల్ల మల్ల సెప్పేదేంది రా సంగం...." పానుషాపు బుచ్చమ్మ పాను బుక్క నిండ బెట్టుకొని కసురుకున్నది.

"మల్లమల్లగాదు, లచ్చసార్లు జెప్పాలె– ఇంటన్నావే– ఎవారమంటే ఆకులు గట్టు డనుకొంటన్నవ– ఆడు కొండనోంటోడు– మనం ఎలుకలం– అని సుట్టూత సర్కారు బలగమున్నది– మల్ల మాట్లాడ్తె నాత్రి గుడిసెల కింత అగ్గి తలుగబెట్టిచ్చి, కాలిపోయినయ్ ఇంకోకాడ కట్టుకొమ్మంటే ఆనికి ఎదురేమున్నది? వారీ మన సేతులు బందకిందిరికినయ్– ఉపాయంకొద్ది తామూలుగ ఎవని సెయ్యి ఆడు గుంజుకోవాలె– మోరుదోపేశాలేత్తె ఏర్లే తెగిపోతయ్...."

"గిన్ని సేతులిరికినంక బందెత్తి అవతల పారెయ్యచ్చుగ" అన్నడు మోటారు కార్ఖాన క్లీనరు పన్జేసే రాములు.

"ఏపాటి బలిజమున్నదో ముంగట సూయించేరు.... అగు– జెర సైసుండిరి– అంతదాకత్తె మల్ల అడ్డమేమున్నది–" పీరుసాయెబు సేతులూపిండు.

రోడుపక్క కుంటి ముసలోడు సిలుంబట్టిన తీగల తంబుర్రి 'కిన కిన' లాడిచ్చు కుంట పాటందుకున్నడు:

"ఇల్లు ఇల్లాని జగమెల్ల దిరిగేవు
ఇల్లేది పిల్లేది సిలుకా....
గాలి వాన వచ్చి గుడిసెగిరిపోయింది
గోడుగోడున గోల పెట్టి పలమేమే!
పంచ వన్నెల రామసిలుకా...."

కుక్క మొదటి గుడిసెముంగట ఎనుక కాల్లమీన కూసుండి మొగులుకు మొఖం జేసి ఒక్కతీర్గ ఏడుత్తంది.

పోలీసు తానాలో పది గంటలు కొట్టిండ్రు....

“గింత నాత్రి తాగుంటడో, తడిసుంటడో రేపొద్దుగాల....” పీరిగాడు అనుక్కుట కట్టె పొడుసుకుంటచ్చి అన్నడు.

“రేపొద్దు పొడిసేటాల్లకు మన గుడిసెల సుట్టూత పడారిగోడ కడుతడు– ఇవ్వారకే బేస్‌మిట్ లేపి కూసున్నడు– సుతార్లు, కయికిలోల్లు అచ్చినంక మనం లబలబ మొత్తుకున్న ఆని పని ఆడు సేయిత్తడు–” అంజిగాడు....

మరి కాసేపు ఎనకముందూ గుంజీస లాడిండ్రు– ఎవలన్న మన ఎనుక నిలబడేటోల్లున్నరా ? అని సూసుకున్నరు– గరీబోని పచ్చం గరీబోల్లు తప్ప ఎవలుండరని సముదాసపడ్డరు– పారీటివోల్ల సంగతి సెప్పుకచ్చిండు క్లీనరు రాములు– మళ్ళ ఆళ్ళు సెప్పిన మాటలు సుత సెప్పుకచ్చిండు– ఎన్ననుకుంటేంది ? అన్నీటి సారాయమొక్కటే నని తీరుమానించుకొని పదంటే పదనుకున్నరు– గట్ల తలోమాట మాట్లాడుకుంట దొరింటి ముంగటి కచ్చిండ్రు.

ఇంటి ముంగటి కావలోడు (గూర్ఖా) కుక్కతీర్గ ‘గుర్....గుర్....’ మన్నడు– అయిన ఆళ్ళంత ఊకుండలే– లొల్లి ముదిరిపోయింది.

సలీగ గప్పుడే దొర సువ్వతీర్గున్న ఇనుప్పుల్ల (ఫోర్కు) కుడిసేత పట్కోని ఏయించిన కోడి తొడకు కుచ్చుతండు– అయినె పేరు కిట్నారావుదొర– అతని నెత్తిమీన గాలిపంఖ గద్దతీరుగ తిరుగుతంది– అతని ముంగటి బల్లమీన గద్దకాల్లమీన నిలుసున్నట్టుగ సీసున్నది– గదాంట్లెది గిలాసల పోసుకుంట మెడకాయెత్తి గద్ద సీల్లు తాగినట్టుగ గుటుకలేత్తండు– గ దొర కండ్లు గద్దకండ్ల తీర్గ సిన్నగున్న బడే తేజ్‌గున్నయ్– అయినె సేతులేల్లు గద్దగోళ్ళతీర్గ కొక్కెగున్నయి– అయినె ముక్కు నిచ్చెంగా గద్ద ముక్కే– అయినె అచ్చం గద్దతీర్గున్న ఎందుకనో పాయిరాలంటే మోజుపడ్తడు– (గద్దలకు పాయిరాల మీన్నే గద మోజు)– అయినె అప్పుడప్పుడు నవ్వుకుంట సాయితకాల్లతోనంటడు: “నేనే గీ భారద్దేశానికి రాజయ్యేదుంటే ! మూడురంగుల జెండామీని సెక్రం తీయించేసి గద్ద గుర్తేయించుత....” గంతపని గాకున్న గద్దను జాతీయపచ్చి మరే పచ్చిగనో చేసేత్త నంటడు– మల్ల పబ్బిలీకులకత్తె సిలుకలా పలుకుతంటడు– “గరీబోల్లంటె పంచ పానం అంటడు– మొన్నీమజ్జన్నే గరీబోల్లకు బంజెర్లు, పరంబోకులు పంచాల్నని పేపర్ల మొత్తుకున్నడట– ఆవలిమొన్న తనున్న సిన్న పట్నంల (అటు పల్లె కాదు ఇటు పట్నం కాదు) బీదబిక్కోల్లకు ఇండ్ల జాగాలు మంజూరు జేయాల్నని మంతిరిగారికి కాయితం రాసి పంపిండట– అట్లట్ల ‘పజాసేవ’ సేసుకుంట ఊలుబట్టి

ఏ పారిటీ పజాసేవలుంటే ఆ పారిటీల తిరుక్కుంట, సిన్నకొత్త కర్పుగాని సిర్నవ్వ నవ్వుకుంట సదరు కిట్నారావు దొరవారు ఎలిగిపోంగ....

"అయ్యా ఆడు నా గెట్టు జరిపిండు దొరా !"

"గట్లనా నేం బిలిసడుగుత పో...."

"అయ్యా ఆడు నా పెండ్లాన్ని చెయిబట్టిండు బాంచెన్ !"

"నేం బిలిసడుగుత పో...."

"ఫలాని పోసిరెడ్డిదొర అన్నాయెంగ నా గుడిసె పీకేసిండు–"

షావుకారి, అమీను కచ్చీరు, తాసిల్దారు, సెక్కుగు కోపను, ఇంటి పన్ను మున్సిపాలిటోడు, ముండలోడు, జమేదారు.... గిట్ల అందరిమీన పిరాదులు దొరింటడు– అందరికీ గదేమాట "పిలుసడుగుత పో...." గిట్లనే పంచాతులు తెంపుతడు– గట్లనే మేడలు గట్టిండు– బియ్యం మిల్లు బెట్టిండు– సౌకదుకానం బెట్టిండు– సార దుకానం బెట్టిండు– లారీలు గొన్నడు– గియ్యాన్నెందుకు, కిట్నారావు దొరంటే ఊడలు దిగిన మర్రి.

"కొంచెం కడక్‌గ్గుండాలే భాయీ" ఆయన్ను జూసి సాటోల్లు సలా జెప్పుతే....

మల్లగదే సిర్నవ్వు.... కిట్టమూర్తి నవ్వు.... గాంధీ మారాజు గారువాల నవ్వు– "దొరతనం నిలుపుకోవాలంటే దోరాస్తే.... ఒకటి భయపెట్టి– అ కాలం ఎల్లిపోయింది. రాజులు రాజ్జేలు గంగల కల్సిపోయినయ్– అట్లా ఇప్పుడు పన్జేయించుకోలేవు– రెండోది నుచ్చుకొట్టి–" తతిమ్మాది దొర చెప్పడు– గదే ఆయినను పైకితెచ్చింది....

అగో గసొంటి కిట్నారావు దొరకు గద్దబార్ఇంది సీసల బల్లచ్చినట్టుగ పెద్దరువాజ కాడ లొల్లి ఇనచ్చింది– కోడిబొక్క గొంతికెలిరికీనట్టుగ సరాయించిండు....

గట్లనే మేడమీన్నుంచి పెద్దరువాజ కాడికి పారజూసిండు.

గూర్ఖా రెండు సేతులతోని బాణాలుకొట్టే అర్జునునితీర్గ జనంమీన చేతులు తిప్పు తండు– మాటల్లేకుంట మొరుగుతండు.

"లంజకొడుకులు రానే వచ్చిండ్రు" అనుకుంట మేడ దిగచ్చిండు.

"టాపా ఆనేదో బిచారొంకో...." ముద్దుముద్దుగ అన్నడు దొర.

టాపా గుర్రుగా చూసి తోక ములుసుకొని ఎల్లిపోయిన కుక్కతీర్గ కూకుండే బల్లకాడికి నడిచిండు.

జనం బిలబిల లోపలికచ్చి పబ్బతులు బట్టి దండాలు బెట్టిండ్రు.

గడ్డపు పీరుసాయెబు ముంగటికి జరిగి మూడుసార్లు మొక్కిండు-

"అయ్యా బాంచెలం- తమరు ఎయిర్కాల్ల జెద్రులు- మీకే కాలిరిగిన లెక్కగాదు- తమరు మోటార్ల కార్ఖాన పెట్టుకుంటే షేం కాదనం- మా అసొంటి గరీబోల్లకు గింత నౌకరన్న దొరుకుద్ది. కని- ఈడ మా తాతల తండ్రుల కాన్నుంచి ఉంటన్నం- గీ ఊళ్ళె ఏడ సూసిన గజాన పదిహేను రూపాలున్నది భూమి ధర. గిన్నేండ్ల బట్టి కొట్టిపోసుకుంటాంటే కడుపుకే సాల్తలేదు- గ గుడిసెలు రేపోమాపో కూలిపోయే టట్టుగున్నయ్- గయే మంచిగ సేసుకోను తాకత్ లేదు. ఎల్లువాన్ లేనోల్లం- గిప్పుడు పీకి పారేత్తసంటే గీ అగ్గెనగాండ్ల ఏడబోదుము?"

దొర సాయెబును చూసి దొంగ చిర్నవ్వొకటి నవ్వేసిండు.

"సాయెబు, గవర్నమెంటు ఏమంటందో ఇన్నవా? కార్ఖానాలు పెట్టుమంటంది- టీదోల్లకు ఉద్యోగాలు ఇయ్యిమంటంది- మీ గుడిసెల అడుగు భూమి నాది- పట్టానాదే- ఏదో ఇన్నేండ్లు గ భూమితోని నా కవసరం పల్లే, ఎదో గరీబోల్లని ఉండనిచ్చిన.... గిప్పుడు...." దొర మరింక కష్టంగా అన్పిచ్చో ఇష్టం లేకనో మాట్లాడలేదు.

"పట్టానో పరంబోగో మాకేమెరుక దొరా? సానేండ్ల బట్టి ఉంటన్నం- నా కండ్ల ముంగట్నే తమరు ఈడికచ్చిండ్రు- మాటోటట్టుగనే గుడిసేసుకున్నరు."

"గదే సాయెబు- నేననేది గదే- నేం దాన్ని కొన్న...."

"ఎవడమ్మిండో? ఎవలికెరుక దొరా? గ అంజిగాన్ని సూడుండ్రి దొరా! అని పెండ్లాం పచ్చి బాలెంత- గ పోసిగాన్కి గంపెడు తుక్కు.... రెక్కలు సల్లబడ్డ ముసల్ది నేను ముసలి పచ్చులం."

"గయ్యన్ని నాకెందుకు? నేను మిమ్ముల్ని కొట్టిన్నా తిట్టిన్నా? వారీ! నొయ్య కుంట గిదీ సంగతని సెప్పుతన్న- నా భూమి నాకిడిసిపెట్టుండ్రి అంటే మధ్యన గీ ఏడుపెందుకు?

"కొట్టన్నా.... తిట్టన్నా.... మీక్కోపమత్తే ఆ పని జేయిండ్రి కని మాకు నిలువ నీడ లేకుంట జెయ్యకుండ్రి-" పీరుసాయెబు అరుగు తంతెలకు మొక్కిండు.

"చేసిండు కూకున్నడు- మందసడు, మాకనడవోవ్....!" మందిల నుంచి బుచ్చమ్మ.

"గీ రాత్రిం రాయబారాలు- సంగతైతె గది- అటెన్క మీ యిష్టం...." అని దొర లేసిపోయిండు.

అక్కడున్నోల్లు ఒకల మొఖం ఒకలు సూసుకున్నరు- గ ఇష్టమేందో ఆళ్ళం దరి కెరికే....

"ఇగేం జేత్తవో సెయ్యి సాయెబు- కట్లపామోలె కుట్టిండు- సరసర ఎల్లిపో యిండు-" రాములు ముఖమంత నెత్తురు ఎగజిమ్మంగ అన్నడు.

పీరుసాయెబు ముఖంసుత ఎర్రబడ్డది- పెదువులు అనుకుతన్నయ్- "యా అల్లా! గుడిసెలు కూలగొడ్తడు-" అన్నడు ఆకాసానికి చేతులెత్తి మొక్క.

"ఇగ అల్లా అడ్డంరాడు- తిరుపతెంకటేశడు అడ్డంరాడు- వానవ్వ ఏంజేత్తడో సూడాలె-" అంజిగాడు రాగెంటికలు ఎగదువ్వుకున్నడు.

అందరెల్లిపోయిండ్రు....

కిట్నారావు మేడమీన్నుంచి సూత్తనే ఉన్నడు.

అటెనుక ఏవలనో పిలిసిండు- ఆ ఎవలో బయటి కురికున కాసేపటికి మాదిగి గడ్డం పోసిగాన్ని దప్పుతోటి పట్టుకచ్చిండు.

"వారీ, పోసిగ! సర్వే నెంబడు 87 భూమి క్రిష్టారావు దొరగారిది- రేప్పొద్దటి వరకు ఎవల గుడిసె వాళ్ళు తీసేసుకొని జాగా ఖాళీ చేయవలసిందిగా క్రిష్టారావు దొర ఇందుమూలకంగా జెప్పుతండు- లేని పక్షన దొరవారే స్వయాన కల్పించుకొని పీకించివేయగలడని హెచ్చరిక చేయిస్తున్నడు-" అని చాటింపేయిమని చెప్పిండు.

దప్పు పట్టుకున్న పోశడు నాలె సూపులు సూసుకుంట ఉలుకలే, పలుకలే-

"ఏందిరా లమ్డికొడుక- ఏమయ్యిందిరా? ఇగో తీస్కపో-" జేబుల నుంచి అయిదురూపాల లోటు తీసి యియ్యబోయిండు.

"దొరా తమరు దొరలు కాదనను, కని పచ్చులసోంటోల్లం- గిప్పుడెల్లగొడ్తె ఏడబోదుము?"

"అసి లంజకొడుక ఇందాక 'నువ్వు వచ్చినవా?"

"అవును బాంచెన్- నాది గండ్లనే...."

"చల్ లంజకొడుక.... నడువ్...."

2

తెల్లవారింది.

సుతార్లు సుత్తెలు, తాపీలు, మెట్నాలు, దారపుగుండ్లు, సులుపు సెక్కలు మొత్తం సరంజామాతోని రంగంలకు దిగిండ్రు- కూలోల్ల సేతుల్ల సిమెంటు తట్టలు చకచకా మారినయ్. ఇటికెలకు కాల్లచ్చినయ్- సిమిటి సంచుల కుట్లు పటపట తెగినయ్- లారీలు ఇసుక మోసుకత్తన్నయ్- గుడిసెలోల్లు ఇచ్చేంత్ర పదేటాల్లకే గోడలు లేత్తన్నయ్- సుట్టు గిరేసుకుంటన్నయ్.

ఆ వాడలున్నోల్లంత కూలోల్లే- గందుకనే గ వాడ ఊరు కొసకున్నది- ఏడి నుంచి పారొచ్చినోల్లో- కడుపుసేత పట్టుకొని ఏ ఊరు తరుముతే ఉరికచ్చినోల్లో? ఎప్పుడచ్చిండ్రో? గ సిన్న పట్నం తొలుదొల్త గుడిసెల ఊరుండం గచ్చిండ్రు- అచ్చినంక ఊరు పట్నమైపోయింది.

అందుక్కారణం ఆ ఊరి గుట్టకు సిమిటి రాయి ఉన్నదని తెలిసి బొంబాయి నుంచచ్చిన దొరలు సిమిటి కంపెనీ కట్టిండ్రు- ఆ ఊరి పొలిమేర్ల సిక్కటి సుక్కల్దాక పెరుగున్న అడివున్నదని బిర్లా ఇంకో కాయితం కార్ఖాన గట్టిండు- గ అడివి కట్టె కోసం మరెందరో అచ్చిండ్రు- అన్నిటిని మించి రైలు టేషనున్నది గ ఊరికి- ఆ ఊరు సుట్టు పక్కల బొగ్గు బాయి లున్నయి మరి....

కిట్నారావు ఉన్నోల్లె అయిదెకరాలమ్ముకొని నౌఖరికోస మచ్చిండు- నౌఖరికి మార్వాడి సేటు అడ్లగిర్నిల సేట్‌దారుగ కుదిరిండు- అదీ చేసిండు కొన్నేండ్లు- అక్కిన్నుంచి కట్టెల ఏపారంల దిగిండు.... గండ్ల గుడుక మార్వాడి సేచే దించిండు- మార్వాడిసేటు మంచిగున్నోడు మంచిగనే గుటుక్కుమంటే కన్నకొడుకు తీర్గ ఏడ్సిండు- కట్టెల ఏపారంల పెట్టింది ఇరువై వేలని మార్వాడి ఎనుకున్నోల్లకిచ్చిండు- తను కొట్టేసినదెంతో తనకే తెలువలే- అగో గట్ల (అదుర్టం కలిసచ్చి) పెరుక్కుంటచ్చి గ సిన్న పట్నం నిండా వాడవాడ ఊడలు దించిండు- ఊడల మర్రి కింద మరింక ఏ మొలక బతుకద్దుగదా!

గందుకనే ఇంటాగ్గెల ఓ లారీల మరమ్మత్తు దుకాణం (రిపేరింగు వర్కుషాపు) పెట్టాల్ననే బుద్ధిపుట్టింది- అందుక్కారణం పెద్దకొడుకు ఇంజినీరు పాసు కావుటమే.

గిట్ల గోడలు లేసిపోతంటే గుడిసెలోల్ల పాణాలు పైపైన్నే లేసిపోయినయ్- అరుసుకుంట ఏడుసుకుంట సర్కారాఫీసుల సుట్టు దిరిగిండ్రు- పనిలేని లీడర్లంత

దొర కెతిరేకమున్న లీడర్లంత "గిది నిక్కచ్చిగా అన్నాయెం" అన్నరు, అని ఊకున్నరు. ఆ మాట అక్'దార్లల్ల చూసుకొని సంబురబడిపోయింండ్రు- రాములు మాటమీన గుడిసె లోల్లు పెడీపెడీన అరుసుకుంట ఊరేగింపు తీసింండ్రు.

ఎవరేమనుకున్నా ఎన్ననుకున్నా గుడిసెలు సర్వే నం. 87 లో ఉండటం తగదంటే తగదని సర్కారువారు గుడిసె గుడిసెకు ఓ కాయితం ముక్క అందించింండ్రు.

గుడిసెల సుట్టు గోడలైతే లేసిపోతన్నయ్- మరింక బుల్'డోజర్లు రావుటమే ఆలిశ్యం- ఇగ అదచ్చిందంటె గుడిసెలు నేలమట్టం కావుటమే తరువాయి....

అగో గక్కన్నే 'కథ అడ్డం తిరిగింది'- అంజీగాడే అడ్డం తిరిగిండు. ఆడు అడ్డం తిరుగకపోను, పొడుగు పెరక్కపోను- అసలు సంగతేంటంటే....

గోడలు పురాగ లేసినంక ఓ దినం అంజీగాడు గుడిసె ముంగట గడంచలో ఎల్లెలుకల పండి సుక్కల్ను సూత్తండు- ఆని కండ్లయితె సుక్కల్ని సూత్తన్నయి గని ఆని మనుసుల కిట్నారావు పలుసటి ఎంటికల తలకాయ, గద్దముక్కు, గద్ద కండ్లు కన్పడ్తన్నయ్.... అటెన్క కొత్తగోడ కన్పడ్తంది.

ఊరులుకు మగ్గిపోయింది- పెద్దరోడు మీన లారీలు అప్పుడోటి ఇప్పుడోటి జర్రి జర్రి జారిపోతన్నయ్.

"పీనవ్వ అన్నంత పన్జేసిందు- ఏలి ముద్దెర్లేసి కాయితాలు పట్కోని సాయెబు, రాముడు, తను- కచ్చేర్లన్ని తిర్గి తిర్గి ఏస్టచ్చింది- ఎవడు మొఖాలు సూల్లేదు- ఏ లంజ కొడుకు మీ కడుపునొప్పేందని మందలియ్యలేదు. ఓట్లప్పుడు గీ లంజకొడుకే ఇంటిం టికి తిర్గి సెప్పె. ఆదెవడో దొరొడె గెలిసిందు. ఆడు ఈని బావేనట. గెలిసిన గాడ్డి కొడుకు మల్ల ముఖంసూపెడితె ఒట్టు- సభల పావురం కారంగ చెప్పిందు- అది జేత్తనన్నడు ఇది జేత్తనన్నడు- వాని తాడు దొంగ.... మీసాలపోతు అమీనుగానవ్వను.... అదైతే మీని మీని కురికచ్చిందు- "మీ వాడల కమినిట్లోల్లు మీటింగులు పెత్తండ్రట- బొత్తిగ భయం భీతి లేదుర- ఏషాలేసి దొరలు గిరలని పాటలు పాడిండ్రట- లంజ కొడుకులాలా ధామ్మీన బతుకబుద్దయిత లేదుర...." గిసొంటి లంజ కొడుకులకు ఆళ్ళె మొగలు- లఫ్డికొడుకులకు ఆళ్ళపేర్జెప్పుతె నిదరల ఉచ్చ బడ్తది- కని అమీను లంజకొడుకన్న ఇనద్దా। అని శంపాదన అన్ది- ఊరు గాలి పోతే పేలాలు గావాలె ఆనికి- అవ్వ బెట్టదు, అడుక్క తిననియ్యదు- జబర్దస్తీ సెయ్యద్దు- అమీనుగాడు రాడు- అందరు బాంచెనని దొరొనింటికి బొయి అడిగింది

తప్పె.... గదానికే అని తాతముల్లె తిన్నట్టు లోపటేత్తడట- ఎయ్యనియ్యి- నీతల్లి.... అందరిని గొంటబొయి తానాలేత్తె అన్నే ఉంటం-" అంజిగాడు ఇసారాలు ఒకకొలిక్కి రాక తెరిసిన కండ్లు తెరిసిపెట్టి సూత్తండు.

అంజిగాని పెండ్లాం సత్తెమ్మ పిల్లకు తలకంటుకుంట గలుమల కూకున్నది-

"గిట్ల అధాతుగ పొమ్మంటే ఏడబోతం- గీ భూమంత పుట్టంగ భుజానేసు కచ్చిండా? అంతలావు గిన్నె అని ఘోరి కట్టిచ్చుకుంటనంటే మన కేన్నన్న జాగా సూపెట్టు మనుండిరి- సాగత్తె సగం రాజ్జెం నాదేననేటట్టున్నది."

"అళ్ళదే రాజ్జెం మనదేమున్నది కయికిలి గాళ్ళం...."

"గట్లనుకుంట ఎల్లెలుకల సాపుకొని పంటె రేపోమాపో బోడిబొక్క లవతల పారేత్తడు...."

"మరేం జెయ్యమంటవే? కయికి లిడిసిపెట్టుకొని కచ్చీర్లపొంట పుచ్చిన కుక్క లోలె దిగ్గనే తిర్గితిమి."

"ఆఁ మాతిరిగింద్రు జబ్బలు జారేసుకొని...."

అంజిగాడు అధాతుగ గడంచల లేసికూసున్నడు-

"మరి నువ్వే సెప్పే ఏంజెయ్యమంటవో సెప్పు? అని తలకాయ కోసుక రావన్నా? అదన్న సేత్తె మంచిగుంటది...."

"అడుబోతె అని కొడుకత్తడు- వోయబ్బో గంతలావు మొగోల్లయితే గయినే గిట్ల సెల్లిచ్చుకోడు- మీ దగ్గెర దమ్ముల్ లేవనేకదా!...."

దమ్ముల్లేవన్నందుకు అంజిగాన్కి సర్రున కోపమచ్చింది.

"నీయక్క యాడిచ్చి పక్కలతంతే...." తన్నబోయిండు.

"సాల్లే సంబడం.... అడిదాన్ని గొట్టకుంటే ఇది మీసం కాదన్నడట ఎనక ఎవడో? ఆడిదాని మీన ఎగురకుంటె ఇంకెపల మీనెగురుతవ్? మూదండి మొగోని వైతివి...."

అంజి గాడెందుకో తన్నలేదు- మల్ల కోపంపోలేదు- పండ్లు పిండిబిడ పటపట కొరుక్కుంట ఆకిట్ల ఊరాధి ఊరునోలె- ధరినీ కుమారునోలె అంతెత్తు నిలుసున్నడు- చేతులు అట్టిగనే రాసుకున్నడు.... ఎవల్నన్న కొట్టందీ ఎటూ పాలుపోనట్టుగున్నది.

సత్తెమ్మకు ఎదురుంగ అంతెత్తు నిలుసున్న కొత్తగోడ కన్పిచ్చింది.

"సేతులు లావు తీప్పుకంమీనుంటే గ గోడను గుద్దుపో...." అన్నది సత్తెమ్మ.

అంజిగాడు గుడిసెల జొరబడి నిచ్చంగనే గడ్డపార తెచ్చిండు– గడ్డపార సూసె టాల్లకు సత్తెమ్మకు మతిపోయింది.

“ఏందా ఉరుకులాట– గ గోడ కూలగొడ్తె ఆడుంచుతడా? దున్నపోతు ఈనిందంటె దొడ్లె గట్టెయ్యమన్నట్టున్నది ఎవారం. సాలు సాలు సక్కదనం– ఎవలన్న సూత్తె నవ్వివోతరు....”

“నీయక్క– అయ్యిందయ్యింది– ఏదైతె అదే అయితది” అనుకుంట గోడకెల్లి నడిచిండు– గడ్డపారెత్తి ఎందుకనో మల్ల దించిండు.

సరసర రాములు గుడిసెల జొచ్చిండు– రాములు, అంజిగాడు అందరిని కుప్ప జేసిండ్రు....

అప్పటి కప్పుడే అంత కుప్పకూడి ఎనకకు ముంగటికి ఊగిసలాడి ఆఖరుకు పిలగండ్లు, ఆడోల్లు, ముసలి ముతకోల్లు పార, గడ్డపార ఏద్దొరికితె అదందుకొని పెఢీ పెఢీన గోడను గుద్దిండ్రు.

గోడ కూలిపోయింది....

3

అటెనక జరుగాల్సింది జరిగింది. రావాల్సినోల్లచ్చిండ్రు. కిట్నారావు దొర గోడను కూలోల్లు కూలగొట్టిండ్రు గనక పోలీసోల్లచ్చిండ్రు. మొగోల్లను పోలీసు ఠానాకు పట్టుక పోయిండ్రు– ఆడ జరుగవలసిన తంతు జరిగిపోయింది. అమీను ఏస్టచ్చేదనుక అళ్ళను కొట్టిండు– కొట్టిన తిట్టినా భయపెట్టినా బుదురకిచ్చినా “గోడ సంగతే మా కెరుకలే– మా భయంల మేము సత్తన్నం ఎప్పుడెల్లగొడ్తడో అని....” అన్నరు.

కేసు అదాలతుకు నడిసింది– ఉండటాన్కి హాలతు లేనోల్లు అదాలతెంట తిరిగిండ్రు– అర్నెల్లు గడిసిపోయినయ్. అర్నెల్లల్ల గోడ ఇటిక ముక్కలు సుత పొడి పొడైనయ్.... పోరగండ్లు సేసినపనది. గవాయిల కోసం ఎదురు సూసింది అదాలతు– దొంగ గవాయిలు కేడి రాఘవులు, కావాల్సినప్పుడు గవాగవాయి బతికే సిరిహరిరావు అదాలతుల గోడ కూలగొట్టంగ కండ్లార సూసినట్టుగ చెప్పిండ్రు.... పీరుసాయెబు గడ్డం పోశడు ఇంకా అరుగురు అర్నెల్లు; అంజిగాడు మరేదో నక్సలేటు కేసులున్నట్టుగ

ఆకలి తీర్మానం

ఎస్నార్ 'భోలా'

నా పేరేదైతేంది బొందవా్వ బొక్కలవా్వ గని- వొరంగల్లు కాశిబుగ్గల యిద్దరు పొల్లగాల్ల మెంచేసుకొని బీడీల కార్కానల్ల పన్జేత్త- అయితె బొంటెను నాకు దెల్వ కడుగుత! మన రాజ్జెంల వున్నోల్లు లేనోల్లు అని లేకుంట అందరు ఒక్కతీర్గ సమానంగ బత్కెటానికి గౌరుమెంటు గట్టిగ పన్జేత్తాందని పెద్దపెద్ద నాయకులు టేజీలెక్కి చెప్పుతరు- గంత పెద్దమాట లెందుకు గని గీయింత గి కూలోల్లన్న ఒక్కతీర్గ లేకుంట మరి గి సట్టాలేమొ గిట్ల జేసింద్రు?

గదె మా బీడీలు పని జేసెటోల్లకు గౌరుమెంటోల్లు కూలి రేట్లు అదేందో మంచిగంటరవ్వ! మినిమం యేజెసు[1] జేసింద్రట గద- అయితె, దాంట్లె పట్నంల జేత్తె వొగరేటు, పల్లెల్లజేత్తె వొగరేటు, ఇంట్లజేత్తె వొగరేటు, బయిటజేత్తె వోరేటా? గిదేందో నాకేం సంవుజయితలేదు- అబ్బ! గిట్లుంటద యెక్కన్న. అదిగాదు- యెవలన్న పదిరూపాలు దొంగతనం జేసిండ్లనుకుంటాం? అయితె, పది రూపాయిల దొంగతనానికి సిచ్చె వుంటదా, లేకపోతె ఇంట్లజేత్తె వోతీరు సిచ్చె, బయిటజేత్తె వోతీరు సిచ్చె, పట్నంలజేత్తె వోతీరు సిచ్చె, పల్లెలజేత్తె యింకోతీరు సిచ్చెనా? గిన్ని తీర్లుంటద! గిన్నితీర్ల?

అదిగాదు- యెక్కడ జేసినా గవ్వే బీడీలుగద! గిద్దెయ్యబట్టె మమ్ముల పిల్లల సేట్లు సకుల గోసపెడ్తాంద్రి. యేంవయిన యిండ్లల్లకే యిస్తం! గట్లయితె సెలుప

1. మినిమమ్ వేజెస్ (కనీస జీతాలు)

అనుమానం మీన ఎన్నేండ్లో ఎరికలేకుంట జేలుకు పోయేటట్టుగ, కిట్నారావు తడుపాల్సిన కాడ తడిపి జేలుకు తోలి "పీడ ఇరుగుడైందని" సేతులు దులుపుకున్నడు.

రాములు మాత్రిం ఎవలకు జాడా పత్తా దొరుకకుంట పోయిండు.

కిట్నారావుకు పొద్దుగూకిందంటే రక్తప్పోటు పెర్గుతది- గుండె దడదడ లాడ్తది.... లంజకొడుకులు ఏ అపరాత్రిచ్చి గొంతుకోసుకపోతరో? పదారిగోడమీన గాజు పెంకలు పెట్టిచ్చిండు.... కుక్కల్ని కొన్నడు.

కిట్నారావు కార్ల పోతంటే, పోరగండ్లు ఎక్కిరిత్తరు- ఎవడో రాయిసిరి ఉరుకుతడు.

కట్టాల్సిన కార్ఖానా ఎందుకనో ఆగిపోయింది....

లుండయి, బోనసు వుండది, దవాకాన పైసలు రావట- గిట్ల జెయ్యక యెక్కడ జేసినా గదే రేటు, యెక్కడ జేసినా గియన్ని ఇయ్యాలె అని రాయద్దా? యేం సదువులు జదివిండ్లు, సాకలి సదువులు. గిట్లుండె పరకు మేమందరము యేదన్న అడ్గిన, చేసినా యేమైన గి సేట్లు మేం పల్లెల్ల జేయించుకుంటం, లేకపోతె యిండ్లల్ల జేయించుకుంటం అని బెదిరిత్తాండ్రి.

యీ సంగతులన్ని అడిగెటానికి యూన్యనోల్లున్నరు- అడ్డెయ్యాలె గిడ్డెయ్యాలె అని రోషమచ్చె ముచ్చట్లు జెప్పి, మరి కర్సులుంటయి పైసలు గావాల్నంటరు- తావ తావకు మనిషి మనిషికి రొండుమూడ్రూపాలు వసూల్జేత్తరు- దీండ్ల యింకో యూన్యను బుట్టింది- (వాల్ల బతుదెరువున్నట్టున్నది గిండ్లనె) లెక్కలచ్చె[2] లెక్కలచ్చె తె! తె! అంటరు- వీడుగుంజ వాడుగుంజ నడుమ మేంజత్తానం.

మా మొగోల్లేమొ గిర్నీల జీతం రాంగనె కల్లుదుకాండ్లు సారదుకాండ్లు దిరిగిరి. గదేందో సట్టాట ఆడిరి. లాట్రి టికట్లుగొన్రి, బరితెగించిన బరిబాత సినిమాలకు బోయిరి. సర్కారోల్లు గివన్ని అద్దులబెడతరేమొ అనుకుంటె- ఇవన్ని సర్కారోల్లె నడుపుతాండ్రట- ఇగ సర్కారెందుకు మంబ్లెకా కుంట్లకా?

ఇదే గిట్లున్నదంటె- అసలు పదియేన్రోజుల కోపారిచ్చే లెక్కలు, సేట్లుపాడు గాను మూన్నెల్ల నాల్నెల్ల కూలిపైసలు ముడ్డికింద బెట్టుకొని మమ్ముల అదో అదో అని యేడిపిస్తాండ్రి. మా ఉసురు, మా పోరగాండ్లగోస వాల్లకు తలుగుతది. మమ్ముల గిట్ల గోడగోడ యేడిపిత్తె వాల్లు సత్తెనాశ్నమై పోతరు. మేం మెతుకు మెతుక్కు అంగొలిత్తాంటె వాల్ల బంగులాలు గాలిపోసు, వాల్లు వాల్ల బంగులాలకు రంగులేసుకొని, అదేందవ్వ! రికాటు పాటలు బెట్టుకొని ఇంట్ల పెండ్లాలముంగల ఎగురుతాండ్లు డ్యాన్సులు జేత్తండ్లు- వీల్ల సంబురం సట్టుబండలుగాను.

మా కూలిపైసలిస్త లేరని లేబరాపీసుల మా నాయకుడు జెప్పిండు. వాల్లు యీ సేట్లకు కాయిదాలు రాసిపంపిండ్రు, కూలోల్లకు యెంబడె పైసలిచ్చెయ్యాల్నని. అవి సేట్లకు శీమె గుట్టినట్టుగూడ కాలె- మేము మల్లచెప్పించినం- యీతావ మీటింగు బెట్టిచ్చిండు లేబరాపీసరు. వాల్లింట్ల పీనుగెల్ల! మీటింగుల, లేబరాపీసరు ముంగలకూడ "యిప్పుడు మాతోని కాదు" అని మొండి సంప్రదానమె చెప్పిండ్రు. సేట్లు పోయినంక లేబరాపీసరు మాతోటన్నడు 'సేట్లమీద కేసుపెడతం- గట్లయితనె వీల్ల రోగందిరుగుతది' అని- ఇంతైతె మీది మీది మాటలేనట- వాడు సేటుదగ్గర నౌకరితోని రొండం

2. జీతాల రోజు

తలు బట్టిచ్చే నెలబత్తెగాడేనట వీల్ల పెండ్లాలు ముండమొయ్య! గండ్కెనెగాదు అగో మొన్న యెవలో గిర్నిల పన్జేసెటోల్లట– గవేదో పూరన్నరవ్వ యాదికిలేదు– గిట్ల జేత్తెనె లేబరాపీసర్ను పట్టపగటీలి పొడిశేసిండ్రట.

అదట్లబోంగ! యిగ మనండ్ల ఇండ్లదిండ్లనె ఒగలకు మంచిగ యిచ్చి, ఒగలకు కోతగోసి యెన్నోతీర్ల ఇయ్యబట్టె, యెన్నోతీర్ల జెయ్యబట్టె– యింట్లెల్లక ఆడి పోల్ల గాండ్లు బజార్లపడి పన్జేత్తాంటె, ఆ కోమలి పొలగాండ్లను జూడంగనె వీల్ల కండ్లు మండె– వీల్ల కండ్లల్ల కాకులు బొడువ! మొన్న మొన్న పెద్దోల్లయిన ఆడి పోల్ల గాండ్లకు ఏందో ఏందో ఆశబెట్టి? వాల్లతోని వీల్లతోని సోల్తిబెట్టి, సిన్మాలకు తోలిచ్చి, రెయికె గుడ్డలిప్పిచ్చి, ఓసీలిప్పిచ్చి, పాపం! యేందెల్వని బిడ్డలను సేటుబిల్తిండని రప్పిచ్చుకొని వాల్లను కరాబుజెసి పంపిత్తాండె– వీని మదంపాడుగాను, వీని తాడుదెంప! గిదేందిరా బాడుకావు– అని అడుగుదామంటె, లంజెకొడుకు వాదే బజారెక్కుతాండె– ఆయింత పోల్లగాల్ల బతుకుల్ల మన్నుబడ్తదని మాకు మేమె లోపట్లోపల ఒత్తుకొని పూకుంటాంటిమి.

యీసేట్లదగ్గర మాకూలి బకాయి పైసలె రొండులచ్చెల రూపాయిలయితయి– యిగమరి వీల్ల పెత్తనమేందో? మాపైసల్తోనె కంపిని నడ్తాండె. వీల్లను అన్గబట్టి తన్నెటోడులేక, అడ్గేటోడులేక మమ్ముల గిట్ల ఆకలికి సంపుతాండ్రి.

గిదేందిపురి, గిట్లెందు కయితంది– కూలి యెన్నొద్దులకైనా యియ్యచ్చునని కానూన్లె వున్నదా అడిగినం– 'లేదు' అన్నడు లీడరు. మరి కేసుబెత్తె మనకు పైసలు రావా? అని అడిగినం లీడర్ను. మనకువచ్చే కూలిపైసలు కేసులసుట్టు తిరుగుటానికి సరిపోవు– అదిపోంగ– నాలుగైదేండ్లు పట్తది. అయినంక గూడా యీ ముడ్డిబలిసిన సేట్లు బకోర్టంటరు, సుప్రింకోర్టంటరు– ఇగ దాంతోనె మన బతుకులు తెల్లార్తయని చెప్పిండు.

గిట్లయితె బాగుండదని ఓపారి అందరం సుట్టుజేరి గిరేసుకొని సేటును ఉచ్చ గూడ పోనియ్యకుంట మూడు నాలుగ్గంటలు అగబట్టినం– ఇగేమున్నది సేటుకు సెమటలు బెట్టినయి– చీదరకొట్టుకుంట, తాపతాపకు నెత్తిల శెయిబెట్టుకుంటె బూరంత నిక్కబొడిశి పీతిరిగద్దోలె అయిండు– మొకమంత సల్లబడ్డది. అయిపాయె! గింతల్నె పోలీసోల్లచ్చిండ్లు– మమ్ముల దూరం జరుగుమని సేటుగారికి దారి జూపిచ్చిండ్లు. వాల్ల నోట్లె మన్నుబడ! వాల్లంటరుగద సేటుగారి సేచ్చకు బంగం కలుగజేసినమట– అది

నేరమయితది తెలుసా ? యేదో ఈతావకు మీరు ఆడోల్లు గాబట్టి యిడ్శిపెడ్తానం జాగర్తన్నరు. మరి వీల్లకు కడుపులేదా ? యీ పోలీసోల్ల పెండ్లాలుగూడ బీడీలు జేత్తండ్లు గద ? వీల్లు నౌకర్లు దీసుకుంటలేరా ? పెద్ద డిరుసులేసుకొని వచ్చి మమ్ముల బెదిరిచ్చెనోల్లెగాని, అదెపాపం కూలోల్లు కూడులేక సత్తాండ్లు, కూలియ్యకపోతె యెట్ల అన్నరా! వీల్ల ఎగిసిపోత పాడుగాను, వీల్ల ఎచ్చిరిక మునిగిపోను.

మరి సేట్లు పనోల్లకాన్నుంచి పైసలేమన్న రావల్సుంటె నిలబెట్టి వసూల్జేత్తరు– తన్నిత్తరు, పన్లెకెల్లి తీశేత్తరు, ఇంకోకాడ నౌకరి పుట్టకుంట జేత్తరు– పెండ్లాన్ని అవ్వల అక్కల తిడ్తరు– మరి వీల్లను మనం యేంజెయ్యలేమా ? మనయి పైసలు గావా, పెంకాసులా ? మంది పెండ్లాల పియిదినుకుంట మెన్నొద్దు లిట్లజేత్తరు ? మనం కష్టం జేసినోల్లం మన కియ్యద్ద! అదె గ ఎక్కసేజుడూటోల్లు రాంగనె కుర్సోని కూసొమ్మని కాపి దెప్పిచ్చి, మనం జేసినయ్ రోజుకు రొండు లచ్చల కెక్కువ బీడీ లయితె, యిర్వైయైదు వెయిలు బీడీలు లెక్క సూపెట్టి వెయిలకు వెయిలు రూపాయిలు మెక్కు మిగిలిచ్చుకోని, వచ్చినోని కిన్ని రూపాయిల కట్టిచ్చి దండంబెట్టి పంపుతరు– గట్ల మనమేమన్న దొంగలెక్కలు అడిగినమా ? మరి అదె! చేసిన కూలి పైసలియ్యక పోతె వంగబెట్టి వసూల్జేసియ్యలేని గీ గౌరుమెంటోల్లు వుండెందుకు, లేకెందుకు ? గాయింత పని మనం జేసుకుంటెనె మంచిది– ఆడోల్ల మయితేంది, ఆకలి అందరి కొక్కటే– మూన్నెల్లు నాల్నెల్లు యేందిని బతకాలె– గా మీటింగుల చెప్తె నేను ఏందో అనుకున్న– శాతగాని సర్కారును నమ్ముకున్న దానికంటె, మన ఆకలి కడుపుల కోపాలను, కత్తెర్లు బట్టిన యీ శేతులను యేకంజేసి ఒక్కటై నిగ్గదీసి అడుగాలె.

కొత్త నీరొచ్చింది

బొజ్జా తారకం

"అసలు ఆ ఊళ్ళోకి ఎవడో కుర్రాడొచ్చాడని తెలిసినప్పుడే జాగ్రత్తపడా ల్సింది. ఇపుడనుకొని ఏం ప్రయోజనం. వాడు చెయ్యాల్సిందంతా చేసే పోయాడు వెధవ, వాడిక్కడడుగుపెట్టకుండా పోతే గొడవలేక పోయేది. వాడొచ్చి పెడగొట్టాడు వీళ్ళను. ఏం మాయ చేశాడో ఏమో.... చిల్లర వెధవలంతా వాడిచుట్టు చేరి సంఘం కట్టారు. ఏ వెధవని పిలిచినా అదే మాట. మా సంగాన్నడగాలండి అని. వెధవలకి ఎక్కడొచ్చిందో ఈ ఐకమత్యం? మరి యిహ యిపుడు కూడా మనం ఏమీ చెయ్యక పోతే మనం యీ ఊళ్ళో యిహ వుండనక్కరలేదు" అన్నాడు కరణం సర్పంచ్ దగ్గరకొచ్చి.

ఆ ఊరికి సర్పంచే పెద్ద భూస్వామి. అతని మాటకు ఎదురనేది ఆ ఊళ్ళో లేదు. అపుడపుడూ అక్కడక్కడా వున్నా డబ్బు ముందు, అధికారం ముందు నిలబడ లేకపోయాయి. ఆ విషయంలో అతనికి కరణం మద్దతు పూర్తిగావుంది. ఆమాటకొస్తే అతనంత పెద్ద భూస్వామి అవడానికి కరణం చేతి సహాయం చాలావరకు వుంది. సరి హద్దులు చెరిగిపోడాలూ, సర్వేనెంబర్లు కిందుమీదులూ, స్వాధీనపు రాతలూ కోతలూ అన్నీ అతన్ని భూస్వామిని చేశాయి. దానికి ప్రతిఫలం కరణానికి ఎప్పుడూ ముడుతూనే వున్నది.

"ఏమయింది పంతులూ, ఏంటి ముంచుకొచ్చింది?" అనడిగాడు సర్పంచ్ నోట్లోంచి చుట్టతీసి ఉమ్మేస్తూ.

"ఏంటవడమేంటి? మీరలా చుట్ట కాలుస్తూ కూర్చోండి, అవతల వాళ్ళు ఊరు కాల్చుకుంటూ వస్తారు" అన్నాడు కరణం.

"ఎవడయ్యా ఊరు కాల్చే మొనగాడు?"

"ఒకడయితే యిబ్బంది లేకపోయేది, మొత్తం ఊరు ఊరంతా ఏకమయింది ఒక రెడ్లు తప్ప."

"ఏం చేస్తున్నారేంటి ఏకమయ్యి?"

"చూస్తూ వుండండి తెలుస్తుంది. ఈపేళ చెరువు మాదంటారు, రేపు చేను మాదంటారు."

"చెరువు మాదనడం ఏంటి?"

"చెరువు గవర్నమెంటుది, దాని సర్వే నెంబరు ఏసివ్వండి, దాంట్లో సర్పంచ్‌కి అధికారం లేదు- ఆ నీరు ఊరందరికీ చెందాలి, ఆ చెరువులో చేపలు ఊరిమీద పట్టుకోవాలి- అని ఇందాక నలుగురు మొనగాళ్ళొచ్చారండి నా దగ్గరికి" అన్నాడు కరణం.

అప్పటికిగాని సర్పంచ్‌కి అర్థంకాలేదు- తన అధికారాన్ని ప్రశ్నించే సమయం వచ్చిందని.

వాళ్ళకు యింతవరకూ లేని బుద్ధి యిపుడెలా వచ్చింది? ఆ చెరువుని తన తండ్రి దగ్గరనుంచీ తామే వాడుకుంటున్నారు- ప్రతి ఏడూ చేపలు పట్టించి అమ్మించి ఆ డబ్బును తామే ఉంచుకొనేవారు. ఎవరూ ఎప్పుడూ ఏమీ అనలేదు, ఈవేళ చెరువు గవర్నమెంటు దనే మాట ఎలా వచ్చింది అనే ఆలోచనలో పడ్డాడు సర్పంచ్ చుట్ట ఆరిపోయిన సంగతి చూసుకోనేలేదు.

"సందేహం లేదు.... వాడే.... ఆ కుర్రవెధవ నేర్పివుంటాడివన్నీ"- అసలు వాడొచ్చినట్టు చాల రోజుల వరకూ తనకు తెలియనే లేదు- మాలవాళ్ళిళ్ళల్లో వుంటే ఎవడికేంతెలుస్తుంది- నెమ్మదిగా ఊరంతా రాత్రులు మాలపేటలోకి వెళ్తాండడంతో కొంత తెలిసింది- అప్పటికే చిల్లర కులాలు సంఘం కట్టడం, ఏవేవో మాటలు నేర్చుకోవడం, పాటలు పాడడం జరిగిపోయింది- అప్పుడు జాగ్రత్తపడినా యింతవరకూ వచ్చేదికాదు,

"మరిప్పుడేం చేయమంటావ్?" అడిగాడు సర్పంచ్.

"చెరువులో వాళ్ళు చేపలు పడతారట- చూస్తూ వుండండి."

"పోలీసుల్ని పిలిపించి నాలుగు తన్నిస్తే పోద్ది గదయ్యా- ఏవిటి దీనికంత ఆలోచిస్తావ్.... వెధవలు నక్సలైట్లు అని రిపోర్ట్ రాసేస్తే జైల్లో తోలేస్తారు- తిక్క కుదురుతుంది కొడుకులికి" అన్నాడు సర్పంచ్

ఇద్దరూ ఆలోచించి రిపోర్ట్ రాశారు.

ఎవడో నక్సలైట్ వచ్చి ఊరిని పాడుచేస్తున్నాడని, సంఘం కట్టి సర్పంచ్ ఆస్తిని దోడాకోమనికి ప్రయత్నాలు జేస్తున్నారని, రాత్రి మాలపేటలో రోళ్ళలో మందులు నూరుతున్నారని వ్రాసి రిపోర్ట్ పంపించారు.

పోలీసులు వచ్చి మిగతా పని చేసుకుపోతారులే అని ధైర్యంలో ఆ రాత్రి యిద్దరూ హాయిగా నిద్రపోయారు.

మర్నాడు ఉదయం చెరువు దగ్గర కోలాహలంగా వుంది. అడామగా పిల్లా జెల్లా అందరూ చెరువుచుట్టూ గట్టుమీద చేరారు. చేపలు పట్టుకొనే వాళ్ళు చెరువులో దిగారు. వాళ్ళకు సాయం కొందరు కుర్రాళ్ళు దిగారు. పైన గట్టుమీద మరి కొందరు కుర్రాళ్ళు చప్పట్లు వేసుకుంటూ హుషారుగా పాటలు పాడుతున్నారు. పిల్లలు చేపల్ని చూసి, చప్పట్లు విని గెంతుతున్నారు. ఆడవాళ్ళు ఏమవుతుందా అని భయం భయంగా చూస్తున్నారు. జీప్‌లో పోలీసులు రానే వచ్చారు. వచ్చీ రావడంతోనే అక్కడ వున్న జనాన్ని లాఠీలతో కొట్టడం మొదలుపెట్టారు. అడామగా తేడాలేకుండా ఏడుపులు.... పరుగులు.... తొక్కులాటలు....

చెరువులో ఉన్నవాళ్ళను పైకి రమ్మంటున్నారు.

ఆడవాళ్ళు పిల్లలు యిళ్ళకు పారిపోయారు.

మగాళ్ళ నందరినీ చిత్తుగా బాది స్టేషన్‌కి నడవమన్నారు.

పట్టుకున్న చేపల్ని జీప్‌లోకి ఎక్కించారు.

"ఎవడ్రా నక్సలైట్ మీలో — రమ్మనండి బైటికి" అని అరిచాడు ఎస్. ఐ. బండబూతులు తిడుతూ, "బతకాలని లేదేంట్రా, నక్సలైట్‌ని ఊళ్ళో పెట్టుకున్నారు. సర్పంచ్‌కి ఎవరైనా ఎదురుతిరిగారంటే, ఆయన ఆస్తికి నష్టం కలిగించారంటే కాల్చేస్తాను నా కొడకల్లారా" అని కర్రతో దగ్గరున్న వాళ్ళని టపాటపామని కొట్టాడు.

"ఇది గవర్నమెంటు చెరువండి" అని ఎవరో కుర్రాడంటే—

"ఏంట్రా కూస్తున్నావ్? మళ్ళీ కుయ్...." అన్నాడు ఎస్. ఐ.

"అది గవర్నమెంటుదండి. మేం తహశీలాఫీసులో తెలుసుకున్నాం. అడగండి కర్నంగోర్ని" అన్నాడో పెద్దమనిషి.

"ఎవడన్నాడు గవర్నమెంటుదని? సర్పంచ్‌గారి తండ్రి దగ్గర్నుంచి వారి భుక్తంలోనే వున్నది" అన్నాడు కరణం హెడ్ వెనకాల నుంచి.

"మరి అరి తండ్రిగారి నుంచి ఆరే అడుకుంటుంటే మరి యియ్యాల్నుంచి మేం మొదలెడితే రేపు మా కొడుకులు ఆడుకుంటారండి" అన్నాడింకో పెద్దమనిషి.

"ఏంట్రా మీరు కర్నంగార్నే ఎదిరించి మాట్లాడతారూ?" అని లాఠీతో రెండు వేశాడిద్దరినీ.

"నడండి, నడండి" అంటూ ఎస్. ఐ. గారి ఆజ్ఞమీద అందరినీ స్టేషన్‌కి నడిపించారు. పశువుల్ని తోలుకెళ్ళినట్టు కొట్టుకుంటూ స్టేషన్‌కి తీసుకెళ్ళి మళ్ళీ వరసగా

ఒక్కొక్కణ్ణే పిలిచి "నక్సలైటుల్లో చేరా(్రా" అని లాఠీలతో కొడుతూ "ఏ(డ్రా అడు? ఎక్కడున్నాడు? ఎలాగుంటాడు? చెప్పండి" అంటూ యిష్టమొచ్చినట్టు బాదారు.

కరణం చెప్పిన కొందరు కుర్రాళ్ళని లోపలికి పిలిచి జుట్టుపట్టుకొని గట్టిగా పీకి, పడుకోబెట్టి నలుగురైదుగురు కానిస్టేబుల్స్ ఎక్కితొక్కి కాళ్ళమీద లాఠీలతో విపరీతంగా కొట్టారు.

వాళ్ళను మాత్రం మూడు నాలుగు రోజులు అలానే కొట్టుతూ స్టేషన్‌లోనే వుంచి విడిచిపెట్టారు— అదయినా మళ్ళీ అదే సర్పంచ్, కరణం వచ్చి "మా వాళ్ళని విడిచి పెట్టండి, వాడెవడో వెధవ మాటలు విని వీళ్ళిలా చేశారుగాని ఎప్పుడూ యిలా చేసేవారు కాదండీ, మంచోళ్ళే.... యిక చెయ్యరు" అని జామీను యిచ్చిన మీదటే వదిలారు.

ఇదంతా నాటకమని ఒకరిద్దరు కుర్రాళ్ళు గ్రహించారు.

ఈ సంగతి గ్రామంలో పెద్ద మార్పు తెచ్చింది—

భయాన్ని కలిగించింది పెద్దవాళ్ళలో—

పట్టుదల పెరిగింది కుర్రాళ్ళలో.

అయితే కొన్ని రోజులు ఎవరూ మాట్లాడుకోలేక పోయారు— పాటలు మూత పడిపోయాయి.

ఇది గమనించిన సర్పంచ్, కరణం బ్రహ్మానందపడ్డారు— 'ఇక మళ్ళీ లేవలేరు వెధవలు, ఇక మన జోలికెవడూ రాడు' అని చంక లెగరేసుకున్నారు.

ఊరికెవడూ రావడం లేదని తెలుసుకున్నాక ఇంకా సంబరపడ్డారు— ఇక యీ నక్సలైట్ బెడద పోయిందని, ఎందుకయినా మంచిదని ఐస్.ఐ. గారితో మాట్లాడి నెలకోసారి యీ చిల్లర వెధవల్నందరినీ స్టేషన్‌కి పిలిపించి జాగ్రత్తగా వుండండని బెదిరింపిస్తున్నారు. దాంతో మరీ ధైర్యమొచ్చింది. ఇక మనల్ని ఎదిరించే వాడు పుట్టడని తీర్మానించుకున్నారు సర్పంచ్ కరణాలు.

ఒక సంవత్సరం గడిచిపోయింది....

చెరువులో చేపల్ని సర్పంచ్ పట్టించాడు.

కొన్ని పోలీసుల కందాయి, మరీ పెద్దవి ఎస్. ఐ. గారికి....

ఊళ్ళో ఎవరూ ముందుకు రాలేదు— కిమ్మనకుండా ఊరుకున్నారు.

"ఇంకెక్కడ లేస్తారు? చావు దెబ్బలు తిన్నాక" అన్నాడు సర్పంచ్ ఆ సాయంత్రం కరణం గారితో.

ఆ చెరువుని ఆక్రమించుకున్నట్టే దాన్ని ఆనుకొనివున్న యిరవై ఎకరాల గవర్నమెంటు భూమినీ ఆక్రమించుకున్నాడు సర్పంచ్. ఎన్నో ఏళ్ళనుంచి పండించుకుంటున్నాడు.

యథాప్రకారం చేలల్లో నీళ్ళు పెట్టించి దుక్కికి సిద్ధం చేయిస్తున్నాడు సర్పంచ్.

మృగశిర వచ్చింది.

గత ఏడాది అంతా ఎక్కడా ఆ కుర్ర వెధవ వచ్చినట్టులేదు. ఆ కొత్తపాటలూ వినపడలేదు. 'ఇంక వీళ్ళకు నేర్పేవాడెవడూ రాడు, ఇక వీళ్ళేమీ చేయలేరు' అనే ధైర్యంతో వున్నాడు సర్పంచ్.

ముహూర్తంచూసి కొబ్బరికాయ కొట్టి దున్నడం మొదలు పెట్టించాడు సర్పంచ్.

సరిగ్గా అదే ముహూర్తానికి ఊరుఊరంతా లేచివచ్చినట్టు మగాళ్ళంతా నాగళ్ళతో చేను దగ్గరికి వస్తున్నారు. కొత్త ఊడ్పు పాటలు పాడుకుంటూ ఆ వెనక ఆడవాళ్ళు.

పెద్ద నీటికెరటం తనమీద పడుతున్నట్టు భయపడి పక్కకు జరిగాడు సర్పంచ్.

మగాళ్ళంతా నాగళ్ళతో చేలోకి దిగారు.

"ఆపండ్రాళ్ళని....ఆపండి...." అని తన కూలోళ్ళని కేకలేస్తున్నాడు సర్పంచ్- "ఎక్కడికిరా ?" అని ఊరివాళ్ళను అడుగుతున్నాడు.

"ఇది గవర్నమెంటు భూమి.... అడ్డంవస్తే ఊరుకొనేది లేదు" అని దున్నటం మొదలుపెట్టారు.

సర్పంచ్ కూలివాళ్లు ఏమీ చెయ్యలేక నిలబడి పోయారు. కుర్రాళ్లు వాళ్లతో ఏవో చెబుతున్నారు. కొంతసేపటికి వాళ్లూ జనంలో కలిసిపోయారు.

సర్పంచ్‌చుట్టూ కుర్రాళ్లు చప్పట్లుకొడుతూ హుషారుగా పాటలుపాడుతున్నారు.

వాళ్లనీ తానుతెచ్చిన కూలాళ్లనీ నానా బూతులుతిడుతూ యింక ఏమీచెయ్యలేక 'మళ్లీ నక్సలైట్లు వచ్చారని' పోలీసులకు చెప్పడానికి యింటిముఖాన పరుగుతీశాడు సర్పంచ్- ఆడవాళ్లు నవ్వుతున్నారు.

గొంతులన్నీకలిసి కొత్తపాటలు పాడుతున్నాయి.

నాగళ్లు కొత్తదుక్కి దున్నుతున్నాయి.

చేలోకి కొత్తనీరు రఁయ్యిమంటూ వస్తున్నది....

రెవీ అలే

రెవీ అలే 80 సంవత్సరాల వృద్ధుడు– న్యూజిలాండులో పుట్టాడు– గత 51 సంవత్సరాలుగా చైనాలో నివసిస్తున్నాడు– చైనా ప్రజలకు మంచి మిత్రుడు– సుప్రసిద్ధ రచయిత. 1927 లో న్యూజిలాండు నుంచి చైనాకు వచ్చినప్పటి నుంచి చైనా ప్రజల విప్లవ ప్రయోజనాలకోసం వాళ్ళ పక్షాన నిలిచి పోరాడుతున్నాడు.

విముక్తికి పూర్వం రెవీ అలే షాంఘైలో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరుగా పనిచేసాడు. దోపిడీ వ్యవస్థలో కార్మికుని స్థితిగతులు ఎలావుంటాయో ఆయన ప్రత్యక్షంగా తెలుసుకున్నాడు. అయితే అంతకన్నా బాగా ఆయన తెలుసుకున్నది కార్మిక ప్రజల్లోవున్న సృజనాత్మక శక్తి. సెలవుల్లో గ్రామీణ ప్రాంతాల్లో క్షామనివారణ కార్యక్రమాల్లో పనిచేసినపుడు గ్రామీణ ప్రజలతో సంబంధాలు పెరిగాయి. వాళ్ళ నుంచి ఎంతో నేర్చుకున్నాడు. జపాన్‌తో యుద్ధ కాలంలో చైనాకున్న కార్మికశక్తిని రక్షణకు వినియోగించుకోవచ్చునని గ్రహించి అలే చైనా పారిశ్రామిక సహకార ఉద్యమాన్ని నిర్మించాడు. దేశవ్యాప్తంగా ఆయన చేపట్టిన ఈ కార్యక్రమం ఆయనకు గ్రామాలతో సంబంధాలను విస్తృత పరచింది. చైనా గురించి, చైనా వనర్లు, శక్తి గురించి ఆయనకున్న జ్ఞానాన్ని మరింత పెంచింది. యూరప్, అమెరికా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, మాతృభూమి న్యూజిలాండు దేశాలు తిరిగి విస్తృతమైన ప్రపంచ పర్యటనానుభవాలతో ఆయన డజన్లకొద్ది పుస్తకాలు రాసాడు– పెకింగ్‌లో ఆయన ఇంటికి నిత్యమూ చైనా నలుమూలల నుంచి జనం వస్తూనే వుంటారు– వాళ్ళతో గంటలకు గంటలు గడుపుతూ వుంటాడు. ఈ అనుభవం చైనా విప్లవ పోరాటం గురించి చైనాలో వస్తున్న మార్పుల గురించి ఆయనకు సరియైన, వివరమైన అవగాహననిస్తున్నది. చైనా గురించి ఆయన జ్ఞానము, ఈనాటి ప్రపంచంలో మన ముందున్న చారిత్రిక శక్తుల గురించి ఆయన అవగాహన, అధ్యయనం, పరిశీలన, నిరంతర ప్రయాణాల మీద ఆధారపడి ఏర్పడుతున్నది. చైనాలో అన్ని ప్రాంతాలకు ఆయన వెళ్ళాడు. బాధ్యతాయుతమైన పనుల్లో చాల సన్నిహితంగా పాల్గొన్నాడు. అన్నిటికన్న ఆయన అనుభవాలను సంపద్వంతం చేసింది చైనా ప్రజలతో ఆయనకున్న నిజమైన సంబంధాలు. ఐదు దశాబ్దాలుగా ఆయన అక్కడ నిజంగా ప్రజలతో జీవిస్తున్నాడు.

ఆయన అనుభవాలు యువతరానికి ఉపయోగకరంగా వుండగలవనే ఉద్దేశంతో The way ahead for youth అనే ఆయన కవితలోని భావాలను ఈ క్రింద యిస్తున్నాము. ఆయన అందులో న్యూజిలాండ్ యువతరానికి చైనా యువతరం గురించి రాసాడు.

యువ పథం

రెవి ఆలే

పర్వతాలమీంచి, అడవుల నుంచి వీచే గాడ్పులతో పాటు
నా పాత యింటి నుంచి నాకో ఉత్తరం వస్తుంది.
అక్కడి యువకులు తామెట్లా పెరగాలని నేను ఆశిస్తున్నానో అడుగుతారు
అప్పుడు నా చుట్టూవున్న తీరికలేని గ్రామాన్ని చూస్తాను
అక్కడ కమ్యూన్‌లో కొందరు జాలర్లు చేపల కోసం వలలు అల్లుతుంటారు
కొందరు యంత్ర దుకాణాల్లో ట్రాక్టర్ల బాగు చేస్తుంటారు
ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి చేస్తూనే ఉంటారు
వీళ్ళలాగే ప్రపంచంలో యువకులందరూ
కష్టజీవులతో యిలాంటి సంబంధాలు పెట్టుకోవాలని
నేను కోరుకుంటాను
ప్రపంచాన్ని మార్చాలనే సంకల్పాన్ని నేర్చుకోవాలి
ఈ ప్రపంచం మారాల్సిన అవసరాన్ని ఎవరూ కాదనలేరు
యువత తమ శరీరాలను మంచి యంత్ర నిర్మాణం –
– అంత జాగ్రత్తగా కాపాడుకోవాలి
తమ పరిసరాలతో కలసిపోవాలి
ఎట్లా సృజన చేయాలో, ఎట్లా విశ్లేషించాలో
కలిసి పని చేయడం నుంచి నేర్చుకోవాలి
తమ నేలనూ సముద్రాలను
అమితంగా ప్రేమించాలి
అవి కల్మషం కాకుండా చూడాలి
ఎక్కడ చెట్లు పెరగాలో అక్కడ చెట్లు నాటాలి
వయ్యక్తిక కష్టాలను లెక్కచేయొద్దు
చేయికీ, మెదడుకు సమన్వయం ఎలా చేయాలో నేర్చుకోవాలి
జాతి ద్వేషాల కళంకాన్ని తుడిచేసి
కష్టజీవులందరితో సోదరుల్లాగా బతకాలి
నేను యువతరాన్ని లాభాపేక్షలు ఉన్నత పదవులు
నిరాకరించే వాళ్ళలా చూడదల్చుకున్నాను
ఇతరుల కన్నా బాగా బతకాలనే
స్వార్థం లేనివారుగా చూడదల్చుకున్నాను

శిథిలమైన గతం నుంచి
మూఢ నమ్మకాలను, చచ్చిన పిడివాదాలను
వారసత్వంగా తెచ్చుకునే పాత బరువులు –
– దించేసుకున్న శుభ్రమైన మనస్సుల్ని చూడదల్చుకున్నాను
నేను వాళ్ళను సహజంగా స్వేచ్ఛగా
కలిసి నవ్వే వారిలా చూడదల్చుకున్నాను
ఒకరి శక్తి నుంచి ఒకరు ఉత్తేజం పొందుతూ
ఎక్కడ నివసించినా సరే
సామాన్యుని ప్రయోజనానికి ఎల్లవేళలా విధేయులుగా వుంటూ
నూతన ప్రపంచం నిజమైన పౌరులుగా
బతకాలని కోరుకుంటున్నాను
ఇది అత్యాశా ? కాదు–
ముడి సరుకు మంచిది
తరుచూ వాళ్ళకిస్తున్న చదువు చెడ్డది
అవి నీతి వ్యవస్థ వాళ్ళపై మోపిన బరువు పెద్దది
వేగంగా జరిగిపోతున్న పనులతో
వంచించబడుతున్నారు
వీటికి తోడు కొన్ని ఘాటైన మత్తు పదార్థాలు
కార్లు, ఉరుకులు పరుగులు
చేసిన పనివల్ల వచ్చే విజయాల నుంచి
తలబిరుసుతనం
అన్ని ప్రయత్నాల్లోనూ బతకడమనేది
ఒక సమస్య కావడం
వయోజనత్వం అంటే జులపాలు పెంచడం
పొడుగాటి బట్టలు వేసుకోవడం కాదు
ఎవరు మిత్రుడో ఎవరు శత్రువో
గుర్తుపట్టే శక్తిని పొందడం
అంతటా ప్రజల్ని పరిపూర్ణమైన జీవితానికి
తీసుకవెళ్ళే మార్గానికి
నాయకత్వం వహించే క్రమంలో దారిపొడుగునా
ఎవరు మిత్రులో ఎవరు శత్రువులో కనిపెట్టే సామర్థ్యం పొందడం.

అసమ సమాజానికి అద్దంపట్టిన విద్యా విధానం

[భారత దేశంలో ఈనాడు అమలవుతున్న విద్యావిధానం గురించి సుప్రసిద్ధ స్వీడిష్ ఆర్థికవేత్త, బహుగ్రంథకర్త గున్నార్ మిర్డాల్ ఇటీవల ఒక వ్యాసంలో తన అభిప్రాయాలు వెలిబుచ్చాడు- వాటి సారాంశం ఈ కింద యిస్తున్నాం.]

భారతదేశంలో వాస్తవానికి విద్య తరుచుగా అవిద్య. దాని ప్రభావం అభివృద్ధి వ్యతిరేకమైనది.

వలస పాలన నుంచి విముక్తమయిన చాల దేశాల్లో ఇంకా చాల మందికి నామ మాత్రమైన చదువు కూడ లేదు. దానికి కారణం వలస పాలకులకు ఏ కొద్ది మందో గుమస్తాలుగా, చిన్న చిన్న అధికారులుగా తయారయితే సరిపోయింది.

ఈదేశాల్లోని ఉన్నత వర్గాల ప్రయోజనాలు కూడ ఇవే కనుక వాళ్ళు ఇదే పద్ధతి అనుసరించారు. తమ యజమానులకు సేవచేసి లాభాలుపొందే అవకాశాలు వదులుకో దల్చుకోలేదు. అందుకే విద్యాశాలలు 'సాహిత్య' పరంగానో, 'విద్యా విషయం'గానో వుండాలనుకున్నారు గాని, విద్యార్థులు కుర్చీలమీద బొమ్మల కొలువు తీర్చినట్లు కూర్చో వాలనుకున్నారు గానీ తమ చేతులు మట్టి చేసుకో కూడదనుకున్నారు. పరీక్షలు పాసు కావాడానికీ, సమాజంలో ఒక 'గౌరవస్థానం' పొందడానికీ ప్రాధాన్యమివ్వబడింది గానీ జీవితము - పనికి సంబంధించిన అవసరమైన ఆచరణాత్మక శిక్షణను పట్టించుకోలేదు.

తరుచుగా విద్యావిధానం 'విప్లవాత్మకం'గా మారాలన్న డిమాండు వినవస్తుందే గానీ, నిజానికి జరగందదే.

భారతదేశంలో విద్యను అభివృద్ధి చేయడానికి చాలా తక్కువకృషి జరిగింది. ఈసమస్యమీద ఎంతోతీవ్రంగా చిత్తశుద్ధితోకూడ చర్చ జరిగినమాట నిజమే. 1966 విద్యాకమీషన్ భారతీయ విద్యావిధానం పూర్తిగా పునర్నిర్మాణం కావలసి వున్నదని విప్లవీకరించబడాల్సి వున్నదని చెప్పింది. అయినప్పటికి ఆచరణలో ఏమార్పు రాలేదు.

భారతదేశంలాంటి పేదదేశాల్లో ఒకేచదువు మళ్ళీచదువాల్సి రావడము మళ్ళీ ఫేల్‌చేయడం, హాజరులాంటి సమస్యలు పెద్దభారమవుతాయి. ఒకరకంగా మానవశక్తి వృధాకావడమే అవుతుంది. కాని యీ సమస్యగురించి శ్రద్ధ కనబడడమేలేదు.

ఈనాడున్న సాంఘిక ఆర్థిక వ్యవస్థ, అందులోవున్న అధికార సంబంధాలు పాలకులకు ఉపాధ్యాయులకు విద్యార్థులకు ముఖ్యంగా ఉన్నత వర్గాలకు చెందిన కుటుం

బాలకు యీ విద్యావిధానంలో స్వార్థ ప్రయోజనాన్ని పకడ్బందీగా కూర్చిపెట్టింది. (వలస) వారసత్వంగా వస్తున్నపాఠశాల విధానాన్ని మార్చివేసి తమస్థానాల్ని పోగొట్టు కోడానికి వీళ్ళు సిద్ధంగాలేరు.

ఓజనాభాలో అత్యధికశాతం పిల్లలున్నారు గనుక పిల్లలను అధికసంఖ్యలో బడుల్లో చేర్చుకునే విషయంలో ఆసక్తి కనబరుస్తున్నారు. కాని పాఠశాల భవనాలు ఉపాధ్యాయులు పుస్తకాలు కాగితాలు యితర అవసరాలు సమకూర్చడం మాత్రం ఏఆలోచనా లేదు, ప్రయత్నమూలేదు.

వృత్తి సాంకేతిక పాఠశాలల్లో అభివృద్ధి చాలా తక్కువగా కనబడుతుంది. సాధారణ మాధ్యమిక పాఠశాలల్లో పాఠ్య ప్రణాళికలు ఏమాత్రమూ ఆధునీకరింపబడలేదు ఇక్కడ కూడా మనం అసమాన ఆర్థిక సామాజిక వ్యవస్థతో, అసమాన అధికార పంపిణీతో పాఠశాల విధానం ముడివడి వున్నదనే విషయాన్ని గ్రహిస్తాం.

"ప్రతిచోటా సమానత్వం గురించి ప్రజల జీవన స్థాయిని మెరుగు పర్చడం గురించి ఉద్ఘాటిస్తుంటారు. అదే తమ లక్ష్యంగా ప్రకటిస్తుంటారు. కాని ప్రతిచోటా ఆచరణలో కనిపించే ధోరణి మరింత అసమానతలకు దారితీసేది."

మొక్కుబడులు

మన దేశంలో చాల పనులు నిజంగా నిజాయితీతో తీవ్రమైన అవసరం దృష్ట్యా కాకుండా మొక్కుబడిగా, లాంఛనప్రాయంగా జరుగుతాయని, ముఖ్యంగా ప్రభుత్వ పరంగా జరిగే చాల పనులు ఇలాంటివని ప్రజలకు బాగా తెలుసు. ప్రభుత్వం చిత్తశుద్ధిమీద వాళ్ళకేమీ భ్రమలేదు. అర్థవంతమైన ఆచరణ స్థానంలో లాంఛనత్వం, అసలు విషయప్రాధాన్యం తగ్గి రూపానికి ఆడంబరత్వానికి పెద్దపీట మన కలవాటయి పోయాయి.

నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవడం కూడ మనకొక తద్దినం లాంటిది. వానాకాలంతో పాటు 'వానాకాలపు చదువులు' మొదలవుతాయి. విద్యా సంవత్సరం మొదలు కావడంతోనే చదువులు మొదలు కావన్నది ఆ చదువుకునే వాళ్ళకు తప్ప తెలియదు.

ముఖ్యంగా ఉన్నత విద్య గురించి ఆలోచించినపుడు దేశంలో ఎన్నో విశ్వ విద్యాలయాలు గత సంవత్సరం విద్యాసంవత్సరం ముగియడానికి ఎంతో ముందుగానే మూతపడ్డాయి. ఈ నూతన విద్యా సంవత్సరంలోనైనా అవి నిజంగా ఎప్పుడు చదువు కొరకు తలుపులు తెరుచుకుంటాయో, అట్లా తెరచుకొని ఎంతకాలంపాటు సాహసించి వుండగలవో వూహించడం అసాధ్యమేమీ కాదు.

ఉన్నత విద్యాలయాలు విద్యా విషయిక ప్రమాణాల గురించి స్థాయి గురించి ప్రజలకు ఎంతవరకు జవాబుదారీగా వుంటున్నాయి అంటే ప్రజలు ఆ ఆశలు ఎన్నడూ పెట్టుకోలేరు. ఈరోజుల్లో విశ్వవిద్యాలయాలనుంచి ప్రజలు ఆశిస్తున్నవి చాల చిన్న కోరికలు. సకాలానికి విద్యాలయాలు తెరచి, సక్రమంగా నిర్వహించి మళ్ళా సకాలంలో పరీక్షలు జరిపి ఫలితాలు ప్రకటించడం. ఇవి కూడ తీరని కోరికలే అవుతున్నాయి.

('ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ'కి కృతజ్ఞతలతో)

శబ్ద నిశ్శబ్దాలు

సురా

ఓ ప్రొఫెసర్లూ ! మీరు ముసలి వాళ్ళయిపోయారు–

(మీ భావాలు కూడా !)

సొర్బాన్ విశ్వవిద్యాలయం గోడలపై నినాదం – మే, 1968 – ఫ్రాన్స్

ఆంధ్ర విశ్వవిద్యాలయం మూడేళ్ళ ఆలస్యంగా మొన్న తన ఏభైవ పుట్టిన్రోజు పండగ చేసుకుంది– సంజీవరెడ్డి, చెన్నారెడ్డిలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో, ఏభై లక్షల రూపాయల ఖర్చుతో ఈ స్వర్ణోత్సవాలు ఘనంగా జరిగాయి. జమీందార్లు పోయినా వదలని వారి సంస్కృతికి సాక్ష్యంగా పాలించే నూజివీడు జమీందార్ వైస్‌ఛాన్సలర్ గారూ (ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్‌ని 'కులపతి' అనడమ్ సరిఅయింది !) దొరికిపోయి పారిపోయిన బాబా భక్తుడు రిజిష్ట్రార్‌గారూ ఈ ఉత్సవాలని విజయవంతంగా నిర్వహించారు.

ఆ సందర్భంలోనే రిటైరైన రాజకీయ నాయకుడు గొట్టిపాటి బ్రహ్మయ్యని, ఇందిరామందిరా భక్తుడు పి. వి. నర్సింహారావుని, తెలంగాణా పోరాట విద్రోహి రావి నారాయణరెడ్డిని, ఖుషీలోకబాంధవుడు గోగినేని రంగాని, ద్వంద్వార్థ సినీకవి సినారెని, విశ్వనాథభూతమావహించిన తెన్నేటి హేమలతని, కళావ్యాపారి ఎన్.టి. రామారావుని కళాప్రపూర్ణులుగా గుర్తించి గౌరవించింది ఆంధ్ర విశ్వవిద్యాలయం.

ఎనిమిది రోజులపాటు ఒక ఎగ్జిబిషన్‌ని నిర్వహించింది– సాహితీవేత్తల పేర్లని చక్రంపై రాసి డబ్బులు కాయించి సొమ్ముచేసుకునే ఇంగ్లీష్ డిపార్ట్‌మెంటుతో, మరో మార్గంలేక హస్తసాముద్రికుడ్ని కూర్చోపెట్టి డబ్బు చేసుకున్న ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌తో పోటీలతో, పందేలతో, ప్రతీ డిపార్ట్‌మెంట్‌ని ఒక జూదగృహంగా మార్చివేసింది– నూజివీడు జమీందారీ వంశ గౌరవాన్ని కీర్తిస్తూ థియేటర్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ ప్రదర్శించిన నాటకంతో సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకుంది.

ఏభై ఏళ్ళక్రితం మొదటి వైస్‌ఛాన్స్‌లర్ బ్రిటిష్ బిరుదాంకితుడు సర్ కట్టమంచి రామలింగారెడ్డి లైబ్రరీలో ఉన్న మార్క్సిస్ట్ పుస్తకాలను తొలగించడాన్ని బూర్గుల రామకృష్ణారావుగారిని అడిగితే చెప్తారు. మొన్న జరిగిన ఉత్సవాలు ఆ సాంప్రదాయానికే కాబోలు పుట్టిన్రోజు పండగ చేసుకున్నాయి.

అయితే ఎనిమిది రోజులపాటు ఫిడేలు రాగాల్ని వినిపించిన ఈ నీరో చక్రవర్తి వారసుల సంగీతం వెనకాల వినపడని నిశ్శబ్దం ఉంది. ఆ నిశ్శబ్దం భయంకర నిశ్శబ్దం కుల ప్రాబల్యంతో నియామకాలు జరిగితే నోరెత్తని నిశ్శబ్దం, వ్యక్తిగత కక్షతో ఆంత్రోపాలజీ ప్రొఫెసర్‌ని తీసివేస్తే మాట్లాడని నిశ్శబ్దం, వాళ్ళ అధ్యాపక సంఘం అధ్యక్షుణ్ణి ఎమర్జెన్సీ కబళిస్తే కనీసం అది సడలించి నప్పుడైనా రాజకీయ ఖైదీల విడుదల గురించి అడగలేని నిశ్శబ్దం, తెలుగు మహాసభల్ని కాక తుఫానుని కూడా బావుకున్న అప్పటి విద్యామంత్రి కృష్ణారావు సిండికేట్‌కి, సెనేట్‌కి ఎన్నికలని నిషేధిస్తే ఇప్పటికయినా నిరసించని నిశ్శబ్దం. ☆

ఈ శబ్ద నిశ్శబ్దాల కలయికే మన విశ్వవిద్యాలయాలు. సంపన్న వర్గాల ముద్దు బిడ్డల ఆటపాటల విలాస కేంద్రాలు, మధ్యతరగతి బ్రతుకు భాగ్యోదయాల ఆశనిరాశల కూడలి, జీతాల మేధావుల చదరంగ రంగస్థలం. అర్థంకాని పుస్తకాలు, అర్థం లేని పరిశోధనల కోసం దేశం నడిపే కబుర్ల కల్లుబ్బులు, దంత భవనపు బంధనాల్లో ఇరుక్కున్న మేధావులు ఇక్కడ ప్రొఫెసర్లు. ఆలోచనల్ని చైతన్యాన్ని కాపలాకాసే పోలీసులు నేటికీ వైస్‌చాన్స్‌లర్స్. సాంఘిక వాస్తవికత ఏరకంగానూ ఇక్కడ ప్రతిబింబించదు. కోట్లాది ప్రజల జీవన్మరణ పోరాటం వీళ్ళకి అసందర్భం.

అయితే అసమాన సమాజ పోరాట తరంగాలు తాకక మానవు. గత విద్యా సంవత్సరం (77-8) లో ఒకేసారి దేశంలో ఉన్న నూట నాలుగు విశ్వవిద్యాలయాల్లో ఏభై ఎనిమిది విశ్వవిద్యాలయాలు విద్యార్థి ఉద్యమాలతో కొన్నాళ్ళ పాటు నిరవధికంగా మూతబడ్డాయ్. ఈ విశ్వవిద్యాలయాన్ని పోషిస్తున్న సమాజం పేద సమాజం. అక్కడ నూటికి ఎనభైమంది రోజుకి రూపాయయినా సంపాదించలేని జీవితంతో సంఘర్షిస్తున్నారు. వాళ్ళు ఎప్పుడో ఒక రోజు తమ బాకీని వడ్డీతోసహా వసూలు చేసుకుంటారు. ఆరోజు విశ్వవిద్యాలయం తన నిజమైన ఉత్సవాలని జరుపుకుంటుంది.

(9-16 జులై '78)

☆ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా అసలెవ్వరూ ఈ ఉత్సవాల్లో గొంతెత్తలేదని కాదు. కాని అలాంటి విద్యార్థులకు చదువులైపోయాక ఉద్యోగాలు యిచ్చి (!) పెళ్ళిళ్ళుచేస్తే చల్లబడిపోతారని సంజీవరెడ్డి సూక్తులు పలికాడు.

చండీఘర్ - బొంబాయిలలో సంచలనం సృష్టిస్తున్న కళారూపకం
DISTURBED AREA (కల్లోలిత ప్రాంతం)

సలంద్ర

యిటీవల కొందరు యువ కళాకారులు బొంబాయి చండీఘర్‌లలో ప్రయోగాత్మకంగా చేపట్టిన "డిస్టర్బ్‌డ్ ఏరియా" (కల్లోలిత ప్రాంతం) అనే కళారూపం (వీధి నాటిక లాంటిది) ఆ నగరాల్లో ప్రదర్శించబడినప్పుడు విశేష ఆదరణ పొందింది.

"డిస్టర్బ్‌డ్ ఏరియా" అంటే మన తెలుగులో సూత్రప్రాయంగా ప్రభుత్వం ప్రకటించిన "కల్లోలిత ప్రాంతాలు" అని అర్థం చెప్పుకోవచ్చును. ఈ పేరిట వెలువడిన ఈ కళారూపకం ఎలా ప్రదర్శింపబడుతుందంటే : జనసమ్మర్దం విశేషంగా వుండి, రోడ్డుకి పక్కన ప్రదర్శించడానికి వీలుగా వున్న స్థలాన్ని ఎన్నుకొని అక్కడ ఈ ప్రదర్శకులు వుండిపోతారు. అందులో నుండి యిద్దరు వ్యక్తులు వీపుకీ - ముందు భాగానికీ "డిస్టర్బ్‌డ్ ఏరియా" అని రాసిన తాటికాయలంతటి అక్షరాల ప్లేకార్డ్స్ ధరించి అటూ యిటూ తిరుగుతూ జనాన్ని పోగుచేయడానికి ప్రజాపాటలు జానపదుల వాయిద్యాల సహకారంతో పాడుతూ వుంటారు.

డ్రామా ట్రూప్‌లాగా వున్న ఈ తతంగాన్ని చూసి జనం కుతూహలంతో నిలిచిపోతుంది. ఆ తర్వాత యిందులోని ఒక నటుడు జనానికి- "ఏ క్షణాన అయినా మీ ఒకే ఒక అనుభవం హింసారూపం దాల్చవచ్చు. ఆ గాధనే మేము మీకు యిప్పుడు పంచాలని. మిమ్మల్ని వెన్నుతట్టి లేపాలని. నడిపించుకుపోవాలని ప్రయత్నిస్తున్నాం. మాకు యిప్పుడు - సంపూర్ణ విప్లవం గానీ తదితరంగానీ చెప్పడానికి సమయంలేదు. యిప్పుడు మేము చూపేదల్లా మీకు సంబంధించిన, సంబంధించని, బాధల్ని గాధల్ని మాత్రమే"- అనే అర్థంలో రాసిన కరపత్రాల్ని పంచుతాడు.

అక్కడ నిలిచిన ప్రేక్షకులంతా కరపత్రాల్ని చదువుతూ, ఏం జరగబోతోందో అనే ఉత్సుకతతో ఎదురుచూస్తూ వుంటూ వుండగా- యింతలో వాయిద్యాలు విషాద సంగీత తరంగాల్ని గాలిలో ప్రసరించడంతో గంభీర వాతావరణం ఏర్పడుతుంది. ఈలోగా ఆ ట్రూప్‌లోని ఒక నాయకుడు "స్టార్ట్" అని అరుస్తాడు. అప్పుడు దృశ్యం ఆరంభమవుతుంది. ఆ ప్రదర్శన పేరు "హింస".

ఒక విద్యార్థి చేతిలో పుస్తకాలు వుంటాయి. అతనిని పోలీసులు చుట్టూ చేరి ఒక సర్కిల్‌లో కొడుతూవుంటారు. ఆ దెబ్బల్ని భరించలేక ఆ విద్యార్థి పోలీసుల

కాళ్ళ మధ్య నుండి ఏదేనా సందుచేసుకుని పరిగెత్తడానికి ప్రయత్నిస్తాడు– కానీ పోలీసులు తన్ని మళ్ళీ కింద పడేస్తారు– యిలా మళ్ళీ మొదలౌతుంది పోలీసుల ప్రశ్నల పరంపర.

"నీ నాయకుడు ఎవరో చెప్పు"– ఒక పోలీస్ అరిచాడు.

"ఎక్కడున్నాడో చెప్పు?"– "మిగతా వాళ్ళ ఆచూకి కూడా ఏమిటి?" పోలీసులు అడిగేస్తున్నారు.

ఆ విద్యార్థి తలని ఆడిస్తూ– "నేనొక్కడినే, నాకెవరితోనూ సంబంధం లేదు" అంటాడు.

ఈ జవాబు వినడమే చుట్టూవున్న పోలీసులు తలా ఒక తన్ను విచక్షణా రహితంగా తంతూ కొట్టడంతో, విద్యార్థి కింద కూలిపోతాడు. యిలా చిత్రహింసలు చేస్తున్న పోలీసులు, తమ ఎదుటే దర్జాగా కూచుని యివన్నీ చేయిస్తున్న ఉన్నత పోలీసు అధికారివేపు పిన్ని యింకా ఏంచేయమంటారూ? అన్న ధోరణిలో చూస్తారు.

ఆ అధికారి గర్వంగా యింకా కానివ్వండి– "గో ఎహెడ్" అని అంటాడు.

అప్పటికే విపరీత చిత్రహింసలకు గురియైన ఆ విద్యార్థికి అప్పుడుకళ్ళు చింత నిప్పుల్లా తయారవుతాయి. ఎందుకంటే అప్పుడు పోలీసులు ఆవిద్యార్థికి "హైదరాబాద్ గోలీ" (పోలీసులు పెట్టే చిత్రహింసల్లో మహా భయంకర మయినది, ఈ "హైదరాబాద్ గోలీ" పేరిటిది. ఈచిత్రహింస దృశ్యాల్ని మొదట "ఇండియా టు–డే" అనేఆంగ్ల పత్రిక ప్రచురించింది. విరసం వారు ప్రదర్శించిన పోలీసు చిత్రహింసల పెయింటింగ్స్‌లో ప్రముఖ చిత్రకారుడు చంద్ర వేసిన ఈ చిత్రంకూడా వుండింది.) అనేమరో చిత్రహింసకి గురిచేయబోతున్నారన్నట్టు. అయితే ఈ "హైదరాబాద్ గోలీ" ప్రయోగించినట్టు దానితాలూకు చిత్రాన్ని ప్రేక్షకులకు చూపుతారు. ఆ చిత్రహింస అనంతరం ఆవిద్యార్థి నోట్లోనుంచి నెత్తురుకక్కు కుప్పలా కూలిపోతాడు. అంతటితో ఆ "హింస" దృశ్యం ముగుస్తుంది.

యిలా ప్రదర్శించిన ఈప్రదర్శనల గురించి ఈరోజు చండీఘర్–బొంబాయిలలో ఎక్కడవోయినా రిక్షావాళ్ల నుండి చాలాపెద్ద కుటుంబాల వరకుకూడా మాట్లాడుకుంటున్నారు.

మేకప్‌లేకుండా ఒక స్టేజీకై ప్రయత్నించక, ప్రచారంకోరకు తాపత్రయపడక, ఆహ్వాన పత్రాలు, ఫోకసింగ్ లైట్లు, టికెట్లు అమ్మడం లాంటి నానా తతంగం లేక

కేవలం జనంలో సామాన్యుల వద్దకే వచ్చి ఒక మంచి ఆశయంతో ఒక ఆలోచనని రేకెత్తించడానికి ఈ కళారూపం ద్వారా కృషి చేయడం ఎంతైనా అభినందనీయం.

ఈ "డిస్టర్బ్డ్ ఏరియా" కళారూపాన్ని రూపొందించడానికి ఢిల్లీలోని జె. ఎన్. యూ. మరియు యితర యూనివర్సిటీలలో చదువుకున్న కొందరు యువకుల్లో ముఖ్యంగా గురుచరణ్‌సింగ్ చానీ (డైరెక్టర్), కెర్బీ బరూచ, ప్రదీప్, మొదలైన వాళ్ళకు ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ పోలీసు 'సంఘర్షణ' (ఎన్‌కౌంటర్)ల నిజానిజాల్ని తెలుసుకోవడానికి జయప్రకాశ్‌నారాయణ నియమించిన వి. ఎం. తార్కుండే కమిటీ విడుదలచేసిన రిపోర్టు చదివినతర్వాత ఒకఆలోచన కలిగింది. గురుచరణ్‌సింగ్ చానీ యిదివరకు ఢిల్లీలోని నేషనల్ స్కూల్‌ఆఫ్ డ్రామాలో చదువుకుని, వృత్తిరీత్యా నాటకాల్లో వేషాలువేయడం వలనకూడా సంప్రాప్తించిన అనుభవంతో - మరికొంతమంది అనుచరుల్ని పోగుచేసి చండీఘర్‌లో "కమ్యూనిటీ థియేటర్ వర్క్‌షాప్" పేరిట ఒక సంస్థని స్థాపించాడు.

అనంతరం తార్కుండే ప్రజాహక్కులసంఘం "ఎదురుకాల్పుల" రిపోర్టు ఆధారంగా "హింస" పేరిట వీధిరూపకాన్ని సమిష్టిగా తయారుచేసి ప్రదర్శించాక అభినందనలే కాకుండా మంచి గుర్తింపుకూడా వచ్చింది. మామూలు కుటుంబాల నుండివచ్చిన ఈ ప్రజాకళాకారులకు "హింస" రూపకాన్ని ప్రదర్శించడానికి ముందు 45 రోజుల శిక్షణయిచ్చాడు చానీ.

డైరెక్టర్‌గా పనిచేసిన గురుచరణ్‌సింగ్ చానీ ఆయాచోట్ల వివిధ పత్రికలవారితో మాట్లాడుతూ - "మేము నాటకానికీ వాస్తవికతకీవున్న దూరాన్నిచెరిపేసి బూర్జువా థియేటర్లనుండి, మూసేసిన విశాలమైన హాల్స్‌నుండి, సామాన్య, బీదకూలీ జనంమధ్యన వీధుల్లోకి వచ్చేస్తూ, వాస్తవికతని తెలుపుతూ నిజమైన కళఅంటే ఏమిటో అదిఎవరికి చెందాలో వారికే ఈవిషయాల్ని గుర్తుచేయడానికి మాత్రం కృషిచేస్తున్నాం" అని అంటాడు. ఈ కూలీజనానికి చెందిన ఈ ఉచిత వీధినాటకంలో పోలీసులు ధరించాల్సిన టోపీలే ధరించరు, తుపాకులుకూడా పట్టుకోరు. టోపీలకు బదులు హెల్మెట్స్, తుపాకులకు బదులు పొడుగాటి కర్రలుమాత్రం వుంటాయి. అసలు చానీఉద్దేశంలో పనికిమాలిన ఈ తతంగాలన్నీ అనవసరం. ఎందుచేతనంటే చెప్పదలుచుకున్న సందేశమేదో చేసిచూపే నటనమీద మాత్రమే ఆధారపడి వుంటుందని అంటాడు.

చానీ స్క్రిప్టు విషయం ప్రస్తావిస్తూ - "నేను అసలువిషయాన్ని చాలా ప్రధానంగా ఆలోచిస్తాను. ఆమాట కొస్తే నేనుమొదటే తయారుచేసిన స్క్రిప్టుపట్లకూడా

గౌరవం కనబరచను. మేము రూపొందించిన -హింస- రూపకం విషయమై అందరు అందుకు సంబంధించిన వారం ప్రతిరోజూ చర్చించుకునేవాళ్ళం. ముఖ్యంగా ఎవరికైనా పత్రికల్లో పోలీస్‌కాల్పులు, చిత్రహింసలూ, హింసావాదం, లేక బాగానచ్చిన ఏ కవితనైనా కనబడితే చర్చలో పెట్టేవాళ్ళం బాగోగులు చర్చించి, మేము చెప్పదలుచుకున్న -హింస- ఎంతటి గుండెలోతుల్లోకి వెళ్ళి చెప్పగలమో ఆలోచించి అడుగు ముందుకేసి, ఏనాటికానాడు జరిగిన కొంగ్రొత్త సంఘటనల్ని కూడా స్వీకరించాం అంతేకానీ, ఒకస్క్రిప్టు దాన్నేబట్టీ పట్టడంలాంటిది చేయలేదు."– అని అంటాడు.★

మొత్తానికి బొంబాయి, చండీఘర్‌లలో జనాల్లో సంచలనం సృష్టిస్తూ పత్రికల దృష్టిని కూడ ఆకర్షించిన ఈ "డిస్టర్బ్‌డ్ ఏరియా" రూపకాన్ని మన తెలుగుదేశంలో కూడా చేపట్టి ప్రజా నాటక సంఘాలవారు ప్రచారం చేస్తే మంచి ఫలితాలు సాధించగలరనే ఆశించవచ్చు.

తెలుగు దేశంలో ప్రచారంలో వున్న 'వీధి' నాటకాలు, కూచిపూడి నాటకాలు, గడ (దొమ్మరి) ఆటలు, పెద్దమ్మలవాళ్ళ ఆట, 'సింధుమాదిగె' 'దాసరి' వేషాలు, పగటి వేషాలు వంటి ఎన్నో జానపద కళారూపాలు ఈ 'ప్రజావస్తువు'ను స్వీకరించినప్పుడు మంచి ప్రభావం వుంటుంది. 'రూపంలో జాతీయస్వభావం, వస్తువులో సామ్యవాదం' సాహిత్య కళారూపాలకు అవసరమన్నది ఇంకా ఎనభై శాతం నిరక్షరాస్యులైన మన దేశంలో గుర్తుంచుకొని తీరాలి. శ్రీకాకుళం, గోదావరి లోయల్లో ఇంకా కనీసం పది తాలూకాలయినా 'కల్లోలిత ప్రాంతాలు'గా కొనసాగుతూ ఏజన్సీ ఏరియాల్లో పోలీసు క్యాంపులు, గిరిజన ప్రజలపై దౌర్జన్యాలు యథాతథంగా వున్న తెలుగుదేశంలో 'డిస్టర్బ్‌డ్ ఏరియా' చండీఘర్, బొంబాయిలకన్న ప్రజల అనుభవంలో ఎంత సత్యమైంది, ఎంత నిత్యమైంది!

★ హైదరాబాదు జననాట్య మండలి వాళ్ళు ప్రదర్శించే కళారూపాలకు ముఖ్యంగా 'బీదలపాట్లు' అనే నాటికకు చాల కాలం వరకు లిఖితపూర్వకమైన స్క్రిప్టు లేదు- ఏ పాత్ర కాపాత్ర తన సంభాషణలను మనసులోనే అనుకుంటారు. వేసిన ప్రాంతాలను బట్టి, పరిస్థితులను బట్టి ఈ స్క్రిప్టు మారుతూవుంటుంది కూడ. మొదటిసారి హైదరాబాదు నగరానికి దగ్గరగావున్న ఒక పల్లెలో ఇలాంటి ఒక నాటిక వేయలేమా అన్న ఆలోచన వచ్చింది. జననాట్య మండలికి వెంటనే నేలమీదనే నాలుగు గడలు పాతి అక్కడికక్కడే దానిని రంగస్థలంగా ప్రకటించి ఆ బృందంలో తలా ఒక పాత్ర ఎంచుకొని నాటికను విజయవంతంగా ప్రదర్శించారు. తర్వాత ఎన్నో చోట్ల ప్రదర్శింపబడి ఈ నాటిక విశేష ప్రజాదరణ పొందింది.

శ్రమైక జీవన సౌందర్య గీతాలు

'జన్మహక్కు' పాటల పుస్తకంలో ఒక వచన కవిత కూడా వున్నది. చే.రా. ముందు మాటలో చెప్పింది కాక తన ఆశయం, తన పాటల గురించి తనూ కొంత చెప్పదలచి చెరబండరాజు ఈ కవిత చేర్చినట్టున్నాడు. ఈ కవితలో–

"నాది శ్రమైన జీవన సౌందర్య గీతం
మతానికీ దోపిడీ పథానికీ నేను పల్లవిని కాను"–

అంటాడు. 'జన్మహక్కు' పాటలన్నీ శ్రమైక జీవన సౌందర్య గీతాలే.

మన దేశంలో ఎక్కువ మంది చదువురాని వాళ్ళు. వాళ్ళకు విప్లవ సందేశం అందించడానికి పాటలు ఒక మార్గం. ఇవి వాళ్ళకు పాడి వినిపించాలి– వినగానే వాళ్ళకు ఇవి అర్థంకావాలి– చాలావరకు తెలిసిన విషయాలనే కొత్తగా, హృదయానికి హత్తుకునేలా చెపుతున్నట్టివిగా వుండాలి– వాటిని వినగా, వినగా; పాడగా, పాడగా– ఆలోచన రేకెత్తించేవిగా వుండాలి– రోజూ చేసేది కాక యింకేదో చేస్తే తప్ప మన బతుకులు మారవనిపించేవిగా వుండాలి. ఇట్లాంటి పాటలు రాయడంలో చెరబండరాజు చేస్తున్న ప్రయత్నం 'ఓరయో నారయో....' పాటలో పూర్తిగా గెలుపొందింది :

"పేదోల్లకు పేపర్లలా / పనికొచ్చే దుంటదంట
సైకిలు తోపే పల్లెకు / సాపు లేదు పేపరేడ"....

"అద్దెకరం దుక్కిలేదు / ఆవు లేదు బర్రె లేదు
కూలోడికి దేశంలో / కూడెందుకు లేదంట"....

"మాకున్నా లేకున్నా / మా పిల్లల మంచి కొరకు
పోరాటం దారి వెంట / పోతేనే సుఖమంట".

"మాకున్నా లేకున్నా" అనగానే సుబ్బారావు పాణిగ్రాహి గుర్తుకు వస్తాడు. "జాతరోళ్ళొస్తుంద్రు" పాటలో "తీపి తీపి మాటలోల్లు / తీస్‌మార్ ఖానోల్లు" అని వినగానే పుట్టడమే ప్రజల భాషలో పుట్టిన కవి వి. బి. గద్దర్ కనిపిస్తాడు. "మా పల్లె" పాటలో–

"పైరగాలికి వేడి నెత్తురొచ్చిందంట
పలుగురాళ్ళకు ప్రాణమొచ్చి లేచాయంట
ఎండు పుల్లలు గుండె పొంగి నడిచాయంట
మా పల్లె ఎరిమల్లె వాగాయెనా
పెద్ద ఏటిని కొత్త అల లేచెనా"—

అని చూడగానే శ్రీకాకుళ గిరిజన పోరాటాన్ని గొప్పగా పాడిన రెంజిమ్ కనిపిస్తాడు. ఈ 'పైరగాలి' లోనే అందమైన 'ఓ గులాబీ' (పాట) పూసింది, పాప పుట్టిన రోజు 'చందమామా' (పాట) దిగొచ్చింది. ('చందమామా' పాటలో యింకా చాలా విషయాలు చెప్పి ఒక సమగ్రమైన పాటగా దాన్ని రూపొందించే అవకాశం వున్నది.)

ఇట్లా— "నక్సల్‌బరి విరచించిన / జన విముక్తి గీతాలను / ప్రతి కంఠం నినదించగ" పాడే వాళ్ళ సరసలోకి వచ్చాడు చెరబండరాజు. వచన కవిత్వం ఎంత బలంగా రాసినా ప్రజలకు చేరువ కాలేమన్న సత్యాన్ని పూర్తిగా గ్రహించాడు.

"కొండలు పగలేసినం" పాటలో....

"మా నరాలె దారాలుగ / గుడ్డలెన్నొ నేసినం
ఉడుకెవడిదిరో / వణుకెవడిదిరో"....

"మా చెమటలు ఏరులుగా / పంటలు పండించినం
గింజెవడిదిరో / గంజెవడిదిరో"—

అంటూ వర్గభేదాన్ని చిన్న చిన్న మాటల్లో కళ్ళకు కట్టేలా చూపెట్టాడు.

'ఎర్రెర్రని తెలంగాణ'లో చెరబండరాజు, పాటను నడిపించిన పద్ధతి అమోఘమైంది. అన్ని విషయాలు— అంత సరళంగా, అంత శ్రావ్యంగా— వినిపించడం కొనియాడదగింది. "ఇదేనండి ఇదేనండి ఎర్రెర్రని తెలంగాణ / కమ్యూనిష్టు గుండెకాయ కష్టజీవి కలల కోన" అని మొదలయ్యే ఈ పాట— "పోరాటం నడిపించిన పుచ్చలపల్లి సుందరయ్య / కంట నిప్పులను చెరిగిన చంద్ర రాజేశ్వరయ్య / ఎన్నికలని కొంపార్చిరి ఇంకెప్పుడు నమ్మకండి" అని కూడా చెప్తుంది.

"ఆపలేరు" అనే పాట చాలా వేగంగా దూసుకువచ్చే విప్లవగీతం. "మీ చీకటి కొట్టానికి నిప్పు లంటుకుంటున్నై / మా ఊపిరి తిత్తులతో ఊది ఊది మండిస్తాం" అని పీడకులను హెచ్చరిస్తుంది.

"విప్లవాలయుగం మనది" పాటలో "పోలీసుల రాజ్యంలో / పౌరహక్కులడుగంటెను / కోర్టులలో జనన్యాయం / గొంతునులిమి చంపబడెను" "చెరసాలలు ఉరికొయ్యలు / వెలుగును బంధించలేవు" అనేచరణాలు— చే. రా. అన్నట్టు - ఎంతో చక్కని కవితా నినాదాలు.

మతంగురించి చెరబండరాజు చాలాచోట్ల చెప్పాడు. మతానికి విప్లవకారుడు యింత ప్రాధాన్యత యివ్వవలసిన పని లేదేమో, దోపిడీ వెంట మతమూ పోతుంది.

అయితే "మతపిచ్చి" పాటలో లాగా- "మతంపిచ్చికన్నలేదు / మత్తుమందురో" అని నినాదప్రాయంగా చెప్పేకన్న "ఏకులమబ్బీ" పాటలోలాగా-

"మట్టిపిసికి ఇటుకచేసి / ఇల్లుకట్టి పెట్టినపుడు
డొక్కఎండి కొంగ్రడలేసి / ధాన్యరాసు లెత్తినపుడు
ఏకులమబ్బీ మాదేమతమబ్బీ" అనీ-
"పశువుగొంతుకోసిమీకు / చెప్పులు కుట్టిచ్చినపుడు
కూటికింత కూడులేక / కుండలు జేసిచ్చినపుడు
ఏకులమబ్బీ మాదేమతమబ్బీ" అనీ-

చెప్పడం శక్తివంతంగా వున్నది. అయితే యిక్కడ 'పశువుగొంతుకోసి' అనడం పూరణకోసమేతప్ప మరే ప్రయోజనం సాధించదు; సరికదా- కోసినవానిపై సాను భూతిని తగ్గిస్తుందేమో.

మంచిపాటలు రాయగలిగిన చెరబండరాజు చాలాపాటలు అల్లడంలో ఎక్కడ విఫలమయ్యాడో చూడడంకూడ అవసరమే.

'మార్క్సిస్టు-లెనినిస్టు' లో "మార్క్సిస్టు . లెనినిస్టు / కమ్యూనిస్టులమండి / మావో ఆలోచనల మార్క్సిజం మనదండి" అనడం చప్పగావుంది. ఈపాటలో పార్టీ సిద్ధాంతాన్ని వుపన్యాస ధోరణిలో చెప్పినట్టుగావుంది. 'శ్రామికవర్గం' లో పరిశ్రమించె శ్రామిక వర్గం / కడుపుకాల్చుకొని / కళ్ళుమూసుకొని / పెట్టుబడికి జైకొట్టదు కొట్టదు / ద్రోహుల గోరీకట్టక వదలదు" లాంటి చరణాల్లో కొత్తదనం కనిపించదు. 'కష్టజీవి', 'ఇదినూతన', 'ఓట్లచెట్లు' పాటలుకూడా ఈకోవకు చెందుతాయి. "వర్గరహిత బతుకుకొరకు వర్గ పోరు అనివార్యం అనివార్యం", "వ్యవసాయక విప్లవమే మన తక్షణ కర్తవ్యం కర్తవ్యం" అనేచోట్ల కవిత్వం కనిపించదు. పుస్తకంలో 'సాయుధ పోరాటం' అనే మాట మాటిమాటికీ నినాదప్రాయంగా వినిపిస్తుంది.

'వియత్నాం'పాట వియత్నాంయిచ్చే స్ఫూర్తి నివ్వడంలేదు.

మృతవీరుల గురించి రాసే పాటలు వాళ్ళపట్ల వుండే గౌరవాన్నో, ప్రేమనో చాటడానికి మాత్రమే ఉండకూడదు; వాళ్ళకు జోహార్లు అర్పించేవిగానేవుంటే సరిపోదు; వినేవాళ్ళలో విప్లవదీక్షను కలిగించేవిగా కూడావుండాలి. పరిటాల రాములుపై చెరబండ రాజు రాసినపాటలో - ఇదివరకే ప్రచారంలోవున్న "పరిటాలా రాములూ! నీకు లాల్ సలాములూ / వృథాకాదు నీమరణం రేపటి సూర్యునికిరణం" పాటలోవున్నంత జిగి,

జీవంలేవు. అయితే, భూమయ్య కిష్టాగౌడులకు 'లాల్‌సలామ్' చెప్పిన పద్ధతి బాగున్నది. ఇది మంచిఅనుభూతితో రాసిన స్మృతిగీతం కాబట్టే దేశవ్యాప్తంగా ప్రచారం పొందింది. "వాళ్ళు జైలు గోడనీడలకు చిరునవ్వులు నేర్పినారు" అనేచరణం శ్రోతల హృదయాలను కదిలించేది.

ఉప్పెనమీద రాసిన "ముంచుకొచ్చిందీ" పాటలో పరిశీలన, అనుభూతి లోపించినాయి. పత్రికల్లో ఉప్పెన భీభత్సం చదివి 'మొక్కుబడి'గా ఏదోరాయాలని రాసినట్టుగా వున్నది ఈపాట. "ముందే జనాల తప్పించుంటే / కొందరు మనతో వుండేవారేమో అయ్యో! బలుసాకైనాతిని బతికేవారేమో" అనడంలో అవగాహనా లోపంకూడావున్నది. బలుసాకైనా తిని బతకమనడం అశాస్త్రీయమైనదీ, పోరాటపటిమను ఎద్దేవా చేసేదీ.

'రాజుల సంస్కృతి' పాటలో–

"రాజుల సంస్కృతి ప్రజలది అంటె చెల్లదు చెల్లదు చెల్లదులే
రాళ్ళకు పువ్వుల పరిమళ మెప్పుడు అంటదు అంటదు అంటదులే"

అనేచోట రాళ్ళకుపువ్వుల పరిమళ మంటదనేది సహజమనిపించదు. ఇక– ఇతర పాటల్లో కొన్నిచోట్లలాగే – యీ పాటలో కూడ "జైత్ర యాత్రలని ప్రసిద్ధి కెక్కినవన్నీ పేదల వురితాళ్లే" అనేచోట నడక కుంటుపడింది.

దోపిడీ "మొదనష్టం సంఘం" (పాట) లో స్త్రీల నిజమైన స్వాతంత్ర్యానికి మౌలికమైన అంశాలు లేవు. "మానందర్రో" పాటలో చివరి చరణాలైన "ఏదైతే మనకెందుకు / తప్పుకొనీ పోదమనే / బతుకు తీపి భయం బుద్ధి / మానందర్రో మానందర్రో" అనే చోట మధ్యతరగతి మనుషుల మనస్తత్వాన్ని బాగా చిత్రీకరించినప్పటికీ ముందు పంక్తుల్లో అట్టడుగున వున్న మనుషులు 'పిరికిబుద్ధి' కలవారని చూపే ప్రయత్నం చేసాడు. నిజానికి, 'అయ్యా నీబాంచె'ననే, 'అమ్మా నీపున్నె'మనే వంటి మాటలు వారి పిరికిబుద్ధి నుండి వచ్చినవి కాక– తరతరాల అణచివేతలో, దోపిడిలో, నిస్సహాయ స్థితిలో అలవాటైన మాటలు. పాటలో అంతటా– 'తలకొరవీ పిరికిబుద్ధి', 'బైరాగుల కొలుచుబుద్ధి', 'వొట్టి గిస్తరనే బుద్ధి', 'మారుననే పాడుబుద్ధి', 'బతుకు తీపి భయం బుద్ధి' అని వుండి, ఒక్కచోట మాత్రం 'మక్కెలిరవ నట్టి బుద్ధి' అని nagative గ చెప్పడం మంచి అభివ్యక్తి కాదు.

"కొండలు పగలేసినం" పాటలో....

"కొండలు పగలేసినం / బండలనూ పిండినం
మా నెత్తురు కంకరగా / ప్రాజెక్టులు గట్టినం
శ్రమ ఎవడిదిరో / సిరి ఎవడిదిరో"—

అని ఉన్న చరణాలమధ్య కనిపించిన చక్కని క్రమమూ, అన్వయమూ "పతంపిచ్చి" పాటలోని "వ్యక్తిగతపు ఆస్తివల్ల / ముక్తిలేదురో / పూజవల్ల ఆస్తిహక్కు / పోదు పోదురో" అనే చోట కనిపించదు. ఇట్లే యింకొన్ని చోట్ల కూడా ఈ లోపంవున్నది-

జీవితాన్ని పరిశీలనాత్మకంగా చెప్పే ప్రయత్నం చేయకుండా, నిగ్రహం, ఓపిక లేక, తొందరగా కప్పదాటు వేసి, చివర ఒక సూత్రీకరణ చేయడం చెరబండరాజు పాటలు కొన్నింటిలో కనిపిస్తుంది. వుదాహరణకు– 'నిన్న మనం' పాటలో హరిజనుల బాధామయ జీవితాన్ని సమగ్రంగా చిత్రీకరించకుండానే– చివర–

"మా ఊళ్ళో గరీబోల్లు / కలవారిని హతాయించె
కత్తులు ఎత్తారూ– / దళములు గట్టారూ"....
"మీ వూళ్ళో మీరుగూడ / మావోలె నడిస్తేనే
బాధలు చస్తాయీ– / ప్రాణాలుంటాయీ"– అని అనడం,

కొన్ని అచ్చుతప్పులు లేకుండావుంటే బాగుండును. "ఆడపిల్ల లేదిపించి" (పే,13) లో 'లే'-చోట 'ల్నే', "చెరసాలతోతండ్రి (పే,38)లో 'తో' చోట 'లో', "హరిజనులున్నారూ" (పే,56) లో 'లు' చోట 'ల' లేకపోవడం– తప్పులు దిద్దు కోలేనివాళ్ళకు అర్థాన్ని మారుస్తాయేమో. "తవ్వినపుడు" (పే,60) "తవ్వినపుడు" గాను, "జేసిచ్చినప్పుడు" (పే,61) "జేసిచ్చినపుడు" గాను లేకపోవడంకూడా అచ్చు తప్పులే అనుకుంటాను.

"పదునెక్కిన ప్రజాకవి" అంటూ చే.రా. పుస్తకానికి రాసిన ముందుమాటలో తెలుగు సాహిత్యంలో వచ్చిన జనం పాటల విప్లవాన్ని చక్కగా పరిచయం చేసాడు. (అయితే ఆయన చెప్పినట్టు శివసాగర్ పాటలు రాసినట్టు ఎక్కడా లేదు). ఈ పాటలు యింకా బాగుండడమెట్లానో కూడా చెప్పాడు, 'ఎరుపు' అనే యిమేజి అరిగిపోయిం దనీ, ఒకే యిమేజిని కవులు యిట్లా వాడడం వల్ల అనుకున్నంత కవితాస్ఫూర్తి కలక్క విసుగు పుట్టిస్తుందనీ ఆయన చేసిన సూచన విప్లవ కవులు దృష్టిలో వుంచుకోలగింది. నిజానికి ఎరుపు, రక్తం– అనేవి జీవితానికి ప్రతీకలు. వీటిని పదే పదే ఔచిత్యం లేకుండా ప్రయోగించడం వల్లనే అవి విసుగు పుట్టిస్తాయి– కాని, ఆ పదాలు నిత్య నూతనమైనవే. అయితే వీటితోపాటు ప్రజా కవులు జీవితాన్ని చిత్రించగల ఎన్నో కొత్త కొత్త ప్రతీకలు సృష్టించుకోవలసి వుంది.

చెరబండరాజు "మార్పును కోరే కవి, తాను మారటాని కిష్టపడే కవి" అని చెప్పి, "చరిత్ర తన మీద పెట్టిన బాధ్యతను తప్పకుండా నెరవేరుస్తాడన్న" ఆశ,

కుటుంబరావు మేష్టారి లేఖకు సమాధానం

ఏప్రిల్/మే 78 'సృజన'లో కుటుంబరావుగారి లేఖను భౌతిక పరిస్థితుల కారణంగా ఆలస్యంగా చూడ్డం జరిగింది. వ్యక్తిగత జీవితంలో వెసులుబాటు లేని కారణంగా జవాబివడ్వం కూడా ఆలస్యమయింది.

"మన మేధావులు తమ మేధస్సును ఎంత మాత్రం బాధపెట్టకుండా" అన్నారు కొ.కు గారు. బాబాలకు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని కల్పించి భౌతికవాదం గురించి పరిజ్ఞానం వుండి కూడా రకరకాల భావ వాదం ముసుగులో భౌతికవాదాన్ని conscious గ ఎదిరిస్తూన్న సాహిత్య బాబా సుదర్శనం లాంటి వారిని ఎదుర్కొన డానికి నిజంగానే మేధస్సును బాధపెట్టాల్సివచ్చింది.

సుదర్శనం నవల్లో చెప్పబడిన philosophy ని అదే భాషలో ఖండించడానికి ప్రయత్నించాను గాని ప్రత్యేకంగా philosophic statements ఇవ్వలేదు నేను. మేధోపజీవి లాయరు "పదార్థం మనస్సు ఒకదానిమీద ఒకటి పనిచేస్తూంటాయని" అంటే పదార్థం ప్రభావం మనస్సుపైన, మనస్సు ప్రభావం పదార్థంపైన– అలా గమనించేది మనస్సే కాబట్టి మనస్సుకే ప్రాధాన్యం ఇస్తాను" అంటూ పదార్థానికి మనస్సుకు సంబంధం లేనట్లు రెండూ పూర్తిగా వేరు వేరు అయినట్లు, పదార్థం మనస్సునూ మనస్సు పదార్థాన్ని తయారు చేస్తుందనే భావాన్ని కలిగించడానికి భౌతికవాదాన్ని భావ వాదంగా, భావవాదాన్ని భౌతికవాదంగా గందరగోళ పరిచాడు. దీన్ని ఖండించడానికీ, పదార్థం ప్రాధాన్యతను నొక్కిచెప్పడానికి (పదార్థం ప్రాథమికం) పదార్థం ప్రభావంతో మనస్సు ఏర్పడుతుంది గాని మనస్సు యొక్క ప్రభావంతో పదార్థం ఏర్పడదు అనే అర్థంలో 'పదార్థం మనస్సు ఒకదానిమీద ఒకటి పనిచేస్తున్నా యనడం అశాస్త్రీయం' అని రాశాను. సందర్భం నుండి విమర్శను వేరుచేసి చూస్తున్నారు కొ.కు గారు. పదార్థం – చైతన్యం – మనస్సు అనే పదాలను (మనకున్న పదజాలం కొరతతో) వివిధ

నమ్మకం వెలిబుచ్చాడు చే.రా. చెరబండరాజు యింకా పదునెక్కాలి– "ప్రజలే మా నేతలని" తలచి, "ప్రజాయుద్ధ పల్లవిని" పాడాలి.

– జీ. డీ.

సందర్భాల్లో వివిధ రకాలుగా వుపయోగిస్తున్నాము. నేను ఉపయోగించిన సందర్భం వేరు. వారు తీసుకున్న అర్థం వేరు. 'మనస్సుకు ప్రాధాన్యత నిస్తాను' అనడంలో రచయిత పదార్థ సంబంధం నుండి మనస్సును పూర్తిగా విడదీసి పదార్థ రహితమైన ప్రత్యేక మనస్సును చూపుతున్నారు.

'వెధవా' అనే తిట్టు చేతనత్వం లేని (మనోరహితమైన) ప్రాణిపై పనిచెయ్యదు. ఉదా: శవంపై. శవంలో కూడా పదార్థం వుంటుంది, రక్తప్రసరణ, హృదయ స్పందన మనోవ్యాపారానికి అతీతంగా వుండవు.

ఎడారుల్లో తొలినాగరికతలు వెలియడానికి మనస్సు ప్రభావమే కారణమంటారా? పదార్థానికి అతీతంగా వున్న మనస్సు ప్రభావమా? అది. పదార్థ ప్రాధాన్యతను (ప్రాథమికత్వాన్ని) నొక్కి చెప్పడానికి పదార్థ రహిత మనస్సు లేదనడానికి చెయ్యబడిన నా విమర్శను సందర్భం నుండి వేరుచేసి మరో అర్థాన్ని లాగుతూ. Superstructure (ఉపరితల నిర్మాణము) ప్రభావం Base (పునాది) మీద వుండడానికి, మానవ చరిత్రలో సామాజిక విప్లవ దశలు జరగడానికి (నేను కాదన్నట్లు) ముడి పెడుతున్నారు.

"పదార్థం మనస్సుకు వెలుపలవున్న భౌతిక అస్తిత్వం. చైతన్యం ఆ పదార్థ అస్తిత్వం యొక్క ప్రతిబింబంతో మెదడు యొక్క పరిణామ క్రమంలో వుద్భవించేదే" అనే మార్క్సిస్టు మూల సూత్రంలో చైతన్యం అంటే మెదడు యొక్క ప్రక్రియ ఆలోచన అనే అర్థం తీసుకోవాలి. ఇక్కడ చైతన్యం అంటే class consciousness గ తీసుకోకూడదు. దాన్ని వర్గ చైతన్యం అర్థంలో తీసుకొని చైతన్యాన్ని నిర్ణయించేవి ఇంకేవీ లేవా? అని ప్రశ్నిస్తున్నారు కొ-కు గారు.

Homo sapiens (The one existing species of man) అందరిలోనూ ఒకే విధంగా వున్నా మెదడులో ప్రతిబింబించడానికి ఒకే బాహ్య భౌతిక ప్రపంచం, వర్గ సమాజంలో వ్యక్తిగత ఆస్తి ప్రాధాన్యత వున్నచోట ఉత్పత్తి సంబంధాలు, మానవుల మధ్య సంబంధాలు మారుతున్నచోట సాధ్యమా? వర్గ సమాజంలో ఒక్కొక్కరి జీవితం private గ భిన్నాభిన్నంగ విభజింపబడుతున్నచోట భౌతిక వాస్తవికతకు దగ్గరయ్యే మానసిక వాతావరణం కూడా భిన్నాభిన్నంగ వుంటుంది. ఒకే కుటుంబంలో నివసించే తల్లి, అక్క, చెల్లి, తమ్ముడు, అన్నలు ఒకే భౌతిక వాతావరణంలో జీవిస్తున్నట్లున్నా ఆర్థిక పునాదిని బట్టి మారుతున్న ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి శక్తి

లను బట్టి వారివారి జీవన విధానాన్ని బట్టి వారివారి చైతన్యం విభజింపబడుతూ వుంటుంది. ఒక్కొక్కరికి ఒక్కొక రకమైన వ్యాపకం- ఒక్కొక్కరికి ఒక్కొక రకమైన ఆలోచనా విధానం- ఒక్కొక్కరికి ఒక్కొక రకమైన చైతన్యం వుండటానికి వర్గ సమాజంలోని భౌతిక పరిస్థితులే కారణం. మార్క్సిస్టు సాహిత్యంపై కూడా ఈ ప్రభావమే పనిచేస్తోంది. ప్రతి ఒక్కరినీ వారి వారి ప్రైవేట్ జీవితం వెన్నంటి తరుముతోంది. వీలయినంత ఎక్కువమందిలో భావవిప్లవం సాధించడానికి, వర్గ పోరాటాలను వేగవంతం చేయడానికి ఉపయోగపడటానికే మార్క్సిస్టు సాహిత్యం.

ఒక అర్థాన్ని మరొక అర్థంగా, ఒక సందర్భాన్ని మరొక సందర్భంగా, ఒక విషయాన్ని మరొక విషయంగా తీసుకొని రకరకాల వ్యాఖ్యానాలు అలానే తయారవుతున్నాయి. ఈనాడు కోర్టుల్లో, ఆఫీసుల్లో, పత్రికల్లో, సాహిత్యంలో, విమర్శల్లో Interpretation అనేది పెద్ద సమస్యగా తయారైంది.

– జైరామ్
12-7-78

చావు కూడా బతుకుకంటె విలువైన త్యాగంగా.... ముగింపు గురించి :

ఆ పాత్ర, విప్లవకారుని భార్య పాత్రని సవ్యంగా అర్థంచేసుకుంటె స్నేహితునితో అంత సెంటిమెంటున్న పాత్ర అలా బొట్టు చెరిపివేయడంలో ఎంత గొప్పగా తన భావాన్ని అందజేసాడు అనిపించింది. చాలా రాడికల్ భావాలు కలవారి దగ్గర నుంచి చాలా అనుభవం ఉన్నవారివరకు అందరినీ నేనేమైనా తప్పుగా అర్థంచేసుకున్నానేమో నని అడిగి చూసాను. అందరూ కథలోని ముగింపును ఆమోదించారు. ఇక్కడ కూడా రకరకాల భావాలున్న మిత్రుల్ని అడిగా- వాళ్ళూ మెచ్చుకున్నారు.

బొట్టు మొగుడి ప్రాణం కాదు- కాని మన జాతిలో జీర్ణించిపోయిన సింబల్స్ అంత త్వరగా కొట్టుకుపోవు.

అల్లం రాజయ్యగారు లోగడకన్నా సిద్ధాంత చర్చలు కథలో పెంచుతున్నట్టనిపించింది జూన్ సంచికలో. ఆయన సిద్ధాంతకారునిగా గాక, జీవితాన్ని కాచి వడపోసే కథాకారునిగా నిలబడ్డం చాలా అవసరమేమో.

– కృష్ణాబాయి

ముఖచిత్రం : జూన్ 23, 24 తేదీల్లో గుంటూరులో జరిగిన
రాడికల్ యువజన సంఘం రాష్ట్ర మహాసభల దృశ్యం

యువ స్వరం

అన్నిటినీ రెండుగా చీల్చినట్టే
మిమ్మల్నీ రెండు ముక్కలు చేస్తాం.
ఒక ముక్క
ముసలి పీనుగుల మీదకి విసిరేస్తాం.
(అట్నుంచి మేం తీసుకొన్నదానికి
బదులుగా)
మిగిలినవాళ్ళం
మా కండలూ గుండెలూ ధారపోసి
ప్రపంచాన్ని తిప్పుతాం.
నిత్య ప్రభాతం వైపుకు
గతాన్ని మీరు పాలించినట్టే
భవిష్యత్తును మేం శాసిస్తాం.
మా ప్రవాహాని కడ్డుతగిలే
కొండరాళ్ళను పిండి చెయ్యట మెలాగో
మాకు బాగా తెలుసు.
ఔను మరి,
ప్రపంచం మాది ! *
భవిష్యత్తు మాది !

[*మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంలో చైనీస్ యువత నినాదం.]

– మొలీనా

(ఆంధ్రజ్యోతి వారపత్రిక సౌజన్యంతో)

కువెంజో

(సుప్రసిద్ధ చైనా కవి, చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కుమోజో ఇటీవల మరణించారు. 'ప్రజాతంత్ర' వారపత్రిక సౌజన్యంతో ఆయన కవితానువాదం 'బంగారం అగ్ని పరీక్షకు నిలుస్తుంది' కింద యిస్తున్నాం.)

సముద్రాలు సంక్షోభం చెందినపుడు
వీరులు తమ ధైర్యం ప్రదర్శిస్తారు
అరవై కోట్ల ప్రజలు దృఢ ఐక్యతతో స్థిర సిద్ధాంతంతో
పడిపోతున్న ఆకాశాన్ని నిలుపగలరు
అస్తవ్యస్తమయిన స్థితి నుంచి సువ్యవస్థను సృష్టించగలరు
తూర్పున సూర్యోదయమవుతుంది
ప్రపంచం కొక్కొరొకో వైతాళిక గీతాన్ని వింటుంది.
సూర్యుడుదయిస్తాడు మంచు దిబ్బలు కరుగుతాయి
రాగి, తుత్తునాగం కలిపిన మిశ్రమ లోహం కాదు బంగారం
అగ్ని పరీక్షకు అది నిలుస్తుంది.

SRJANA Telugu Monthly **Aug. 78** **H/WL-10**
Regd. No. with Registrar of News Papers 10953/67

మళ్ళీ కలాలకు సంకెళ్ళు - డాక్టర్ ఎం.వి. రమణారెడ్డి అరెస్టు - ఖండన

'ప్రభంజనం' సంపాదకులు*, డాక్టర్ ఎం. వి. రమణారెడ్డిని పోలీసులు మళ్ళీ అరెస్టుచేసి మదనపల్లిలో జరిగిన ఒక 'హత్యకేసు'లో ఇరికించి జైల్లోపెట్టారు. నిజానికి మదనపల్లిలో ఒక హత్య జరిగినట్లుగా కూడ ఎం వి ఆర్‌కు తెలియదు. మదనపల్లి స్పిన్నింగ్ మిల్లులో కార్మికులకు కార్మికులకు ఘర్షణ జరిగి, ఆ ఘర్షణలో ఒక వ్యక్తి మరణించాడు. ఇందులో కార్మికుల సమస్య వుంది గనుక యాజమాన్యంతో సంప్రదింపులు చేయడానికి కార్మిక నాయకుడు ఎం. వి. ఆర్ అక్కడికి వెళ్ళాడు. ఆయనను కూడా కేసులో ఇరికించారు మేనేజిమెంటు ప్రోత్సాహంతో పోలీసులు. ఇది ప్రభుత్వానికి, ప్రభుత్వ స్వభావానికి కొత్తకాదు. పొద్దుటూరులో ఒక సమితి మాజీ అధ్యక్షుని 'హత్యకేసు' లో డాక్టర్ ఎం వి ఆర్‌ను మొదటి ముద్దాయిగా ఇరికించి పోలీసులు దాదాపు నాలుగు సంవత్సరాలు మీసా రూపంలో అయితేనేమి, అండర్‌ట్రయల్‌గానైతేనేమి, యావజ్జీవ శిక్షపడిన ఖయిదీగా నయితేనేమి జెయిల్లో పెట్టారు. ఇటీవలనే హైకోర్టు ఆయనను నిర్దోషిగా తీర్పుచెప్పి విడుదల చేసింది. బయటికి వచ్చి ఆయన తిరిగి కార్మికోద్యమాన్ని నిర్మిస్తున్నాడు గనుక మళ్ళీ యీ కుట్ర. 71 ఆగస్టు నుంచి ఎం వి ఆర్‌ను పి.డి. కిందనో, మీసా కిందనో, క్రిమినల్ కేసుల్లోనో ఈ దోపిడీ ప్రభుత్వం జెయిళ్ళలో తోస్తూనే వున్నది. కాని కోర్టుల్లో ప్రతిసారీ ఆయన నిర్దోషిగా తీర్పు వస్తున్నది.

విప్లవ రచయితలను కుట్రకేసుల్లో ఇరికించి, తప్పుడు కేసులు మోపి వాళ్ళ నోళ్ళు నొక్కెయ్యాలని ఈ దోపిడీ వ్యవస్థ ప్రయత్నం సాగిస్తూనే వున్నదనడానికి సికిందరాబాదు కుట్రకేసు, తిరుపతి కుట్రకేసులాంటి కేసులు ఇంకా ఎత్తివేసుకోకపోవడం, మళ్ళీ ఎం వి ఆర్ అరెస్టు తాజా నిదర్శనాలు. విప్లవ భావాలను భావాలతో ఎదుర్కోలేకపోతున్న పిరికి ప్రభుత్వం కలాలను విరిచేయాలని, ఆలోచనలకు పేకులు బిగించాలని పిచ్చి ప్రయత్నాలు ఇట్లా చేస్తూనే వుంటుంది. ఈ కుట్రలను సంఘటిత ప్రజాతంత్ర ఉద్యమాల ద్వారా ఎదుర్కోవలసిన బాధ్యత మాత్రం ప్రజాస్వామ్యవాదు లందరిదీ.

29-7-78

— 'సాహితీ మిత్రులు'

---

* డాక్టర్ జాషువాహార్న్ Away with All Pests అనే సుప్రసిద్ధ గ్రంథాన్ని ఎమర్జెన్సీలో జెయిల్లో వున్న కాలంలో డాక్టర్ ఎం. వి. రమణారెడ్డి అనువదించాడు. ఇటీవలనే 'పురోగమనం' అనే పేరుతో అనుపమ ప్రచురణలు, హైదరాబాదు వాళ్ళు ఆ పుస్తకాన్ని ప్రచురించారు.

SRJANA **Rs. 1-50**
Hanamkonda, Warangal - 506 001